సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 206

సోమవారం | 16-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



అఫ్గాన్ అద్భుతం

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై 69 పరుగులతో సంచలన విజయం -14లో



మీ ఫండ్‌కు మీరే మేనేజర్..?

వ్యాపారం తెలియని కంపెనీలకు దూరం -15లో



మాజీ సీఈసీ గిల్ కన్నుమూత

కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ మనోహర్‌సింగ్ గిల్ కన్నుమూశారు.

వివరాలు 6లో ▸



ఆకలి కేకలు.. ఆర్తనాదాలు

ఇజ్రాయెల్ బలగాల నిర్బంధంలో చిక్కుకున్న గాజాలోకి ఆహారం, నీరు సరఫరా కాకుండా దారులు మూసుకుపోయాయి.


వివరాలు 6లో ▸



మన టెక్నాలజీ కోరిన అమెరికా

చంద్రయాన్‌-3 విజయంతో అమెరికా నిపుణులు మన అంతరిక్ష టెక్నాలజీని కోరుతున్నారని ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు.

వివరాలు 6లో ▸



భారత్ వెలుపల ఎత్తైన...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని అమెరికా రాజధాని వాషింగ్టన్ శివారులోని మేరీల్యాండ్‌లో ఆవిష్కరించారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

3 రోజులు మంటలు.. నెలాఖరులో వర్షాలు



రాష్ట్రంలో రానున్న 3 రోజులు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. అలాగే నెలాఖరులో బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో రెండు తుపానులు ఏర్పడే అవకాశం ఉండటంతో వాటి ప్రభావంతో 2–3 రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేసింది.

- వివరాలు 16లో▶

ఇక జేఈఈ శిక్షణ లేనట్టేనా?



ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల కోచింగ్ ప్రక్రియపై సందేహాలు నెలకొంటున్నాయి. కాలేజీల్లో ఇంకా అడ్మిషన్లు కొనసాగుతుండటంతోపాటు ఎన్నికల విధుల్లోకి కాలేజీ సిబ్బందిని తీసుకోవడం తదితర కారణాలతో ఈసారి కోచింగ్ అనుమానంగా కనిపిస్తోంది.

- వివరాలు 16లో▶

ప్రకృతి ప్రకోపానికి మూల్యం... రూ. 10.26 లక్షల కోట్లు!



కరువు, వరదలు, తుపాన్లు, భూకంపం, కార్చిచ్చుల వంటి విపత్తుల వల్ల పంటలు, పశువులకు ఏటా రూ. 10.26 లక్షల కోట్ల మేర నష్టం జరుగుతున్నట్లు ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా అధ్యయనంలో తేలింది.

- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



ఇప్పుడు మన్ కీ గీత్..!

ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్





60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏం ఒరగబెట్టింది..

మరో చాన్స్ ఎందుకివ్వాలి?

వారి హయాంలో కాలిపోయిన మోటార్లు.. ఎండిపోయిన పొలాలే.. : సీఎం కేసీఆర్

మరి ఇప్పుడు కడుపు నిండా కరెంట్.. కల్లాల నిండా వడ్లు

మెదడు కరగదీసి రాష్ట్రాన్ని ముందుకు నడిపించాం

చాలా అంశాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచాం

రాయి ఏదో, రత్నమేదో ప్రజలు ఆలోచించాలి

ఆగమాగం కాకుండా ఆలోచించి ఓటు వేయాలని పిలుపు

95 నుంచి 100 సీట్లు గెలిచేందుకు ఈ సభే నాంది అని వ్యాఖ్య

హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాదసభతో ఎన్నికల శంఖం పూరించిన బీఆర్‌ఎస్ అధినేత

సాక్షి, సిద్దిపేట/ హుస్నాబాద్: ''కొన్ని పార్టీలు వచ్చి తమకు ఒక్క చాన్స్ ఇవ్వాలని అడుగుతున్నాయి. కానీ ప్రజలు ఇప్పటికే పది చాన్సులు ఇచ్చారు కదా.. 60ఏళ్లు కాంగ్రెస్ పార్టీయే రాజ్యమేలింది కదా.. ఏం ఒరగబెట్టారు? వారికి ఇంకో చాన్స్ ఎందుకివ్వాలి?'' అని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రశ్నించారు. దేశంలో, రాష్ట్రంలో దళితులు ఇంకా ఇంత దుస్థితిలో ఉన్నారంటే.. 75 ఏళ్ల స్వాతంత్య్రం తర్వాత కూడా ఇంకా పేదరికం కమ్ముకుని ఉన్నదంటే సిగ్గుతో తలదించుకోవాలని వ్యాఖ్యానించారు. 60, 70 ఏళ్ల కిందే దళితబంధు వంటి పథకాన్ని ప్రారంభించి ఉంటే.. ఇవాళ దళితుల్లో పేదరికం ఉండేదా అన్నది ఆలోచించాలని పేర్కొన్నారు. ఇవాళ ఎవరు ఒక్క చాన్స్ అడుగుతున్నారో.. వాళ్లకు 10, 12 చాన్సులు ఇచ్చినా ఏమీ మిగతా 2వ పేజీలో ▶

చంటి బిడ్డల్లా సాదుకున్నా!

- చిన్న పొరపాట్లతో ఓటమి తెచ్చుకోవద్దు
- బీఆర్‌ఎస్ అభ్యర్థులకు కేసీఆర్ దిశానిర్దేశం

2లో

69 మందికి బీఆర్‌ఎస్ బీఫారాలు

- సెంటిమెంట్ ప్రకారం ఆరు సంఖ్య వచ్చేలా పంపిణీ

పేదలందరికీ రూ.5 లక్షల బీమా!

తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి వర్తింపు.. 'రైతుబీమా' తరహాలో అమలు

మరింత సంక్షేమమే లక్ష్యం.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో వెల్లడి

రాష్ట్రంలో ప్రజలకు మరింత సంక్షేమాన్ని అందిస్తామంటూ బీఆర్‌ఎస్ తమ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇప్పటికే అందుతున్న సంక్షేమ పథకాలను విస్తరించడంతోపాటు కొత్త పథకాలనూ అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలను, రైతులను, మహిళలను ఆకట్టుకునేలా ఆసరా పింఛన్ల పెంపు, తక్కువ ధరకే సిలిండర్, 'సౌభాగ్య లక్ష్మి' పథకం, జీవిత బీమా, ఇళ్ల స్థలాల పంపిణీ, రైతు బంధు సొమ్ము పెంపు వంటి హామీలు ఇచ్చారు. మొత్తంగా రాష్ట్రంలో కోటి కుటుంబాలను ఆకట్టుకునేలా వివిధ అంశాలను మేనిఫెస్టోలో చేర్చారు. 2లో

సౌభాగ్య లక్ష్మి: అర్హులైన మహిళలకు ప్రతీ నెలా రూ.3 వేల జీవన భృతి

కేసీఆర్ బీమా: తెల్ల రేషన్‌కార్డు ఉన్న పేద కుటుంబాలకు రైతు బీమా తరహాలో ఎల్ఐసీ ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా

కేసీఆర్ ఆరోగ్య రక్ష: ఆరోగ్యశ్రీ గరిష్ట పరిమితి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంపు (జర్నలిస్టులకూ వర్తింపు)

ఆసరా రూ. 5వేలు: వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, గీత కార్మికులు తదితరులకు ప్రతీనెలా ఇచ్చే మొత్తం రూ.5 వేలకు పెంపు. వచ్చే ఏడాది మార్చిలో రూ.3,016కు, తర్వాత ఏటా మరో రూ.500 చొప్పున రూ.5 వేల దాకా పెంపు

అన్నపూర్ణ: 93 లక్షల కుటుంబాలకు రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ

రైతుబంధు పెంపు: ప్రస్తుతమున్న ఎకరాకు రూ.10 వేల సాయం.. తొలి ఏడాది రూ.12 వేలకు, క్రమంగా 16 వేలకు పెంపు

రూ.400కే సిలిండర్: అర్హులైన కుటుంబాలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్. (గుర్తింపు పొందిన జర్నలిస్టులకూ వర్తింపు)

ఇళ్లు, ఇళ్ల స్థలాలు: డబుల్ బెడ్రూం పథకం కొనసాగింపు, హైదరాబాద్‌లో మరో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం. గృహలక్ష్మి పథకం కొనసాగింపు, పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ.

55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

17 మంది రెడ్డి, ఏడుగురు వెలమ, 12 మంది బీసీలకు చోటు

12 ఎస్సీ, 2 ఎస్టీ స్థానాలకూ అభ్యర్థుల ఎంపిక

మైనంపల్లి, ఉత్తమ్ కుటుంబాలకు రెండు సీట్ల చొప్పున కేటాయింపు

ఢిల్లీలో జాబితా విడుదల చేసిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్

కమ్యూనిస్టులతో పొత్తుల స్పష్టత తర్వాతే మలి జాబితా



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 55 మంది పేర్లను ప్రకటించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం ఉదయం ఢిల్లీలో ఈ జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలోని మొత్తం 55 స్థానాల్లో.. 17 మంది రెడ్లు, ఏడుగురు వెలమ, 12 మంది బీసీ, ముగ్గురు ముస్లిం, ఇద్దరు బ్రాహ్మణ అభ్యర్థులకు చోటు కల్పించారు. వీటితోపాటు 12 ఎస్సీ, 2 ఎస్టీ రిజర్వుడ్ స్థానాలకూ అభ్యర్థులను ప్రకటించారు. ఇటీవల పార్టీలో చేరిన మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్‌రావు ఇద్దరికీ సీట్లు దక్కాయి. మరోవైపు ఎంపీ ఉత్తమ్‌తోపాటు ఆయన భార్య పద్మావతిలకు తొలి జాబితాలోనే సీట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ నుంచి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ తదితర సీనియర్ల పేర్లు ఈ జాబితాలో లేకపోవడం గమనార్హం.

లెఫ్ట్ పొత్తు తేలాక రెండో జాబితా

ఇండియా కూటమిలో భాగంగా వామపక్షాలతో మిగతా 5వ పేజీలో ▶



కాంగ్రెస్ హామీలకు కేసీఆర్ రాజముద్ర

- ఆరు గ్యారంటీలను కాపీ కొట్టి మేనిఫెస్టో ప్రకటించారు
- ఆయన పాలనకు ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది
- కేసీఆర్ వస్తానంటే 17న మధ్యాహ్నం 12 గంటలకు అమరవీరుల స్థూపం వద్దకు వస్తా
- టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు -5లో

జంగ్ తెలంగాణ

మాటలు జాగ్రత్త

భిన్న కుల, మత, భాషల ప్రజల మధ్య విద్వేషాలు పెంచొద్దు

మొక్కితే విజయం.. ముడుపు కడితే గెలుపు

పసుపు.. చక్కెర

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ రెండే ప్రధానాంశాలు

రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు వ్యతిరేక పవనాలు

- వివరాలు 7,8 పేజీల్లో

గత హామీలు ఏమయ్యాయి?



బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం

- 2014 నుంచి ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ అమలు చేయలేదు
- ఓట్ల కోసం మళ్లీ ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే ప్రయత్నం
- 80 వేల పుస్తకాలు చదివిన జ్ఞానంతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు
- కేసీఆర్‌వి అన్నీ వరస్ట్ పాలసీలే అని మండిపాటు

సాక్షి, హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఓట్ల కోసం మళ్లీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజల చెవుల్లో గులాబీ పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గతంలో ఇచ్చిన హామీలు విస్మరించి ఎన్నికల నేపథ్యంలో మళ్లీ ప్రజలను మభ్యపెట్టి మోసం చేసేందుకు కొత్తవి ప్రకటించారని మండిపడ్డారు. వందల హామీలు ఇచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని, కేసీఆర్ సకల జనుల ద్రోహి అని దుయ్యబట్టారు. ఆదివారం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తాజాగా విడుదల చేసిన మేనిఫెస్టోపై స్పందించారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికలు, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఏ హామీలు ఇచ్చారో కేసీఆర్ బయట పెట్టి మాట్లాడాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు ఏ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు మిగతా 3వ పేజీలో ▶

నేడు బీజేపీ ఫస్ట్ లిస్ట్?

- ఢిల్లీలో ఇవాళ జరిగే సీఈసీ భేటీలో ఖరారు చేసే అవకాశాలు
- హాజరుకానున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల, కోమటిరెడ్డి?

- వివరాలు 3లో

బీఆర్‌ఎస్ కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలి

- కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి
- కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు.. పేదల ఇళ్ల కోసం కేంద్రం ఇస్తున్న నిధులను తొక్కిపెట్టారని ఫైర్ -16లో

కేసీఆర్ తాయిలాలను ప్రజలు నమ్మరు

- బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ - వివరాలు 3లో

క్లుప్తంగా...

నేడు జనగామ, భువనగిరిలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలు

జనగామ/సాక్షి, యాదాద్రి: ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కె.చంద్రశేఖర్‌రావు సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో, యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరిలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలకు హాజరుకానున్నారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి మధ్యాహ్నం 1.45 గంటలకు వికాస్‌నగర్‌లోని హెలిపాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి 2 గంటలకు సభ జరిగే జనగామ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల మైదానానికి చేరుకుని ప్రసంగిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 3 గంటలకు భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

సీఎం నామినేషన్‌కు పింఛనుదారుల 'ఆసరా'

కేసీఆర్‌కు నామినేషన్ డబ్బులిచ్చిన ముఖరా (కె) గ్రామస్తులు

సాక్షి, హైదరాబాద్: తమకు ప్రతి నెలా ఆసరా పింఛను ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం ఇచ్చోడ మండలం ముఖరా (కె)కు చెందిన పలువురు లబ్ధిదారులు ఆదివారం సీఎంను కలిశారు. గ్రామంలో ఆసరా పింఛను పొందుతున్న వంద మంది వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు తాము పొదుపు చేసుకున్న మొత్తంలో నుంచి తలో రూ.వేయి చొప్పున పోగు చేశారు. ఇలా సమకూరిన రూ.లక్షను గ్రామ సర్పంచ్ మీనాక్షి గాడ్గే ద్వారా సీఎం కేసీఆర్‌కు అందజేశారు. సీఎం, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చెరొక రూ.50 వేల చొప్పున ఈ మొత్తాన్ని ఖర్చు చేయాల్సిందిగా కోరారు. తన నామినేషన్ ఖర్చులకు ఆసరా లబ్ధిదారులు డబ్బు ఇవ్వడం పట్ల సీఎం అభినందించారు.

డిక్లరేషన్, గ్యారంటీలను సవరించి మేనిఫెస్టో అంటున్నారు

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ఎవరూ నమ్మరు: మాజీ ఎంపీ మల్లురవి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించిన డిక్లరేషన్‌లు, ఆరు గ్యారంటీలను అటూ ఇటూ సవరించి అదే తమ ఎన్నికల మేనిఫెస్టో అని బీఆర్‌ఎస్ ప్రకటించిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను తెలంగాణ ప్రజలెవ్వరూ నమ్మబోరని వ్యాఖ్యానించారు. ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేత కేతూరి వెంకటేశ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ...కేసీఆర్ చేతిలో ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని వర్గాలు మోసపోయాయని, ఆయన్ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం జరిగాయని, వాటి పట్ల ప్రజల్లో నమ్మకం కలిగిందని, ఈ నేపథ్యంలో కేసీఆర్ అవే పథకాలను కాపీ కొట్టి అమలు చేస్తామని చెబుతున్నారన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను నమ్మి మోసపోవద్దు

వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించాలి: ప్రవీణ్‌కుమార్



దహెగాం/బెజ్జూర్: దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్న బీఆర్‌ఎస్‌ను ఓడించాలని, ఆ పార్టీ మేనిఫెస్టోను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కుమురంభీం జిల్లా దహెగాం మండలంలో ఆదివారం ఆయన అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం బెజ్జూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విషాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రవల్లిక కుటుంబానికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం ఆమె వాట్సాప్ చాటింగ్ వివరాలు బయటపెట్టి రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి చీకటి దందాకు తెరతీసిన చైర్మన్, సభ్యులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తో జరిపిన ఫోన్ సంభాషణల వివరాలను సిట్ అధికారులు ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ కాల్ డేటా తీసుకోలేని పోలీసులు, కేవలం ఆరుగంటల్లోనే మృతురాలి ఫోన్, వాట్సాప్ కాల్‌డేటా ఎలా బయటకు తీశారని ప్రశ్నించారు.

కొండంత రాగం తీసి.. పిల్లి కూత కూసినట్లు ఉంది

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై షర్మిల

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో కొండంత రాగం తీసి పిల్లికూత కూసినట్లుందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఎద్దేవాచేశారు. ఆదివారం ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోపై సెటైర్ వేశారు. బతుకు మీద ఇవ్వాల్సిన ధీమాను పక్కన పెట్టి పోయాక బీమా ఇస్తాడట అంటూ మండిపడ్డారు. 'నిరుద్యోగ భృతి అని గత మేనిఫెస్టోలో పెట్టిన పథకానికే దిక్కులేదు కానీ.. మళ్లీ కొత్త కథ మొదలు పెట్టిండు. కొత్త పథకాలు అంటూ డ్రామాలు తప్ప మరోటి లేదు. సున్నా వడ్డీకే రుణాలు అని మోసం చేసిన దొర.. ప్రతి మహిళకు నెలకు రూ.3 వేలు ఇస్తామనడం హాస్యాస్పదం. విడతల వారీగా పెన్షన్ల పెంపు ఒక పెద్ద జోక్. రుణమాఫీపై దొర యూటర్న్ తీసుకున్నారు' అని షర్మిల పేర్కొన్నారు.



ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ అభ్యర్థుల భేటీలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సత్యవతిరాథోడ్, సబితారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, కేటీఆర్, నామా నాగేశ్వరరావు, కేశవరావు, పోచారం, ఇంద్రకరణ్, శ్రీనివాస్‌గౌడ్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి

చంటి బిడ్డల్లా సాదుకున్నా..!

చిన్న పొరపాట్లతో ఓటమి తెచ్చుకోవద్దు | బీఆర్‌ఎస్ అభ్యర్థులకు కేసీఆర్ దిశానిర్దేశం

- ప్రజల నాడి తెలిసినవాడిగా చెప్తున్నా.. మళ్లీ గెలుస్తున్నాం
- పదేళ్లుగా మనమే అధికారంలో ఉండటంతో ప్రజల్లో కొంత అసహనం ఉండొచ్చు
- ఓపికగా వ్యవహరించాలని స్పష్టం చేసిన బీఆర్‌ఎస్ అధినేత

సాక్షి, హైదరాబాద్: ''ఎమ్మెల్యేలను చంటి బిడ్డల్లా సాదుకున్నా. చిన్న చిన్న పొరపాట్లతో ఓటమి కొని తెచ్చుకోవద్దు. 60రోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించినా చాలా మంది నియోజకవర్గాల్లో పార్టీలోని అంతర్గత అసమ్మతిని చక్కదిద్దుకోలేక పోయారు. పార్టీ అభ్యర్థులుగా ప్రకటించగానే ఎమ్మెల్యేలు అయినట్టుగా భావించకూడదు. ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేయకపోతే ప్రజలు బండకేసి కొడతారని చరిత్ర చెప్తోంది..'' అని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ తమ పార్టీ అభ్యర్థులను హెచ్చరించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో పార్టీ అసెంబ్లీ అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. ఎంత చిన్నస్థాయి కార్యకర్త అయినా కలుపుకొని వెళ్లాలని.. గతంలో జూపల్లి కృష్ణారావు వంటి ఒకరిద్దరు నేతలు అలాంటి కారణాలతోనే ఓటమి పాలయ్యారని కేసీఆర్ వివరించారు. నాయకులను నిశితంగా పరిశీలించాకే ఓటర్లు నిర్ణయం తీసుకుంటారని.. ఏ ఒక్కరినీ తక్కువగా అంచనా వేయకుండా అందరితో కలసి పనిచేయాలని సూచించారు. వరుసగా పదేళ్లపాటు మనం అధికారంలో ఉన్నందున ప్రజల్లో కొంత అసహనం ఉండటం సహజమేని.. ప్రజల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు సహనంతో సమాధానాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. సర్వేల ఫలితాలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయని.. ప్రజల నాడి తెలిసిన వ్యక్తిగా చెప్తున్నా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మనమే గెలుస్తున్నామని భరోసా ఇచ్చారు. మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు.

అభ్యర్థులందరి అఫిడవిట్ల పరిశీలన!

నామినేషన్లు, అఫిడవిట్ల దాఖలు సహా ఎన్నికల సంఘం నిబంధనలను పాటించడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అభ్యర్థులను సీఎం కేసీఆర్ హెచ్చరించారు. ''ఇంతకుముందు మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వంటి నేతలు భారీ మెజారిటీతో గెలుపొందినా అఫిడవిట్లలోని కొన్ని సాంకేతిక అంశాలతో ఇబ్బందులు పడ్డారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా సమర్పించే అఫిడవిట్లలో తప్పులు లేకుండా చూసుకోవాలి. కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలు, నేరారోపణలకు సంబంధించిన అంశాలు ఉంటే కచ్చితంగా పేర్కొనండి. ట్రాఫిక్ చలాన్లు, ఫోన్ బిల్లులు, విద్యుత్ బిల్లుల బకాయిలు, ఆదాయ పన్ను రిటర్నులు వంటివీ జాగ్రత్తగా చూసుకోండి. ఈసారి పార్టీ అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లను బీఆర్‌ఎస్ లీగల్ సెల్ స్క్రూటినీ చేస్తుంది. ఈ నెల 21వ తేదీ సాయంత్రం లోపు అఫిడవిట్లను తెలంగాణభవన్‌లో డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ భరత్‌కుమార్ గుప్తా బృందానికి అందజేయాలి..'' అని కేసీఆర్ ఆదేశించారు. పార్టీ నిధి నుంచి ఎన్నికల ఖర్చు కోసం అభ్యర్థులకు ఇస్తున్న డబ్బులతో ప్రత్యేక ఖాతాను తెరవాలని సూచించారు. నామినేషన్ దాఖలు కోసం చివరి తేదీ వరకు వేచి చూడొద్దని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యయం వివరాలను ఏ రోజుకారోజే అధికారులకు అప్పగించి రశీదులు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ఏజెంట్ల నియామకం మొదలుకుని ఓట్ల లెక్కింపు దాకా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాను తొలిసారి పోటీ చేసినప్పుడు ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా లేనందునే ఓటమి పాలయ్యానని పేర్కొన్నారు. పోలింగ్ రోజున అన్ని బూత్‌లను పార్టీ అభ్యర్థులు పరిశీలించాలన్నారు.

69 మందికి బీఫారాలు.. రూ.40 లక్షల చెక్కులు

అభ్యర్థులకు బీఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం ఉదయం ప్రగతిభవన్‌లో ప్రారంభించారు. తన సెంటిమెంట్ అయిన ఆరు సంఖ్య వచ్చేలా 15 న 51 మంది అభ్యర్థులకు తొలి విడతగా పంపిణీ చేశారు. ఇందులోనూ ఆరుగురు అభ్యర్థులకు సంబంధించి ప్రగతిభవన్‌లో, మిగతా వారికి తెలంగాణ భవన్‌లో అందజేశారు. నిర్ణయించిన ముహూర్తం మేరకు ఉదయం ప్రగతిభవన్‌లో జరిగిన కార్యక్రమంలో జీవన్‌రెడ్డి (ఆర్మూర్), కేటీఆర్ (సిరిసిల్ల), హరీశ్‌రావు (సిద్దిపేట), పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగాం), బాల్క సుమన్ (చెన్నూరు), కేసీఆర్ (గజ్వేల్) బీఫారాలు అందుకున్నారు. తెలంగాణభవన్‌లో మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ తరఫున కామారెడ్డి బీఫారంను సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తీసుకున్నారు. తన తల్లి మృతిచెందిన నేపథ్యంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి (బాల్కొండ) రాలేకపోవడంతో ఆయన తరఫున ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఫాం అందుకున్నారు. పార్టీ అభ్యర్థులకు బీఫారాలతోపాటు ప్రచార ఖర్చు నిమిత్తం పార్టీ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.40లక్షల చొప్పున చెక్కులను కూడా అందజేశారు. అయితే కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టిన ఐదు సీట్లకుగాను పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) ఒక్కరే ఆదివారం బీఫారం అందుకున్నారు. నర్సాపూర్, మల్కాజిగిరి, గోషామహల్, నాంపల్లి సీట్లలో ఎవరు పోటీచేస్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఆదివారం సాయంత్రమే రెండో విడత బీఫారాల పంపిణీ మొదలైంది. కేసీఆర్ చేతుల మీదుగా మరో 18 మంది అభ్యర్థులు బీఫారాలు తీసుకున్నారు. బీఫారాలు తీసుకున్నవారి సంఖ్య 69కి చేరింది.



మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు బీఫారాలను అందిస్తున్న సీఎం కేసీఆర్

బీఆర్‌ఎస్ బీఫారాలు పొందిన అభ్యర్థులు

అభ్యర్థి	నియోజకవర్గం
కోనేరు కోనప్ప	సిర్పూర్
దుర్గం చిన్నయ్య	బెల్లంపల్లి (ఎస్సీ)
దివాకర్‌రావు	మంచిర్యాల
కోవ లక్ష్మి	ఆసిఫాబాద్ (ఎస్టీ)
భూక్యా జాన్సన్ నాయక్	ఖానాపూర్ (ఎస్టీ)
జోగు రామన్న	ఆదిలాబాద్
అనిల్ జాదవ్	బోథ్ (ఎస్టీ)
ఇంద్రకరణ్‌రెడ్డి	నిర్మల్
విఠల్‌రెడ్డి	ముథోల్
కె.చంద్రశేఖర్‌రావు	కామారెడ్డి
మహ్మద్ షకీల్	బోధన్
హన్మంత్ షిండే	జుక్కల్ (ఎస్సీ)
పోచారం శ్రీనివాస్‌రెడ్డి	బాన్సువాడ
జే.సురేందర్	ఎల్లారెడ్డి
బి.గణేశ్‌గుప్తా	నిజామాబాద్ అర్బన్
బాజిరెడ్డి గోవర్ధన్	నిజామాబాద్ రూరల్
వేముల ప్రశాంత్‌రెడ్డి	బాల్కొండ
పట్నం నరేందర్‌రెడ్డి	కొడంగల్
ఎస్.రాజేందర్‌రెడ్డి	నారాయణపేట
సి.లక్ష్మారెడ్డి	జడ్చర్ల
ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి	దేవరకద్ర
వి.శ్రీనివాస్‌గౌడ్	మహబూబ్‌నగర్
సీహెచ్.రామ్మోహన్‌రెడ్డి	మక్తల్
ఎస్.నిరంజన్‌రెడ్డి	వనపర్తి
బి.కృష్ణమోహన్‌రెడ్డి	గద్వాల
మర్రి జనార్దన్‌రెడ్డి	నాగర్ కర్నూల్
గువ్వల బాలరాజు	అచ్చంపేట (ఎస్సీ)
జైపాల్‌యాదవ్	కల్వకుర్తి
అంజయ్యయాదవ్	షాద్‌నగర్
బి.హర్షవర్ధన్‌రెడ్డి	కొల్లాపూర్
పద్మాదేవేందర్‌రెడ్డి	మెదక్
ఎం.భూపాల్‌రెడ్డి	నారాయణఖేడ్
చంటి క్రాంతికిరణ్	ఆందోల్ (ఎస్సీ)
జి.మహిపాల్‌రెడ్డి	పటాన్‌చెరు
కె.ప్రభాకర్‌రెడ్డి	దుబ్బాక
రేగా కాంతారావు	పినపాక (ఎస్టీ)
హరిప్రియనాయక్	ఇల్లెందు (ఎస్టీ)
పువ్వాడ అజయ్	ఖమ్మం
కె.ఉపేందర్‌రెడ్డి	పాలేరు
ఎల్.కమల్‌రాజ్	మధిర(ఎస్సీ)
బానోత్ మదన్‌లాల్	వైరా (ఎస్టీ)
వనమా వెంకటేశ్వరరావు	కొత్తగూడెం
సండ్ర వెంకట వీరయ్య	సత్తుపల్లి (ఎస్సీ)
నాగేశ్వర్‌రావు	అశ్వారావుపేట (ఎస్టీ)
తెల్లం వెంకట్రావు	భద్రాచలం (ఎస్టీ)
పైళ్ల శేఖర్‌రెడ్డి	భువనగిరి
కె.తారక రామారావు	సిరిసిల్ల
పల్లా రాజేశ్వర్‌రెడ్డి	జనగామ
టి.హరీశ్‌రావు	సిద్దిపేట
ఎ.జీవన్‌రెడ్డి	ఆర్మూర్
బాల్క సుమన్	చెన్నూరు (ఎస్సీ)
జి.జగదీశ్‌రెడ్డి	సూర్యాపేట
రవీంద్ర నాయక్	దేవరకొండ
బొల్లం మల్లయ్య యాదవ్	కోదాడ
కంచర్ల భూపాల్‌రెడ్డి	నల్గొండ
నోముల భగత్	నాగార్జునసాగర్
కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి	మునుగోడు
దాసరి మనోహర్‌రెడ్డి	పెద్దపల్లి
రసమయి బాలకిషన్	మానకొండూరు
దాస్యం వినయభాస్కర్	వరంగల్ పశ్చిమ
నన్నపనేని నరేందర్	వరంగల్ తూర్పు
పెద్ది సుదర్శన్‌రెడ్డి	నర్సంపేట
బడే నాగజ్యోతి	ములుగు
అరికెపూడి గాంధీ	శేరిలింగంపల్లి
పైలట్ రోహిత్‌రెడ్డి	తాండూరు
పాడి కౌశిక్‌రెడ్డి	హుజూరాబాద్
వొడితెల సతీశ్‌కుమార్	హుస్నాబాద్
చిరుమర్తి లింగయ్య	నకిరేకల్
గాదరి కిశోర్‌కుమార్	తుంగతుర్తి

పేదలందరికీ రూ.5లక్షలు బీమా!

- తెల్ల రేషన్‌కార్డు ఉన్న కుటుంబాలకు వర్తింపు.. 'రైతుబీమా' తరహాలో అమలు
- మరింత సంక్షేమమే లక్ష్యం.. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పరిధిని విస్తరించడంతోపాటు కొత్తగా సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) ఆదివారం అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులతో కలసి బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. రైతు బంధు, ఆసరా, ఆరోగ్య రక్ష వంటి పాత పథకాల పరిధిని విస్తరించడం ద్వారా రాష్ట్రంలోని సుమారు కోటికి పైగా కుటుంబాలను ఆకట్టుకునేలా మేనిఫెస్టోను ప్రకటించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ప్రతిగా 'సౌభాగ్యలక్ష్మి', రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అందులో చేర్చారు. పేదలకు రూ.5 లక్షల జీవిత బీమా, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా వంటి కొత్త పథకాలను ప్రకటించారు. అగ్ర వర్ణ పేద విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని పథకాలు, హామీలివీ..

దివ్యాంగుల పెన్షన్లు: ప్రస్తుత రూ.4,016కు ఏటా రూ.300 చొప్పున చేర్చుతూ రూ.6,016కు పెంపు

రెసిడెన్షియల్ విద్యా సంస్థలు: అగ్రవర్ణ పేదల కోసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున 119 రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటు. ఇప్పటికే వివిధ వర్గాల కోసం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ పాఠశాలలను డిగ్రీ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయడం.

ఉద్యోగులను కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) నుంచి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్)కు తిరిగి మార్చే అంశంపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ. దాని నివేదిక ఆధారంగా నిర్ణయం.

మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు

అనాథ పిల్లల కోసం ప్రత్యేక పాలసీ


అసైన్డ్ భూముల విముక్తి కోసం చర్యలు

మైనారిటీ సంక్షేమ పథకాలు మరింత విస్తరణ

మేనిఫెస్టోలో చెప్పినవీ, చెప్పనివీ అమలు చేశాం

రాష్ట్ర ఆదాయం పెంచి.. పేదలకు పంచాలన్నదే మా లక్ష్యం: సీఎం కేసీఆర్

- సంక్షేమం, అభివృద్ధిలో దేశానికే తలమానికంగా ఎదిగామని వెల్లడి
- ప్రస్తుత విధానాలు కొనసాగిస్తూ సందర్భోచితంగా ఉద్దీపన కల్పిస్తామని ప్రకటన



బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను విడుదల చేస్తున్న కేసీఆర్. చిత్రంలో కేశవరావు, నామా నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ సమయంలో తెలంగాణ అత్యంత సంక్లిష్ట పరిస్థితిలో ఉండేదని, ఆర్థికవేత్తల సాయంతో రాష్ట్ర పరిస్థితిపై లోతుగా మదింపు చేసుకుని ప్రయాణాన్ని ప్రారంభించామని భారత్ రాష్ట్ర సమితి అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. 2014, 2018 ఎన్నికల మేనిఫెస్టోలలో చేర్చిన హామీలు కేవలం పది శాతమేనని.. ప్రజల అవసరాలు, స్వీయ అనుభవం ఆధారంగా మరో 90% కొత్త పథకాలను అమలు చేశామన్నారు. కేసీఆర్ ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి పేదలకు పెంచాలన్నదే తమ విధానమని.. మళ్లీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే హామీ లన్నింటినీ అమలు చేస్తా మని ప్రకటించారు. గతంలో మేనిఫెస్టో చెప్పినవీ, చెప్పనివీ కలిపి 99.9 % హామీలను నెరవేర్చామని చెప్పారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం లక్ష్యంగా పనిచేశామన్నారు. దళిత బంధు ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం, గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చడం, పోడు భూముల పట్టాలు, గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు వంటివి అమలు చేశామన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టిన బీసీ బంధు వంటి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. చేపలు, గొర్రెల పెంపకంలో తెలంగాణ నంబర్ వన్ స్థానానికి ఎదిగిందన్నారు. ఉత్తమ వ్యవసాయ, తాగునీరు, విద్యుత్, సాగునీరు, దళిత, సంక్షేమ, విద్య, ఆరోగ్య, పారిశ్రామిక, గృహ నిర్మాణ పాలసీలను రూపొందించుకున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంలో దేశానికే తలమానికంగా ఎదిగామని పేర్కొన్నారు. ప్రస్తుత విధానాలను కొనసాగిస్తూనే 'సందర్భోచిత ఉద్దీపన'తో ముందుకు సాగుతామని ప్రకటించారు.

ఏపీలో పెన్షన్ల తీరు బాగుంది

ప్రస్తుతం తెలంగాణలో ఇస్తున్న ఆసరా పెన్షన్ రూ.2,016ను దశల వారీగా పెంచి రూ.5 వేలకు చేర్చుతామని సీఎం కేసీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెన్షన్ల తీరు బాగుందన్నారు. పేదలకు పెన్షన్‌ను క్రమంగా పెంచుతూ ప్రతీ నెలా రూ.3 వేల చొప్పున అందించే పథకాన్ని ఏపీ విజయవంతంగా అమలు చేస్తోందని కితాబునిచ్చారు.

కేసీఆర్‌తో పొన్నాల దంపతుల భేటీ

బీఆర్‌ఎస్‌లో చేరికపై నేడు నిర్ణయం.. జనగామ సభ వేదికగా పార్టీలోకి..

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రెండు రోజుల క్రితం రాజీనామా చేసిన పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య దంపతులు.. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆదివారం సాయంత్రం ప్రగతిభవన్‌కు వెళ్లిన పొన్నాల దంపతులను సీఎం కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. పుష్పగుచ్ఛం అందజేసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కె.కేశవరావు, జనగామ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీని వీడిన పొన్నాలను బీఆర్‌ఎస్‌లోకి రావాల్సిందిగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానించిన విషయం తెలిసిందే. కేసీఆర్‌తో భేటీ తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని పొన్నాల వెల్లడించిన నేపథ్యంలో ఆదివారం కేసీఆర్‌తో జరిగిన భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. సోమవారం జనగామ నియోజకవర్గ కేంద్రంలో జరిగే బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభకు రావాల్సిందిగా సీఎం కేసీఆర్, పొన్నాలను ఆహ్వానించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జనగామ సభ వేదికగా పొన్నాల గులాబీ పార్టీలో చేరే అవకాశమున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.



సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పొన్నాల దంపతులు

మరో చాన్స్ ఎందుకివ్వాలి?

▶ మొదటి పేజీ తరువాయి

చేయలేదని, వారి విధానాల లోపమే ప్రస్తుత దుస్థితికి కారణమని స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''సభలో చెప్పిన మాటలు ఇక్కడే విడిచిపెట్టి పోవద్దు. మీ పట్టణం, గ్రామానికి, తండాకు వెళ్లిన తర్వాత కేసీఆర్ చెప్పినదాంట్లో నిజమెంత, అబద్ధమెంత అనేది ఆలోచించాలి. ఎన్నికలు చాలా వస్తాయి పోతాయి. కానీ ప్రజలు ఆగమాగం కావద్దు. రాయి ఏదో, రత్నమేదో ఆలోచించాలి. మనకు పని కొచ్చేది ఏదో గుర్తుపట్టాలి. 'తీర్థం పోతాం సమ్మక్క అంటే నేను కూడా వస్తా రామక్క...' అన్నట్టు అలవోకగా ఓటేయొద్దు. బామ్మర్ది చెప్పాడనో, మా మేనమామ చెప్పాడనో ఓట్లు వేయొద్దు. స్పష్టంగా ఆలోచించి ఓట్లు వేయాలి.

మేధో మథనం చేసినం.. మెదడు కరగదీసినం

తొమ్మిదిన్నరేళ్ల కింద తెలంగాణలో ఎక్కడ చూసిన భయమయ్యే పరిస్థితి ఉండేది. వలసలు, కరువు.. సాగునీరు లేదు.. మంచినీళ్ల లేవు.. కరెంటు లేదు.. ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. కొత్త కుండలో ఈగ సొచ్చినట్టు.. కొత్త సంసారం. ఎక్కడ మొదలుపెట్టాలి? ఏవిధంగా పైకి తీసుకెళ్లాలి?ప్రజానీకాన్ని ఎలా ఆదుకోవాలనే సమస్య ఉండేది. తెలంగాణ వచ్చాక ప్రజలు బీఆర్‌ఎస్ మీదనే బాధ్యత పెట్టడంతో.. ఆర్థిక నిపుణులతో రెండు మూడు నెలల పాటు మేధోమథనం చేసినం. మెదడు కరగదీశాం. ఇప్పుడు అన్నిరంగాల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తలసరి ఆదాయం, విద్యుత్, సాగు, తాగునీటిలో, పచ్చదనం, పంచాయతీరాజ్ వ్యవస్థ, పారిశ్రామిక విధానం అమలులో టాప్‌గా మారింది.



హుస్నాబాద్ అభ్యర్థి సతీశ్‌కు బీఫారంను అందజేస్తున్న సీఎం కేసీఆర్

ప్రాజెక్టులు పూర్తి చేసి నీళ్లిచ్చాం..

కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందించింది. భూగర్భ జలాలు కూడా పెరిగి వ్యవసాయానికి స్థిరత్వం వచ్చింది. కడుపు నిండా కరెంట్.. కల్లాల నిండా వడ్లు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు కాలిపోయేవి. ఇప్పుడు నాణ్యమైన విద్యుత్ అందిస్తుండటంతో మోటార్లు కాలడం లేదు. రైతులు కంటి నిండా నిద్ర పోతున్నారు. ఒకప్పుడు హుస్నాబాద్ కరువు ప్రాంతం. గతంలో హుస్నాబాద్ వాగుపై ఒక్క చెక్‌డ్యాం ఉండేది కాదు. నీళ్లుండేవి కాదు. ఇవాళ హెలికాప్టర్‌లో వస్తుంటే.. వాగుపై వరుసగా మూడు చెక్‌డ్యాంలు, వాటిలో నిండా నీళ్లు, కనుచూపు మేర పచ్చని పంట పొలాలు కనిపించాయి. కేంద్ర సహకారం లేకున్నా, ప్రతిపక్షాలు అడ్డుకునేందుకు కుట్రలు చేసినా.. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు చేసుకున్నాం. ఎన్నికల తర్వాత మూడు నాలుగు నెలలు కష్టపడితే అది పూర్తయి లక్ష ఎకరాలకు నీళ్లు అందుతాయి.

మా మేనిఫెస్టోతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు: హరీశ్‌రావు

సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను చూసి ప్రజల హృదయాలు ఉప్పొంగిపోతుంటే.. మరోవైపు ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. హుస్నాబాద్ ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హుస్నాబాద్ నుంచి ప్రచారం ప్రారంభిస్తే 88 సీట్లతో విజయం సాధించామని గుర్తు చేశారు. మళ్లీ ఇక్కడి నుంచే బీఆర్‌ఎస్ ప్రచారం ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఇక్కడి ఎల్లమ్మ దయతో ఈసారి సెంచరీ సాధించి తీరుతామన్నారు. సీఎం కేసీఆర్ ఏ మాటిచ్చినా తప్పకుండా అమలు చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అయ్యేలా తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు.

గొంతు గరగరతో సీఎం ప్రసంగం

ఇటీవల సీఎం కేసీఆర్ అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. హుస్నాబాద్‌లో సభలో ఆయన గొంతు గరగరతోనే ప్రసంగించారు. మధ్య మధ్యలో గొంతును సరిచేసుకుంటూ 21 నిమిషాల పాటు మాట్లాడారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కు సభ వేదికపైనే పార్టీ బీఫారంను కేసీఆర్ అందజేశారు. సభలో బీఆర్‌ఎస్ సెక్రెటరీ జనరల్ కేశవరావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ దేశపతి, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌తో గెలుపునకు నాంది

2018లో ఎన్నికల ప్రచారం కోసం హుస్నాబాద్‌కే వచ్చా, ఈ గడ్డ ఆశీర్వాదంతో 88 సీట్లతో విజయం సాధించాం. ఇప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థులకు బీఫారాలు ఇచ్చి హుస్నాబాద్ నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించి, ఆశీర్వాదం కోరడానికి వచ్చా. హుస్నాబాద్ గెలుపు.. బీఆర్‌ఎస్ పార్టీ 95 నుంచి 100 సీట్లు గెలిచేందుకు నాంది కావాలి. ఇవాళ అనేక విషయాల్లో దేశానికి ఆదర్శం అయ్యాం, మళ్లీ గెలిపిస్తే దేశానికే మార్గదర్శకంగా నిలుస్తాం. ఎమ్మెల్యే సతీశ్‌బాబు 50– 60వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని నమ్మకముంది.'' అని కేసీఆర్ పేర్కొన్నారు.

నేడు బీజేపీ తొలిజాబితా?

- లేని పక్షంలో రేపు వెల్లడి!
- ఢిల్లీలో నేడు జరిగే సీఈసీ భేటీలో ఖరారు చేసే అవకాశాలు
- హాజరుకానున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల, కోమటిరెడ్డి?

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల తొలి జాబితాపై బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ(సీఈసీ) తుది నిర్ణయం తీసుకోనుంది. సోమవారం సాయంత్రం ఢిల్లీలో జరగనున్న సమా వేశంలో రాష్ట్ర పార్టీ నుంచి అందిన జాబితాపై చర్చించి తొలిజా బితా ప్రకటించే అవకాశం ఉందని అం టున్నారు. లేనిపక్షంలో మంగళవారం ఈ జాబి తా వెలువడవచ్చుననే చర్చ పార్టీలో సాగుతోంది. ఇప్పటికే రాష్ట్ర పార్టీ స్థాయిలో ముసాయిదా జాబి తా కూడా సిద్ధమైన నేపథ్యంలో 40–45 మందితో అభ్యర్థుల తొలిజాబితా... లేదా ఏకాభిప్రాయం ప్రాతిపదికన అంతకంటే ఎక్కువ సీట్లకే అభ్యర్థు లను ప్రకటించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

తొలి జాబితాలో ఎవరుంటారో?

అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనతో పాటు సగం మందికి పైగా బీ–ఫారమ్‌లు కూడా అం దజేయగా, ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూడా 55 మందితో తొలిజాబితాను ప్రకటించింది. ఈ నేప థ్యంలో రాష్ట్రంలో మూడో ప్రధానపార్టీ బీజే పీ అభ్య ర్థుల జాబితాపై రాజకీయవర్గాల్లో ఆసక్తి నెలకొంది. కాగా ఢిల్లీలో సీఈసీ సమావేశానికి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, జాతీయ కార్యవర్గసభ్యుడు, రాష్ట్ర స్క్రీనింగ్ కమి టీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరు కానున్నట్టు పార్టీవర్గాల సమాచారం. ప్రతి ఏడాది దసరా పండుగ సందర్భంగా అమ్మవారి భవానీ మాలను ధరించి, పదిరోజుల పాటు రాజకీయ కార్య క్రమాలకు దూరంగా ఉండే బీజేపీ జాతీయ ప్రధా నకార్యదర్శి బండి సంజయ్ ఈ భేటీకి హాజరవు తారా లేదా అన్న దానిపై స్పష్టతరాలేదు.

కేసీఆర్ తాయిలాలను ప్రజలు నమ్మరు

బీజేపీ తెలంగాణ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ ఎన్ని తాయిలాలు ప్రకటించినా తెలంగాణ ప్రజలు నమ్మే పరి స్థితుల్లో లేరని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్ అన్నారు. మేనిఫెస్టో పేరుతో కేసీఆర్ మరోసారి బోగస్ హామీలిచ్చారని మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని, 2014, 2018 ఎన్నికలప్పుడు ఇచ్చిన దళితులకు 3 ఎకరాల భూమి, గిరిజనులకు 2 ఎకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు, దళిత బంధు, బీసీబం ధు, రుణ మాఫీ వంటి అనేక హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో ప్రకాశ్ జవదేకర్ మీడియాతో మాట్లాడారు. తెలం గాణలో బీఆర్‌ఎస్ ఓటమి.. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ మూడోస్థానంలో నిలుస్తుందని జోస్యం చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు గ్రామాల్లో తిరిగే పరిస్థితి లేదని, దళిత బంధు పథకం అమలులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 30 శాతం కమీషన్ తీసుకుం టున్నారన్న విషయాన్ని స్వయంగా కేసీఆరే ఒప్పు కున్నారని ప్రకాశ్ తెలిపారు.

కేసీఆర్ మేనిఫెస్టో... ఒక చెల్లని రూపాయి

బీఆర్‌ఎస్ పచ్చి బీసీ వ్యతిరేక పార్టీ: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో చెల్లని రూపాయిగా మిగిలిపోతుందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె. లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌ను కూల్చడానికి యువత కాచుకుని ఉందని హెచ్చరించారు. ప్రజలను మోసం చేయడానికి అమలుకు నోచుకోని హామీలిచ్చారని, నమ్మించడం, వంచించడం కల్వకుంట్ల కుటుంబానికే అలవాటని ఆయన మండిపడ్డారు. 2014, 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆది వారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళికపై స్పం దించారు. 'ఆసరా ఏమైంది.. గృహలక్ష్మి ఏమైంది? దివ్యాంగులకి ఏం ఒరగబెట్టారు. దళితబంధు ఎంతమందికి ఇచ్చారు' అని ప్రశ్నించారు. 'రైతు రుణమాఫీ లేక రైతులు ఇబ్బంది పడ్డారు.. వడ్డీలు కట్టలేక చివరికి ఆత్మహత్యలు చేసుకున్నారు. మహిళా సంఘాల డబ్బులు దోచుకున్న మీకు వాళ్ల ఉసురు తాకుతుంది' అని లక్ష్మణ్ హెచ్చరించారు. దళిత సీఎం, మూడెకరాలు పేరుతో దళితులను మోసం చేశారని, దేశం మొత్తం మీద రేషన్ కార్డు కూడా ఇవ్వలేని రాష్ట్రం తెలంగాణ అని లక్ష్మణ్ మండిపడ్డారు.

గత హామీలు ఏమయ్యాయి?

▶ మొదటి పేజీ తరువాయి

చేయలేదన్నారు. అప్పులు పెంచారు.. అవినీతి పెం చారు.. అహంకారం పెంచుకున్నారు తప్ప.. రాష్ట్ర సంపద పెంచలేదని విమర్శించారు.

పెట్రోల్‌పై పన్ను తగ్గించని ఏకైక రాష్ట్రం

కేసీఆర్ మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని 80 వేల పుస్తకాలు చదివిన జ్ఞానంతో అప్పులపాలు చేసి భ్రష్టు పట్టిం చారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. పెట్రోల్ మీద కేం ద్రం తమకు వచ్చే ఆదాయం తగ్గించుకొని ట్యాక్స్ తగ్గిస్తే... అన్ని రాష్ట్రాలూ కేంద్రంతో కలిసి కొంత పన్ను తగ్గించాయి. పన్ను తగ్గించని ఏకైక రాష్ట్రం తెలంగాణ అని విమర్శించారు. '24 జిల్లా కేం ద్రాల్లో నిమ్స్ స్థాయిలో 24 ఆస్పత్రులు కడతామని హామీ ఇచ్చి ఒక్కటీ కట్టలేదు. మూడెకరాల సాగు భూమి, దళితులకు 50 వేల కోట్ల ప్రత్యేక నిధులు, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా చూడటం, మహిళా బ్యాంకులు, జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, జర్నలిస్టుల సంక్షేమ నిధి లాంటి ఎన్నో హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయలేదు. మూతపడ్డ కంపెనీలు తెరుస్తామని ఒక్కటీ తెరవలేదు. హైదరాబాద్ నుం చి వరంగల్‌కు ఇండస్ట్రియల్ కారిడార్ అన్నారు.. అది ఎక్కడ పోయింది?' అని కిషన్‌రెడ్డి నిలదీశారు.

గ్రాఫిక్స్ చూపెట్టి మభ్యపెట్టారు

'ప్రతి ఊరిలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ.. ప్రతి గ్రామం లో ఇంటర్నెట్.. హామీలు ఏమయ్యాయి? కేంద్రం ఇచ్చే నిధులు తప్ప గ్రామాలకు రాష్ట్రం నిధులు ఇవ్వడం లేదు. మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని, పునరుజ్జీవనం చేస్తామన్నారు.. ఏదీ లేదు.. హైదరాబాద్ ఉత్తరాన విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొత్తది అటుంచితే.. వరం గల్ ఎయిర్‌పోర్టుకు ల్యాండ్ ఇవ్వమంటే ఇవ్వట్లేదు. ఆకాశ హర్మ్యాలు.. గ్రాఫిక్స్ చూపెట్టి ప్రజలను మభ్యపెట్టిన పార్టీ బీఆర్‌ఎస్. ఎఫ్‌ఆర్‌బీఎం నుంచి తప్పించుకోవడానికి మూసీకి ఒక కార్పొరేషన్, రోడ్లకు ఒక కార్పొరేషన్.. హుస్సేన్ సాగర్‌కు ఒక కార్పొరేషన్.., వాటర్‌కు ఒక కార్పొరేషన్, కాళేశ్వరం కు ఒక కార్పొరేషన్.. ఇలా లెక్కలేనన్ని కార్పొరేషన్లు చేస్తున్నారు. అనేక కార్పొరేషన్లు పెట్టి నాబార్డు, బ్యాంకుల్లో విచ్చలవిడిగా అప్పులు చేశారు' అని కిష న్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. ఇవన్నీ ప్రజలకు చెప్పకుం డా.. తెలంగాణను ఉద్ధరిస్తామని మళ్లీ మేనిఫెస్టో తెచ్చారంటూ మండిపడ్డారు. రాష్ట్ర ఆదాయంలో 20 శాతం వడ్డీలకే పోతోందన్నారు. ప్రభుత్వ చేతగానిత నంతో, పరీక్షలు నిర్వహించే సామర్థ్యం లేక.. నోటిఫి కేషన్లు వాయిదా పడుతుంటే.. దిక్కుతోచని స్థితిలో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు.

బెస్ట్ కరప్షన్ ఫ్యామిలీ పాలసీ

'బెస్ట్ ఎకనమికల్ పాలసీ అని కేసీఆర్ అంటున్నా డు... అది బెస్ట్ కాదు.. వరస్ట్ ఎకనామికల్ పాల సీ. పవర్ పాలసీ బెస్ట్ పాలసీ అని అన్నాడు.. అది బెస్ట్ కాదు.. డేంజర్ పవర్ పాలసీ. రూ.45 వేల కోట్ల అప్పులతో డిస్కంలు, విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోయే స్థితిలో ఉన్నది. బెస్ట్ డ్రింకింగ్ వాటర్ పాలసీ అట.. అది బెస్ట్ డ్రింకింగ్ వాటర్ పాలసీ కాదు.. బెస్ట్ లిక్కర్ డ్రింకింగ్ వాటర్ పాల సీ. బెస్ట్ ఇరిగేషన్ పాలసీ అన్నడు.. అది బెస్ట్ కమీ షన్ ఇరిగేషన్ పాలసీ. అత్యుత్తమ దళిత పాలసీ అని కేసీఆర్ అంటున్నాడు.. కానీ కేసీఆర్ బెస్ట్ కర ప్షన్ ఫ్యామిలీ పాలసీ, చీటింగ్ పాలసీ అమలుచే స్తున్నాడు' అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



అత్యంత మంచి చేసి కూడా అతి తక్కువ ఫలితం పొందేది కుక్కలు, తత్వవేత్తలు.
– డైయొజినీజ్

సాక్షి
సోమవారం, 16 అక్టోబర్ 2023

శాంతి అనిత్యం, యుద్ధమే నిత్యం

బతుకు–చావు, యుద్ధమూ–శాంతి, ప్రేమ–విద్వేషం, కారుణ్యం–కర్కశత్వం... ఇవి పరస్పర వ్యతిరిక్తాలూ, ఒకదానికొకటి ఎంతో దూరాలూ అనుకుంటాం. కానీ, వాస్తవంలో ఎంత దగ్గరగా ఉంటాయో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. బతుకును అంటిపెట్టుకునే చావు ఉంటుందని తెలిసినా; అది హత్యో, ఆత్మహత్యో, యుద్ధం పేరిట సామూహిక హత్యో కాక, సహజ మరణమైతే, ఆ దారి వేరు. బతుక్కీ, చావుకీ మధ్య ఉంటుందనుకునే దూరాన్ని చెరిపివేస్తూ హఠాత్తుగా యుద్ధాలు బద్దలవుతాయి. ఇజ్రాయెల్–పాలస్తీనాల మధ్య పదిరోజుల క్రితం మొదలైన యుద్ధం ఇప్పటికే వేలసంఖ్యలో బతుకు దీపాలను ఆర్పివేసింది. బతుకునిచ్చే అమ్మతనాన్ని భక్తితో స్మరించుకుంటూ తొమ్మిది రోజులపాటు తొమ్మిది రూపాలలో అమ్మవారిని మన దగ్గర కొలుచుకోనున్న రోజుల్లోనే, అక్కడ ఆ మూల సమరనాదాలు, తల్లుల గర్భశోకాలు మిన్నంటడం వైచిత్రి.

అమ్మ ఎక్కడైనా అమ్మే! అమ్మకు, అమ్మతనానికి ప్రాంత, మత, భాషాభేదాలు లేవు. చారిత్రకంగా చూసినా ఒకప్పుడు ప్రపంచమంతటా మొదటగా కొలుపులందుకున్నది అమ్మే; అయ్య కొలుపు ఆ తర్వాతే వచ్చింది. అమ్మ అంటే అన్నమూ, అభయమూ కూడా! అమ్మవారిని ధనలక్ష్మిగాను, ధాన్యలక్ష్మిగానూ కూడా భావించుకుంటాం. అమ్మ చేతుల్లో వరికంకులను, చెరుకుగడలను అలంకరిస్తాం. అమ్మకు రకరకాల అన్నాలు ఇష్టమని చెప్పి నివేదించి ఆ అన్న ప్రసాదాలను మనమే ఆరగిస్తాం. మన దగ్గరే కాదు, ఒకప్పుడు అమ్మ ఆరాధన ఉన్న ప్రతిచోటా అమ్మను అన్నానికి ప్రతీకగానే కొలిచారు. అమ్మను బతుకమ్మ అనడంలోనే, పది కాలాలపాటు సుఖశాంతులతో బతికించే అమ్మ ఆశీస్సు ఉంది.


అమ్మను కొలుస్తూనే అమ్మ మనసుకు దూరమై యుద్ధానికి దగ్గరవడమే మనిషి జీవితంలోని పెను విషాదం. తను దగ్గరవడమే కాదు; అన్నసాధనాలు ధరించిన అమ్మ చేతుల్లో కూడా ఆయుధాలు ఉంచి; అన్నపూర్ణను ఆయుధపూర్ణగా మలచిన చరిత్ర మనిషిది. మానవ చారిత్రక ప్రస్థానంలో ఇది ఎప్పుడు మొదలైందో కానీ, ఇప్పటికీ తనకు యుద్ధమే కావాలో శాంతే కావాలో తేల్చుకోలేని సందిగ్ధంలోనే మనిషి ఉన్నాడు. యుద్ధానికీ, శాంతికీ మధ్య మనిషి చక్రభ్రమణం నిరంతరాయంగా సాగుతూనే ఉంది. యుద్ధమే ప్రధానమై శాంతి ఎంత అప్రధానమైందంటే, రెండు యుద్ధాల మధ్య తాత్కాలిక విరామాన్నే శాంతిగా నిర్వచించుకునే పరిస్థితికి వచ్చాం. శాంతికాలంలో యుద్ధాన్ని జపించడం, యుద్ధకాలంలో శాంతిని స్మరించడం మనిషికి పరిపాటిగా మారింది. యుద్ధం కడుపున శాంతిశిశువును, శాంతి కడుపున యుద్ధశిశువును కోరుకోవడమూ అంతే నిత్యసత్యమైంది. యుద్ధమొచ్చి శాంతిని చెదరగొడుతున్నట్టు భ్రమిస్తాం కానీ; వాస్తవానికి శాంతే మధ్య మధ్య వీచే మలయమారుతమై ప్రచండమైన యుద్ధపు వేడిగాడ్పులకు అవరోధమవుతోందన్న ఎరుక మనకు లేదు. యుద్ధమే ఇక్కడ శాశ్వతంగా తిష్ఠవేసిన చుట్టమై; శాంతి ఎప్పుడైనా తొంగిచూసే అతిథి మాత్రమైంది.

యుద్ధమనే ఎడారిలో శాంతీ, సుఖసంతోషాల ఒయాసిస్‌లను లియో టాల్‌స్టాయ్ నవల 'యుద్ధమూ–శాంతీ' అద్భుతంగా కళ్ళకు కట్టిస్తుంది. అమెరికా అంతర్యుద్ధం దరిమిలా ఎంత విధ్వంసం జరిగిందో, ఎందరి బతుకులు తలకిందులయ్యాయో మార్గరెట్ మిచెల్ నవల 'గాన్ విత్ ద విండ్' అనితరసాధ్యంగా చిత్రిస్తుంది. ఇంకా వెనక్కి, మహాభారతానికి వెడితే, యుద్ధాన్ని యజ్ఞంగా పేర్కొని పవిత్రీకరించడమే కాదు; రోగమొచ్చి చావడం కన్నా యుద్ధంలో చావడం పరమపుణ్యప్రదమని కీర్తించడం కనిపిస్తుంది. చివరికది అపార జననష్టంతో పాటు, యోధజాతి మొత్తం ఎలా తుడిచిపెట్టుకుపోయిందో ఒక మహావిలయ సదృశంగా చిత్రిస్తుంది. అందులోని స్త్రీపర్వం మొత్తం భర్తలను, కొడుకులను, తండ్రులను, సోదరులను కోల్పోయి గుండెలు బాదుకునే స్త్రీ నిర్భరశోకాన్ని కరుణ రసార్ద్రంగా వినిపిస్తుంది. ఆ దుఃఖం గాంధారినోట శాపంగా మారి యాదవకుల విచ్ఛిత్తి రూపంలో మరో విధ్వంసం వైపు నడిపిస్తుంది. యుద్ధాన్ని ఆకాశానికెత్తిన మహాభారతమే, దాని విపరీత పర్యవసానాలను ఎత్తిచూపి సామాన్యులూ, మాన్యులైన మునులూ కూడా తీవ్రంగా గర్హించిన సంగతినీ నమోదు చేయడం విశేషం. యుద్ధపశ్చాత్తాపం జీవితాంతమూ ధర్మరాజును ఎంతగా వెన్నాడుతూ వచ్చిందంటే, అశ్వమేధయాగాన్ని తలపెట్టి అర్జునుని అశ్వం వెంట పంపిస్తూ, రాజులను ఓడించు కానీ ప్రాణనష్టం మాత్రం కలిగించవద్దని హెచ్చరించవలసి వచ్చింది.

ప్రాంతాలు, మతాలు, సంస్కృతులు, భాషల మధ్య ఎక్కడా కనిపించనంత సాదృశ్యం యుద్ధాలలో కనిపిస్తుంది. యుద్ధరూపంలోని ఊచకోత ఎక్కడైనా ఒక్కలానే ఉంటుంది. గ్రీకు మహాకవి హోమర్ చెప్పిన ఇలియడ్ అచ్చం మహాభారతానికి ప్రతిబింబంలా ఉంటుంది. అది చిత్రించిన ట్రాయ్ యుద్ధం చివరిలో కూడా అయినవారిని కోల్పోయిన తల్లులు, భార్యల దుఃఖారావాలూ, ఆర్తనాదాలూ గుండెల్ని పిండివేస్తాయి. ఇన్ని అనుభవాలున్నా; ఇన్నిన్ని శోకసముద్రాలు కట్టలు తెంచుకున్న ఉదాహరణలు కళ్ళముందున్నా మనిషిలో యుద్ధోన్మాదం ఉపశమించలేదు; సమర మోహం తీరలేదు; రుధిరదాహం చల్లారలేదు. శాంతియుతంగా జీవించడం మనిషి ఇప్పటికీ నేర్చుకోలేదు. యుద్ధంలో చివరికి అటూ ఇటూ విజితులే తప్ప విజేతలెవరూ ఉండరనీ; మిగిలేవి శవాలూ, జీవచ్ఛవాలు మాత్రమేనన్న నిష్ఠురసత్యాన్ని మనిషి ఇప్పటికీ జీర్ణించుకోలేదు. బతుకునిచ్చే, బతకనిచ్చే అమ్మతత్వానికి దూరంగా చావు దిశగా ఈ చీకటి ప్రస్థానం ఎంతకాలం?!

పట్టి పీడిస్తున్న దిగుబడి భూతం

విశ్లేషణ



డాక్టర్ దొంతి నరసింహారెడ్డి

దిగుబడి గురించి గొప్పలు చెప్పుకోవడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. దిగుబడి, ఉత్పత్తి, ఉత్పాదకత మధ్య ఉన్న వివిధ కోణాలను అధికార గణం విస్మరిస్తున్నారు. దిగుబడి పెంపుదల నినాదంగా పెట్టుకుని, దేశీయ రైతుల జ్ఞానాన్నీ, శ్రమనూ కించపరుస్తున్నారు. ఈ దిగుబడి జాడ్యం విదేశాల నుంచి, ప్రత్యేకంగా అమెరికా నుంచి చుట్టుకున్నది. ఇప్పుడు ఆకలి తీర్చడం లక్ష్యం కాదు. ఆదాయం పెరగాలంటే దిగుబడులు పెంచాలంటున్నారు. కానీ అనేక సమస్యల మధ్య దిగుబడులు ఎక్కువ అయినా ప్రతి సందర్భంలో రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడం ప్రత్యక్షంగా చూస్తున్నాం. విత్తనాలు ఎరువులు అమ్మేవారు అధిక దిగుబడుల ఆశను రైతులలో కల్పిస్తూ, తమ లాభాలను మాత్రం పెంచుకుంటున్నారు. దిగుబడి ఒక ఆయుధం!

ప్రభుత్వం దిగుబడి పెంచడానికి వివిధ రకాలుగా పెడుతున్న ఖర్చు... రైతులకు గిట్టుబాటు ధరలు అందించే వ్యవస్థ మీద పెట్టే దాని కంటే అనేక రెట్లు ఎక్కువ. వరి, గోధుమల అధిక ఉత్పత్తి కొరకు గత 50 ఏండ్లలో కేటాయించిన నిధులు, ఆహారం కొరకు చేసిన కృషిగా కొంత వరకు అర్థం చేసుకోగలం. కానీ గత 25 ఏండ్లలో వాణిజ్య పంటల దిగుబడులు పెంచడానికి ప్రకటించిన విధానాలు, కంపెనీలకు ఇస్తున్న సబ్సిడీలు, సరళీకరించిన నిబంధనలు రైతుకు మేలు చేయకపోగా కీడు చేస్తున్నాయి.

కొత్త వంగడాలు ప్రకటించి పంటల దిగుబడి చూసుకుని మురుస్తున్నారే కానీ దాంట్లో పోషకాల శాతం ఎంత అనేది మరుస్తున్నారు. రోజూ మనం తీసుకుంటున్న ఆహారంలో పోషకాలు లేవని, తగ్గుతున్నాయని వైద్యులు, ఆహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆహారంలో పోషకాలు ఉండాలంటే వైవిధ్యం అవసరాన్ని వారు గుర్తు చేస్తున్నారు. కానీ, వైవిధ్యం కాదు, ఏక పంట విధానం ద్వారానే అధిక దిగుబడి వస్తుందని ఆధునిక దిగుబడి శాస్త్రం మనకు నూరిపోస్తున్నది.

ఏదైనా వస్తువు, లేదా పని ఎక్కువ చేయాలంటే ఉత్పాదకతను కొలమానంగా తీసుకుంటారు. మౌలిక వనరులను సరి అయిన మోతాదులో ఉపయోగించడం ద్వారా ఉత్పత్తిని పెంచడం ఉత్పాదకతను సాధించినట్టుగా భావిస్తారు. ఏదైనా పరిశ్రమలో అధిక ఉత్పాదకత కొరకు ప్రోత్సాహకాలు ఇస్తారు. అదే రైతు ఉత్పాదకతను పెంచితే ప్రోత్సాహకంగా పంట ధర పెరగడం లేదు. 2010, 2019లో భారత రైతులకు మైనస్ రూ.2.36 లక్షల కోట్లు, మైనస్ రూ.1.62 లక్షల కోట్ల మేర ప్రతికూల మద్దతు లభించిందని ఒక అంతర్జాతీయ నివేదిక (ఓఈసీడీ– ఐరోపా దేశాల ఆర్థిక కూటమి) అంచనా వేసింది. 2000 మినహా 2000–2019 మధ్య కాలంలో రైతులకు మద్దతు స్థిరంగా ప్రతికూలంగా ఉంది. ఓఈసీడీ అంచనా ప్రకారం మైనస్ 1.62 లక్షల కోట్ల రూపాయల ప్రతికూల మద్దతు 2019లో వ్యవసాయ మంత్రిత్వ శాఖ మొత్తం బడ్జెట్ కేటాయింపుల కంటే రూ.1.09 లక్షల కోట్లు ఎక్కువ. రైతులకు రావాల్సిన పైకం ఎక్కువ, కాని వస్తున్నది తక్కువ అని ఈ నివేదిక సారాంశం.

2016–17లో ఒక క్వింటాల్ గోధుమ ఉత్పత్తికి హరియాణా రైతుకు రూ.2,219 ఖర్చయిందనీ, కేంద్రం నిర్ణయించిన క్వింటాలుకు రూ.1,625 కనీస మద్దతు ధర కంటే అది రూ. 594 ఎక్కువనీ అక్కడి ప్రభుత్వం స్వయంగా అంగీకరించింది. ఈ పరిస్థితి అధిక దిగుబడి వల్ల మారుతున్నదా? గిట్టుబాటు ధర రానప్పుడు రైతుకు దిగుబడి దిగులు ఎందుకు? 'ఉత్పత్తి పెంచండి' అని పిలుపునిచ్చే శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు, గిట్టుబాటు ధర విషయంలో మాత్రం కిమ్మనరు. విత్తనాలు, ఎరువులు, పంట రసాయనాలు అమ్మేవారు మాత్రం అధిక దిగుబడుల ఆశను రైతులలో కల్పిస్తూ తమ లాభాలను



పెంచుకుంటున్నారు. వీరి వాణిజ్య ప్రకటనలకు దన్నుగా శాస్త్రవేత్తలు ఫిడేలు వాయిస్తుంటారు.

వ్యవసాయంలో పంటల దిగుబడులు పెంచాలంటే అనేక మార్గాలు ఉన్నాయి. నేల సారం అధికంగా ఉంటే పంట పోషకాలతో కూడి ఎక్కువ కాత, పూత వస్తుంది. సరి అయిన నీరు అందిస్తే మొక్కల ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. పూతకు, కాతకు గాలిలో, నేలలో తేమ ఉపయోగపడుతుంది. ఈ తేమ ఉండాలంటే, ప్రాంతీయంగా పచ్చదనం ఉండాలి. జీవ వైవిధ్యం ఎక్కువగా ఉంటే వాతావరణం అనుకూలంగా ఉంటుంది. మొక్కలు ఆరోగ్యంగా ఉంటే పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. నేలలో పోషకాలు పెంచే ఉపాయాలు అనేకం ఉన్నాయి. నిరంతరంగా, సహజంగా నేలలో సారం పెంచితే రైతు మీద ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా, దేశీ విత్తనాల ద్వారా అధిక దిగుబడులు సాధించి సంతోషంగా ఉన్న రైతులు కోకొల్లలు. ప్రపంచ రికార్డు వరి దిగుబడి ఒక వ్యవసాయ పరిశోధనా కేంద్రం లేదా అమెరికాలో పెద్ద భూస్వామి కాకుండా, బిహార్ రాష్ట్రంలో ఒక రైతు సాధించాడు. దర్వేశ్‌పుర గ్రామంలో సుమంత్ కుమార్‌కు హెక్టారుకు 22.4 టన్నుల దిగుబడి వచ్చింది. అది కూడా సిస్టం ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ (ఎస్ఆర్ఐ) పద్ధతి వల్ల వచ్చింది. రైతు మీద భారం లేకుండా సహజ పద్ధతుల ద్వారా, ప్రమాదకర రసాయనాల అవసరం లేకుండా, కంపెనీల గత్తర విత్తనాలు నాటకుండా, దిగుబడి వస్తే మంచిదే కదా!

దిగుబడి మీద పరిమితులు ఉంటాయి. ఒక దశ తరువాత దిగుబడి పెరగదు. ఎంత దక్షత ఉన్నా ఉత్పాదకతను ఒక స్థాయికి మించి పెంచలేము. ప్రకృతి నుంచి వచ్చే ఉత్పత్తులలో అనేక కారణాల రీత్యా దిగుబడిలో కాలానుగుణంగా హెచ్చుతగ్గులు ఉంటాయి. దీనిని వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో ఎప్పుడూ పరిగణనలోకి తీసుకోలేదు. పాల ఉత్పత్తి ఒక మంచి ఉదాహరణ. ఒక పాడి పశువు నుంచి తీసుకునే పాల దిగుబడి పెంచడానికి మొదట్లో హైబ్రిడ్ ఆవులను ప్రవేశపెట్టారు. తదుపరి వాటి పొదుగులను భారీగా పెంచారు. విదేశాలలో ఈ భారీ పొదుగులతో ఆవులు నడవలేని స్థితికి వచ్చాయి. అయినా పాల దిగుబడి ఇంకా పెంచాలని మేతలో మార్పులు చేశారు. ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం మొదలుపెట్టారు. వీటి అన్నింటి పర్యవసానంగా ఆవు బలహీనపడి, రోగాల బారిన పడింది. కచ్చితంగా అవి అనారోగ్యానికి గురి అవుతాయని తెలిసీ మేతలో 'మందులు' కలుపుతున్నారు. అంటురోగాలు వస్తాయని నిర్ణీత కాలంలో అవసరమున్నా లేకున్నా వ్యాక్సిన్లు, ఇతర 'మందులు' అలవాటు చేశారు. ఇవన్నీ కూడా దిగుబడి తగ్గకూడదు అని చేస్తున్నారు. ఇప్పుడు ఆవులను జన్యుమార్పిడి ప్రయోగాలకు బలి చేస్తున్నారు. ఎన్ని చేసినా ఒక ఉత్థాన దశ చేరుకున్న తరువాత ప్రకృతిలో భాగం అయిన ఆవు పాలు ఎక్కువగా ఇవ్వదు. ఇంకొక వైపు పాలలో కలుషితాలు పెరిగినాయి. ఒక పాడి పశువు 2 లీటర్లు ఇస్తే, ఇంకొక రకం 3 ఇవ్వచ్చు. సంఖ్యాపరంగా తేడా ఉన్నా ఇస్తున్న పాలు నాణ్యంగా ఉన్నాయా లేదా అనేది ముఖ్యం. కాని ఆధునిక దిగుబడి శాస్త్రంలో 'పిండుకోవటం' ఒక వ్యాపార సూత్రంగా మారింది. దానినే ఇప్పుడు 'ఎక్స్‌ట్రాక్టివ్ టెక్నాలజీస్ అండ్ ఎకానమీ' అని పరిగణిస్తున్నారు.

వరి, గోధుమలు, పత్తి వంటి పంటల విషయంలో కూడా ఇదే తీరు కనిపిస్తున్నది. పత్తి దిగుబడులు పెరుగుతాయని ఒక విదేశీ కంపెనీ చెబితే జోరుగా అనుమతులు ఇచ్చి 2003లో బీటీ పత్తిని రైతులకు అంటగట్టారు. గత 15 ఏండ్ల నుంచి 883 బీజీఐఐ హైబ్రిడ్లు మార్కెట్లో అమ్ముతున్నారు. మూడు లేదా నాలుగేళ్లకు హైబ్రిడ్ విత్తనాలు మార్చాలని రైతులకు సూక్తులు చెప్పే శాస్త్రవేత్తలు, అధికారులు ఇన్ని ఏండ్లుగా అవి మార్చకున్నా పట్టించుకోవటం లేదు. దీంతో పత్తిని ఆశించే పురుగులు, చీడ పీడల బెడద పెరిగింది. విష రసాయనాల మీద ఖర్చు పెరిగింది. ఎకరాకు 14 క్వింటాళ్ళు వస్తాయని నమ్మబలికిన కంపెనీలు ఇప్పుడు కేవలం 2 లేదా 3 క్వింటాళ్ళు వస్తుంటే మాట్లాడటం లేదు. జాతీయ సగటు లెక్కల ప్రకారం 2014లో హెక్టారుకు 510 కిలోలు వస్తే, 2022 అది 445 కిలోలకు పడిపోయింది. దిగుబడుల కోసం హైబ్రిడ్ రకాలను ప్రకటించడంలో ఉన్న చిత్తశుద్ధి ఆ యా విత్తనాల పని తీరును ఎప్పటికప్పుడు అంచనా వేయడంలో లేదు.

ఒక ఊత పదంగా మారిన దిగుబడి సందేశాల వెనుక రాజకీయాలు ఉన్నాయి. స్వార్థపర వ్యాపార ప్రయోజనాలు ఉంటున్నాయి. లోపభూయిష్ఠ విధానాలను దిగుబడి ఒక కవచంగా మారింది. అధిక ఉత్పత్తి సాధించడానికి ప్రకటిస్తున్న విధానాలలో సంపూర్ణత లోపించింది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇదే ఇల్లు



ముప్పై ఏళ్ల క్రితం, ఉన్నట్టుండి ఒక రాత్రి కశ్మీర్, శ్రీనగర్ నుంచి ఉన్నవి ఏవో సర్దుకుని ఒక్క సూటు కేసుతో పారిపోయాం. ఇప్పుడు, 30 ఏళ్ల తర్వాత, ఇంకా ఏం మిగిలి వుందో ఆ ఇంటికి మళ్లీ వచ్చాం. ఇల్లు ఖాళీ. కానీ మూడు దశాబ్దాల క్రితం మేము ఏర్పరుచుకున్న జ్ఞాపకాలు అలాగే ఉన్నాయి. ఈసారి మేము పరుగెత్తాల్సిన అవసరం లేదు. బహుశా ఎప్పటికీ!

– సందీపా ధర్, నటి

నా వైఖరి



నేను పాలస్తీనియన్లకు అండగా ఉంటాను, కానీ హమాస్ ఉపయోగించిన పద్ధతులకు కాదు. నేను యూదులతో సహానుభూతి పొందగలను, కానీ యూదు మతవాద వర్ణవివక్షాపూరిత ఇజ్రాయెల్‌తో కాదు.

– తుషార్ గాంధీ, రచయిత

ఎలా న్యాయం?



కశ్మీరీ పండితులు ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడం వక్రోక్తి. ఒకప్పుడు వాళ్లు ఎలా తమ ఇళ్లను కోల్పోయారో పాలస్తీనియన్లు అలాగే కోల్పోతున్నారు. బహుశా వాళ్లు ఇది సరైనదని అనుకుంటున్నట్టున్నారు. అలా అయితే 2014 నుంచి పునరుద్ధరించని వారి బాధిత కార్డును వాళ్లు పారేయాలి.

– జాయ్‌దాస్, వ్యాఖ్యాత

మనిషితనం మాయం



ప్రపంచవ్యాప్తంగా ఈ దశాబ్దంలో జరిగిన పెద్ద నష్టాల్లో ఒకటి, మానవ హక్కుల విధ్వంసం. జాతీయవాదం, మతదురభిమానం, జాతివివక్ష, నిఖార్సైన ద్వేషం... సహానుభూతిని తొక్కేస్తున్నాయి. జనాలు మనుషులుగా ఎలా ఉండాలో మరిచిపోయారు.

– రీతూపర్ణా ఛటర్జీ, పాత్రికేయురాలు

ఉన్మాదం



పైథాగరస్ సిద్ధాంతం గురించి విన్నాక, అది సరైనదో కాదో నిర్ణయించడానికి ఆయన ఏ రాజకీయ పక్షానికి చెందినవాడో అడిగే సమాజాలు నాశనమైనట్టే. లోకం అలా తయారైంది.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

అందరికీ ఆహారమే ధ్యేయం!

సందర్భం



కాట్రగడ్డ సురేష్

ప్రపంచ మానవాళికి ఆహారమే అన్నింటికంటే ముఖ్యమైన అవసరం. ఇదంతా నీటితో ముడిపడిన ఉత్పత్తి. నీరూ ఆహారమే! అందుకే నీటి ప్రాధాన్యంపై ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి (యూఎన్ఓ) దృష్టి కేంద్రీకరించి ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'నీరు జీవం, నీరు ఆహారం' అనే నినాదాన్ని ప్రచారం చేస్తోంది.

ప్రపంచ దేశాలు జనాభా పెరుగుదలకు అనుగుణంగా తగిన నీటి వనరులను పరిరక్షించుకోవాలి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు నీటి లభ్యతకు ముప్పు కలిగిస్తున్నాయి. ఈ అవరోధాల్ని అధిగమించి నీటి వనరుల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. అసంఖ్యాకంగా ప్రజలు ఆకలితో పోరాడుతున్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో యూఎన్ఓ విశేషంగా కృషి చేస్తోంది.

వ్యవసాయం, అటవీ, మత్స్య, భూమి, నీటి వనరులను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థల ప్రయత్నాలను యూఎన్ఓ సమన్వయం చేస్తున్నది. దీనికి ప్రత్యేక విభాగంగా ఉన్న 'వ్యవసాయం, ఆహార సంస్థ' దీనిని నిర్వహిస్తోంది. ఆహార సవాళ్లను ఎదుర్కొనే మార్గాలను సూచిస్తున్నది. ఆహార బ్యాంకులకు వస్తువులను స్వచ్ఛందంగా అందించే ప్రచారం నిర్వహిస్తున్నది. చిన్న తరహా రైతులను ప్రోత్సహించి ఆహార ఉత్పత్తులను పెంచేందుకు ప్రపంచ దేశాలకు యూఎన్ఓ సహాయకారిగా నిలుస్తోంది.

పోషకాహార లోపంతో పిల్లలకు మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులు రాకుండా చర్యలు చేబడుతున్నది. కోవిడ్–19 మహమ్మారి సృష్టించిన సంఘర్షణ ఆహార భద్రతపై తీవ్ర ప్రభావం చూపింది. ఆహార సుస్థిరతను నెలకొల్పడంలో ప్రపంచ దేశాలు ఇంకా సతమతమవుతూనే ఉన్నాయి. జీవితాలను రక్షించే అతి పెద్ద మానవతా సంస్థగా 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్' సేవలు అందిస్తున్నది. యూఎన్ఓ విపత్తులు, వాతావరణ మార్పుల ప్రభావాల నుంచి కోలుకుంటున్న దేశాలకు అండగా నిలుస్తోంది.

వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ద్వారా ఆకలిని తొలగించడం, పోషకాహారం, జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో 1945 నుంచి యూఎన్ఓ ఈ కృషి కొనసాగుతోంది. భారతదేశం సైతం ఈ కృషిలో తనదైన పాత్ర పోషిస్తోంది. దీనిలో ఆంధ్రప్రదేశ్ పాత్ర ప్రత్యేకతను సంతరించుకుంది.

21వ భారత రాజ్యాంగ అధికరణం ప్రతి భారతీయుడికీ జీవించే హక్కును అందించింది. 'భారత ఆహారసంస్థ' ఆహార ధాన్యాలను సకాలంలో సేకరిస్తోంది. సంబంధిత యంత్రాంగం వీటిని పంపిణీ చేస్తున్నది. దేశానికి ఆహార భద్రత కల్పించడం ప్రభుత్వ ముఖ్య బాధ్యత. దీనిని ఆహార ప్రజాపంపిణీశాఖ నిర్వహిస్తున్నది. ఈ సంస్థ 'బీపీఎల్' కుటుంబాలకు ఆహార ధాన్యాలను 'అంత్యోదయ అన్న యోజన' కింద పంపిణీ చేస్తున్నది. ఐసీడీఎస్ ద్వారా దేశంలోని పోషకాహార లోపం సమస్య పరిష్కరింపబడుతోంది. ఈ కేంద్ర పథకాల్ని సమర్థంగా అమలుచేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ముందు వరుసలో ఉంది.

ఇటీవల ఏపీ ప్రభుత్వం ఆహారకల్తీ పరీక్షల కోసం నాలుగు సంచార వాహనాల్ని కొనుగోలు చేసి రంగంలోకి దించింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ', 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్' పేర్లతో రెండు పౌష్టికాహార పథకాలను విజయవంతంగా అమలు చేస్తోంది. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్నభోజన పథకం నడుస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడానికి భూసార పరీక్షల్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. ఆయన ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా మినుముల నాణ్యత పెంచాలన్నారు. చిరుధాన్యాల ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 'జల్ జీవన్ మిషన్' ఆంధ్రప్రదేశ్‌లో 99 శాతం గ్రామాల్లో ఇప్పటికే ప్రారంభమైంది. ఈ కేంద్ర ప్రభుత్వ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారం మరిన్ని సత్ఫలితాల్ని చేకూర్చింది. ప్రపంచ ఆహార విధానాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంబంధిత కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తోంది.

వ్యాసకర్త ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ ఏపీ అధ్యక్షులు । 94412 64249
(నేడు ప్రపంచ ఆహార దినోత్సవం)

విద్యా వ్యవస్థపై సినీ విమర్శనాస్త్రం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఆర్. నారాయణ మూర్తి 'యూనివర్సిటీ: పేపర్ లీక్' అనే కొత్త సినిమా తీశారు. అది ఇటీవల విడుదలయింది. మూర్తి ఆహ్వానం మేరకు, ప్రైవేట్ థియేటర్‌లో ప్రీ–రిలీజ్ స్పెషల్ షో చూశాను. నారాయణ మూర్తి ప్రభుత్వ యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, పోలీస్ ఆఫీసర్‌గా డబుల్ యాక్షన్‌లో ప్రధాన పాత్రలో నటించారు. నేటి విద్యా వ్యవస్థను ఎడ్యుకేషన్ మాఫియా ఎలా తన గుప్పిట పెట్టుకుంటున్నదో చూపించిన కమర్షియల్ సినిమా ఇది.

మొట్టమొదటిసారిగా పాఠశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యా మాధ్యమం మీద, ప్రభుత్వ సదుద్దేశానికీ విద్యారంగంలో ప్రైవేట్ మాఫియా విధ్వంసక పాత్రకూ మధ్య వైరుధ్యంపై ఒక సినిమా రూపొందించారు. ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ మీడియం అమలు చేయాలనే సాహసోపేతమైన నిర్ణయంతో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కొత్త ప్రయోగం లేకుండా, చంద్రబాబు నాయుడు మద్దతు ఉన్న ప్రైవేట్ మాఫియా ఆంధ్రప్రదేశ్‌లోనూ, తెలంగాణలో కూడా ప్రతికూల పాత్ర పోషిస్తుండటం లేకుండా ఈ సినిమా తీయడం అసాధ్యం.


ఒక తెలుగు పండితుడు తన ఎనిమిది వేళ్లకు వజ్రాల ఉంగరాలు ధరించి ప్రభుత్వ విశ్వవిద్యాలయంలో 'దేశభాషలందు తెలుగు లెస్స' ఎందుకవుతుందో గర్జిస్తూ పాఠాలు చెప్పే సన్నివేశంతో ఈ చిత్రం ప్రారంభమవుతుంది. తెలుగువారంతా తెలుగు మాధ్యమంలోనే చదవాలనీ, తెలుగువారు కేవలం తెలుగు మాధ్యమంలో చదివితేనే తెలుగువారి ఆత్మగౌరవం, జ్ఞానం విశ్వగురువు అవుతాయని ఆయన చెప్తారు.

కానీ అదే తెలుగు పండితుడు ఓ పెద్ద ఇంగ్లిష్ మీడియం ప్రైవేట్ కాలేజీని దాని అసలు యజమానిని మోసం చేసి సొంతం చేసుకుంటాడు. దానిని ప్రైవేట్ విశ్వవిద్యాలయంగా మారుస్తాడు. ఆ తర్వాత విపరీతమైన ఫీజుల ద్వారా ప్రజలను దోచుకోవడం ప్రారంభిస్తాడు. ప్రభుత్వ యూనివర్సిటీలో చదువుతున్న ఒక తెలివైన విద్యార్థి అన్నీ ఫస్ట్ ర్యాంకులు పొందుతున్న ఈ ప్రైవేట్ యూనివర్సిటీకి పంపాలంటూ తల్లి తండ్రులపై ఒత్తిడి చేస్తాడు. అప్పటికే అతడి తల్లి ఈ పిల్లవాడి చదువుకోసం పుస్తెలతాడు అమ్మి ఉన్నందున, అతని తండ్రి తన కిడ్నీని అమ్మి, అతడిని తెలుగు పండిట్ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఇంగ్లీషు మీడియం యూనివర్సిటీలో చేర్పిస్తాడు.

నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థలకు లాగే, అన్ని నంబర్ వన్ ర్యాంకులూ తెలుగు పండిట్ సొంత విశ్వవిద్యాలయ విద్యార్థులకే వచ్చాయి. అతని విశ్వవిద్యాలయ ప్రకటనలు ఎంత ప్రాచుర్యం పొందాయంటే, గ్రామస్థులు కూడా పుస్తెలమ్ముకుని మరీ వారి అబ్బాయిలను, అమ్మాయిలను ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయానికి పంపేంతగా.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య కోసం ప్రజానీకం పోరాడుతున్నప్పుడు వారిపై దాడి చేసేందుకు ఈ తెలుగు పండితుడు పోలీసులకు లంచం





ఇస్తాడు. మంత్రులకు లంచం ఇవ్వడానికి కూడా ప్రయత్నిస్తాడు కానీ ఇప్పుడిక్కడ నిజాయతీపరుడైన ఈ ముఖ్యమంత్రి ఉన్నారు. తర్వాత ఈ యూనివర్సిటీ వ్యవహారాలపై ఆయన విచారణకు ఆదేశిస్తాడు.

తెలుగు పండితుడు అన్ని దిగువ స్థాయి ప్రభుత్వ వ్యవస్థలనూ కొనుగోలు చేస్తాడు. పైగా పేపర్ల లీకేజీకి పాల్పడతాడు. తన విశ్వవిద్యాలయంలోని ధనవంతులైన విద్యార్థుల దగ్గర డబ్బులు తీసుకొని వారి బదులు విద్యార్థులు కాని బయటి వారితో పరీక్షలు రాయిస్తాడు. పరీక్షా పత్రాలు దిద్దే మాస్టర్‌లకు డబ్బు చెల్లించడం ద్వారా ప్రభుత్వ విశ్వ విద్యాలయంలోని తెలివైన విద్యార్థులు ఫెయిలయ్యే వ్యవస్థ కోసం అతను ప్లాన్ చేస్తున్నాడు. అలా ఫెయిలైన కారణంగా ఒక తెలివైన విద్యార్థిని ప్రభుత్వ విద్యాలయం క్యాంపస్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలు ఏమాత్రం సరిగా బోధించడం లేదని ప్రజలు భావించేలా చేయగలుగుతాడు.

రాష్ట్ర స్థాయి సర్వీస్ కమిషన్ పరీక్షల ప్రశ్న పత్రాలను ఈ ప్రైవేట్ విశ్వవిద్యాలయం కూడా మేనేజ్ చేయగలుగుతుంది. పేద విద్యార్థులు డిగ్రీలు పొందినప్పటికీ వారికి ఉద్యోగాలు రాకుండా తెలుగు పండిట్ మేనేజ్ చేయగలుగుతాడు.

తన సొంత విశ్వవిద్యాలయంలోని ఒక నిజాయతీగల విద్యార్థిని... విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరీక్షను ఒకరికి బదులు మరొకరు రాస్తున్న విషయాన్ని తన మొబైల్ ఫోన్‌తో రికార్డు చేసిందనే కారణంతో దారుణానికి ఒడిగడతాడు. ఆ ఏరియా పోలీస్ స్టేషన్‌కి చెందిన తన తొత్తు అయిన సీఐ కుమారుడి గ్యాంగ్‌తో ఆమెను అత్యాచారం చేయించి హత్య చేయిస్తాడు. అలాగే ప్రొఫెసర్ పాత్రలో ఉన్న నారాయణ మూర్తిని సీఐ చంపేస్తాడు, కానీ అదే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ పాత్రధారి అయిన నారాయణమూర్తి ఎడ్యుకేషన్ మాఫియా లీడర్ అయిన సీఐని చంపేస్తాడు.

నారాయణమూర్తి సినిమాలో సందేశం చాలా స్పష్టంగా ఉంది. ప్రస్తుత ఆంధ్రా మోడల్ విద్యా విధానాన్ని ఆయన ఎత్తిపడుతున్నారు. అదే సమయంలో ప్రైవేట్ విద్యా మాఫియాను ఎండగడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులు అనుసరించిన ప్రైవేట్ అనుకూల విద్యను కేసీఆర్ హయాంలో తెలంగాణలో కొనసాగిస్తున్న విషయం ఆర్. నారాయణ మూర్తి దృష్టిలో ఉంది.

ఈ రకమైన సినిమాలు డాక్యుమెంటరీ రూపంలో కూడా చాలా అరుదు, జనాదరణ పొందిన వాణిజ్య సినిమాలను వదిలివేయండి. ప్రైవేట్ మాఫియా విద్య వల్ల ప్రాణాలను, వనరులను కోల్పోతున్న తల్లితండ్రులు, విద్యార్థులు తప్పక చూడాల్సిన సినిమా 'యూనివర్సిటీ: పేపర్ లీక్'.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, ఆశ్వయుజమాసం, తిథి: శు.విదియ రా.11.56 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: స్వాతి రా.7.32 వరకు, తదుపరి విశాఖ, వర్జ్యం: రా.1.16 నుండి 2.56 వరకు, దుర్ముహూర్తం: ప.12.09 నుండి 12.56 వరకు, తదుపరి ప.2.30 నుండి 3.16 వరకు, అమృతఘడియలు: ఉ.10.17 నుండి 11.56 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 5.36.

లైన్ 'క్లియర్' కొందరికే!

తొలి విడత జాబితా ప్రకటనలో కాంగ్రెస్ వ్యూహాత్మక వైఖరి

- కీలక స్థానాలు వదిలేసి.. పెద్దగా పోటీలేని చోట్ల అభ్యర్థుల ప్రకటన
- 55 సీట్లలో బీసీలకు 12 మాత్రమే.. ఎంఐఎం అడ్డాలో మూడు.. హైదరాబాద్‌లోనే ఆరు కేటాయింపు
- అనుబంధ సంఘాల్లో మహిళా కాంగ్రెస్‌కు గోషామహల్ కేటాయింపు
- మధుయాష్కీ, షబ్బీర్‌అలీ, షెట్కార్, పొన్నం, బలరాం నాయక్, సురేఖలకు తొలిజాబితాలో మొండిచేయి
- కాంగ్రెస్‌లో తప్పని నిరసన సెగలు.. గాంధీభవన్ వద్ద ఆందోళన



సాక్షి, హైదరాబాద్: కీలకమైన అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల ప్రకటనను కాంగ్రెస్ పార్టీ వాయిదా వేసింది. మొత్తం 55 మందితో తొలి జాబితాను ప్రకటించినా.. కీలక నేతలు ఉన్న చాలా సీట్లను వదిలేసింది. తొలి జాబితాలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, పొదెం వీరయ్య, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల తోపాటు గడ్డం వినోద్, కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, అంజన్‌కుమార్ యాదవ్, టి.రామ్మోహన్‌రెడ్డి, సంపత్‌కుమార్, దొంతి మాధవరెడ్డి వంటి వారికి చోటు దక్కింది. ఎస్సీలకు రిజర్వ్ అయిన 12, ఎస్టీలకు రిజర్వ్ అయిన 2 స్థానాలు పోగా.. రెడ్డిలకు 17, వెలమలకు 7, బ్రాహ్మణులకు 2, మైనార్టీలకు 3, బీసీలకు 12 స్థానాలు దక్కాయి. అయితే బీసీల్లో ప్రధాన కులాలైన గౌడ, పద్మశాలి కులాల నేతల పేర్లు తొలిజాబితాలో కనిపించలేదు. యాదవ వర్గానికి 4, మున్నూరుకాపులకు 2, ముదిరాజ్, వాల్మీకి, మేరు, వంజర, చాకలి, బొందిలి కులాలకు ఒక్కొక్కటి దక్కాయి. ఎస్సీల్లో మాదిగలకు 9, మాలలకు 3 స్థానాలు కేటాయించగా.. ఎస్టీల్లో 2 ఆదివాసీలకే ఇచ్చారు. లంబాడా నేతలకు తొలి జాబితాలో చోటు లభించలేదు. ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలిస్తే ఆదిలాబాద్ (3), నిజామాబాద్ (3), కరీంనగర్ (7), మెదక్ (5), రంగారెడ్డి (7), హైదరాబాద్ (10), మహబూబ్‌నగర్ (8), నల్లగొండ (6), వరంగల్ (4), ఖమ్మం (2) స్థానాలకు టికెట్లను ప్రకటించారు.

ప్రముఖుల పేర్లు లేకుండానే!

కాంగ్రెస్ తొలి జాబితాలో ఆ పార్టీ ప్రముఖులు కొందరి పేర్లు కనిపించలేదు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మాజీ ఎంపీలు సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, పొన్నం ప్రభాకర్, పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, వరంగల్ జిల్లాకు చెందిన కొండాసురేఖ, ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు వంటివారి పేర్లు తొలి జాబితాలో లేకపోవడం గమనార్హం. కచ్చితంగా తొలి జాబితాలో ఉంటాయని భావించిన కొందరి పేర్లు లేకపోవడం, అనూహ్యంగా మరికొందరి పేర్లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ అనుబంధ సంఘాలకు తొలి జాబితాలో ప్రాధాన్యం దక్కలేదు. టికెట్లు ఆశిస్తున్న యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, ఫిషర్‌మెన్, ఎస్సీసెల్, కిసాన్ కాంగ్రెస్, బీసీ సెల్ నేతలు ఆశిస్తున్న టికెట్లు ప్రకటించలేదు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు గోషామహల్ స్థానం ఇచ్చారు. ఓయూ విద్యార్థి నేతలకూ తొలి జాబితాలో లభించలేదు.

గెలుపు ఆశల్లేని స్థానాలే బీసీలకు?

కాంగ్రెస్ తొలి జాబితాపై బీసీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. బీసీలకు మొత్తంగా 34 సీట్లు ఇస్తామని కాంగ్రెస్ ముఖ్యనేతలు చెప్పినా ఆ ప్రాధాన్యత కనిపించడం లేదని అంటున్నాయి. తొలి జాబితాలో 12 మంది బీసీల పేర్లు ఉన్నా.. సగం వరకు పెద్దగా గెలుపు ఆశలు లేనివేననే విమర్శలు వస్తున్నాయి. బీసీలకు ఇచ్చిన 12 సీట్లలో.. మేడ్చల్, గద్వాల, ముషీరాబాద్, ఆలేరు స్థానాలను యాదవ సామాజిక వర్గాలకు, సికింద్రాబాద్, వేములవాడ స్థానాలను మున్నూరుకాపులకు, గోషామహల్‌ను ముదిరాజ్ మహిళకు కేటాయించారు. రామగుండం (బొందిలి), షాద్‌నగర్ (రజక)లను ఎంబీసీ కులాలకు ఇచ్చారు. మిగతా మూడు సీట్లను ఎంఐఎం ప్రాబల్యం ఉండే పాతబస్తీలో కేటాయించారు. అందులో చాంద్రాయణగుట్ట (వాల్మీకి), యాకుత్‌పుర (మేరు), బహదూర్‌పుర (వంజర) ఉన్నాయి.

పారాచూట్లకు చాన్స్

కాంగ్రెస్ తొలి జాబితాలో పారాచూట్ నేతలకు గణనీయంగానే సీట్లు దక్కాయి. కూచాడి శ్రీహరిరావు (నిర్మల్), వినయ్‌కుమార్‌రెడ్డి (ఆర్మూరు), సునీల్‌రెడ్డి (బాల్కొండ), మైనంపల్లి రోహిత్‌రావు (మెదక్), ఆగం చంద్రశేఖర్ (జహీరాబాద్), మైనంపల్లి హన్మంతరావు (మల్కాజ్‌గిరి), కోట నీలిమ (సనత్‌నగర్), సరితా తిరుపతయ్య (గద్వాల), కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), కసిరెడ్డి నారాయణరెడ్డి (కల్వకుర్తి), జూపల్లి కృష్ణారావు (కొల్లాపూర్), వేముల వీరేశం (నకిరేకల్) ఇటీవల కాంగ్రెస్‌లో చేరినవారే. తొలి జాబితాలో ఆరుగురు మహిళలకు అవకాశం లభించింది. ఇందులో డాక్టర్ కోట నీలిమ, మొగిలి సునీత, సరితా తిరుపతయ్య, సింగాపురం ఇందిర, సీతక్క, నలమాద పద్మావతి ఉన్నారు. మైనార్టీలకు నాంపల్లి, కార్వాన్, మలక్‌పేట స్థానాలను కేటాయించారు.

గాంధీభవన్ వద్ద నిరసన సెగలు



గాంధీభవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

తొలి జాబితా విడుదలతోనే కాంగ్రెస్‌లో నిరసనల సెగలు కూడా మొదలయ్యాయి. పలు చోట్ల టికెట్లు ఆశించిన నేతలు, వారి అనుచరులు గాంధీభవన్ వద్ద ఆందోళనకు దిగారు. గద్వాల టికెట్‌ను అమ్ముకున్నారంటూ ఆ నియోజకవర్గ నేత కుర్వ విజయ్‌కుమార్ నేతృత్వంలో నిరసన తెలిపారు. మైనార్టీల ప్రాబల్యం ఉండే పాతబస్తీలో ఆ వర్గం నేతలకు కాకుండా ఇతరులకు టికెట్లు ఇచ్చారంటూ కొందరు మైనార్టీ నేతలు ఆందోళనకు దిగారు. ఉప్పల్, మేడ్చల్ వంటి చోట్ల కూడా టికెట్లు రాని వారి అనుచరులు నిరసన వ్యక్తం చేశారు. కొందరు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలను, దిష్టిబొమ్మలను దహనం చేశారు.

కుప్తంగా...

'స్థానిక' ఎన్నిక నిర్వహించకుంటే అసెంబ్లీ ఎన్నికల బహిష్కరణ

- ములుగు జిల్లా తొండ్యాల లక్ష్మీపురం ఆదివాసీల తీర్మానం



ఎన్నికల బహిష్కరణకు ఆమోదం తెలుపుతున్న గిరిజనులు

మంగపేట: ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు తాము ఓటు వేయబోమని, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని కొత్తూరు మొట్లగూడెం పంచాయతీ పరిధిలోని తొండ్యాల లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆదివాసీలు తీర్మానించారు. ఆదివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆదివాసీపెద్దలు బోదెబోయిన నర్సయ్య, యలగొండ రామయ్య మాట్లాడుతూ గ్రామంలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాభివృద్ధి కుంటుపడిందని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అంతర్గత రోడ్లు, మురికికాల్వలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రాజకీయకక్షలతో రెండు కిలోమీటర్ల దూరంలోని కోమటిపల్లి పంచాయతీలో ఉన్న తమ గ్రామాన్ని 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తూరుమొట్లగూడెం పంచాయతీలో చేర్చారని ఆరోపించారు. గ్రామ పంచాయతీగా ప్రకటించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎన్నికల్లో ఓటు వేసేదే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక నేతలు జబ్బ సమ్మయ్య, పొదెం రవీందర్, కోరెం లక్ష్మీపతి, బోదెబోయిన సత్యం, కబ్బాక శ్రావణ్‌కుమార్, పొదెం సమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించే పార్టీలకు బుద్ధి చెప్పాలి



ఆర్.కృష్ణయ్య

కాచిగూడ (హైదరాబాద్): రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు సంఘటితంగా ఉద్యమించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నేతను ముఖ్యమంత్రిగా ప్రకటించిన పార్టీలకే బీసీలు ఓట్లు వేసి గెలిపిస్తారని, ఈ వర్గాన్ని విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే పరేడ్ గ్రౌండ్‌లో 5 లక్షల మందితో బీసీల శంఖారావం సభను నిర్వహించి తమ సంఘటిత శక్తిని చాటుతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీ కులగణన నిర్వహించాలని, పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్ నిబంధన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పుంజాల వినయ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఇతర నేతలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల మృతి



తండ్రి కనకయ్య, పెద్ద కొడుకు భాస్కర్

గజ్వేల్‌రూరల్: వరిపొలంలో తెగి పడిన కరెంటు తీగలను కానక తాకడంతో తండ్రీకొడుకులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన కుమ్మరి కనకయ్య(52), లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు భాస్కర్, కరుణాకర్, అనిల్ ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున వరిపైరుకు నీరు పెట్టేందుకు వెళ్లిన కనకయ్య పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్‌తీగలను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో భాస్కర్(30), కరుణాకర్ పొలం వద్దకు వెళ్లారు. భాస్కర్ సైతం నేలపై పడిన విద్యుత్‌తీగలను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై కేకలు వేశాడు. దీంతో ఉలిక్కిపడిన కరుణాకర్ సమీప పొలాల వద్ద ఉన్న తోటి రైతులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా నిలిపివేసి వెళ్లి చూడగా భాస్కర్ విగతజీవిగా కనిపించాడు. వీరి వెంట వచ్చిన శునకం కూడా ఆ తీగలను తాకడంతో మృతి చెందింది. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో జాలిగామ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భాస్కర్‌కు భార్య భారతి, కొడుకు నవదీప్, కూతురు నవ్య ఉన్నారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి మాజీ మంత్రి మండవ

- రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని



మండవతో భేటీ అయిన రేవంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు త్వరలోనే కాంగ్రెస్ పార్టీ లో చేరనున్నారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం రాత్రి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు తుమ్మల నాగేశ్వరరావు, సుదర్శన్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు మండవ నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. పార్టీలోకి రావాలని ఆయనను ఆహ్వానించారు. కాంగ్రెస్ నేతల ఆహ్వానానికి మండవ సానుకూలంగా స్పందించారని, త్వరలో రాహుల్ గాంధీ సమక్షంలో ఆయన పార్టీ లో చేరతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని

ఖమ్మం జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడయిన బాలసానితో పాటు ఖమ్మం నగరానికి చెందిన ముగ్గురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, ఒక మాజీ కార్పొరేటర్, మరి కొందరు ముఖ్య నాయకులు ఆదివారం రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

కురుక్షేత్ర సంగ్రామంలో గెలిచేది మేమే

రాబోయే కురుక్షేత్ర సంగ్రామంలో విజయం తమదేనని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. ఖమ్మంలోని బాలసాని నివాసంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదన్నారు. యువత ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడితే ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు.

లెఫ్ట్ పార్టీలతో పొత్తు మాకు నష్టమే

- కాంగ్రెస్ గెలిచే సీట్లు అడుగుతున్నారు: కోమటిరెడ్డి
- కేసీఆర్ 'డొక్కు కారు' ముక్కలవడం ఖాయం



సాక్షి, న్యూఢిల్లీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలతో పొత్తు కాంగ్రెస్‌కు నష్టమే అని ఆ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా గెలిచే మిర్యాలగూడ సీటును లెఫ్ట్ పార్టీలు అడుగుతున్నాయని, వారు గెలిచే అవకాశం ఉన్న మునుగోడు ఇస్తామంటే మాత్రం కొత్తగూడెం సీటు కావాలని పట్టుబడుతున్నారని కోమటిరెడ్డి తెలిపారు. అయితే జాతీయ స్థాయిలో పార్టీ ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని ఆయన వెల్లడించారు. ఆదివారం కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైన తర్వాత కోమటిరెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మీడియాతో మాట్లాడారు. అందరికీ పదవులు ఇస్తానని ఆశపెట్టి కేసీఆర్ డొక్కు కారు ఎక్కించుకున్నారని, కానీ రాబోయే రోజుల్లో అది ముక్కలవడం ఖాయమని విమర్శించారు. కేసీఆర్ లేకుంటే కవిత, కేటీఆర్, హరీశ్‌లు బీఆర్‌ఎస్ పార్టీని మూడు ముక్కలు చేస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పొన్నాల లక్ష్మయ్యకు గుర్తింపు వచ్చిందని, టికెట్ రాదనే ఉద్దేశంతో పీసీసీ అధ్యక్షుడిని, పార్టీని నిందించడం సరికాదని హితవు పలికారు. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కృష్ణవేణికి టికెట్ దక్కకపోతే, తన నల్లగొండ టికెట్ ఆమెకు ఇచ్చి గెలిపించి చూపిస్తానని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో 70 సీట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని... వచ్చే మలి జాబితాలోనూ బీసీలకు పెద్దపీట ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ హామీలకు కేసీఆర్ రాజముద్ర

- ఆరు గ్యారంటీలను కాపీ కొట్టి మేనిఫెస్టో ప్రకటించారు
- ఆయన పాలనకు ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది
- కేసీఆర్ వస్తానంటే ఈనెల 17న మధ్యాహ్నం 12 గంటలకు అమరవీరుల స్థూపం వద్దకు వస్తా
- టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న రేవంత్. చిత్రంలో మాణిక్‌రావ్, ఫిరోజ్‌ఖాన్, మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలకు బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ రాజముద్ర వేశారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను కాపీ కొట్టి బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రకటించారని ఎద్దేవా చేశారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, అనిల్‌కుమార్‌యాదవ్, చామల కిరణ్‌రెడ్డిలతో కలిసి రేవంత్ మీడియాతో మాట్లాడారు. తమ ఆరు గ్యారంటీలను సాధ్యం కాదని చెప్పిన బీఆర్‌ఎస్ నేతలు తాజాగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రకటించిన తర్వాత ఇక ఆ మాటలు మాట్లాడే అర్హత కోల్పోయారన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ చిత్తుకాగితంగా చూస్తుందని, దానిపై పెద్దగా చర్చ అవసరం లేదని చెప్పారు.

సారా పాటల్లా ఉంది

మహాలక్ష్మి పథకం కింద తాము రూ.2,500 మహిళలకు ఇస్తామని చెపితే కేసీఆర్ రూ.3వేలు చెప్పారని, రూ.500కే గ్యాస్‌సిలెండర్ ఇస్తామంటే ఆయన రూ.400 చెప్పారని, పింఛన్లు రూ.4వేలు ఇస్తామని తాము చెపితే ఆయన రూ.5వేలు చెప్పారని, రైతు బంధు కింద తాము రూ.15వేలు ఇస్తామంటే కేసీఆర్ రూ.16వేలు చెప్పారని రేవంత్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ చెప్పిన మాటలు చూస్తుంటే గతంలో ఒకటోసారి, రెండోసారి, మూడోసారి అన్నట్టు సారా పాటల్లా చెప్పారని, మూడోసారి అనకుండానే పెద్దలోయలో పడిపోయారన్నారు. రాష్ట్రమే కాదని, కేసీఆర్ బుర్ర కూడా దివాళా తీసిందని, బ్లాక్ అండ్ వైట్ సినిమాను కలర్‌లో చూపించినట్టు మేనిఫెస్టో ప్రకటించారని విమర్శించారు. కేసీఆర్ లాగా తాము ఉత్తుత్తి హామీలను ఇవ్వలేమని, ఆరు గ్యారంటీలను అమలు చేయగలమనే నమ్మకంతోనే ప్రకటించామని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్‌హామీలు ఆచరణ సాధ్యమేనని కేసీఆర్ ప్రెస్‌మీట్‌తో రాష్ట్ర ప్రజలకు అర్థమైందన్నారు. 'కేసీఆర్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా. ఈ ఎన్నికల్లో చుక్క మందు పోయకుండా, డబ్బులు పంచకుండా ఓట్లు అడగాలి. ఈ పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలనుకుంటే ఈనెల 17న మధ్యాహ్నం 12 గంటలకు కేసీఆర్ అమరవీరుల స్థూపం వద్దకు రావాలి. ఇద్దరం ప్రమాణం చేద్దాం.'అని అన్నారు.

కేసీఆర్ విశ్రాంతి తీసుకోవాలి

రాష్ట్రం నిజంగా దివాళా తీయకపోతే ప్రతి నెలా ఉద్యోగులకు వేతనాలు, ఆసరా పింఛన్లను ఒకటో తేదీన ఇవ్వాలని రేవంత్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను చూసిన తర్వాత కేసీఆర్‌కు చలి జ్వరం వచ్చిందని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ఓటమిని కేసీఆర్ ముందుగానే అంగీకరించి కాడి కిందపడేశారని చెప్పారు. 'కేసీఆర్ మీ పాలనకు ఎక్స్‌పైరీ డేట్ అయిపోయింది. ఆలోచన శక్తిని కూడా మీరు కోల్పోయారు.. ఇక మీరు విశ్రాంతి తీసుకోండి.'అని రేవంత్ వ్యాఖ్యానించారు.

'ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

సాక్షి, హైదరాబాద్: ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని టీచర్స్ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్, టీఎస్ (పీఆర్‌టీయూ టీఎస్) రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం హైదరాబాద్‌లో సంఘ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, టీచర్ల సమస్యల పరిష్కారంలో తాము ఎప్పుడూ ముందుంటామని, టీచర్ల పదోన్నతుల షెడ్యూల్ విడుదల, నగదు రహిత వైద్య పథకం తేవడంలో తగిన కృషి చేశామన్నారు. మంచి ఫిట్మెంట్‌తో రెండవ పీఆర్సీ కూడా అందిస్తామన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు దానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేయాలని, గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు అందించాలని, హెల్త్ కార్డులు అందజేయాలని పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, సంఘం పత్రిక ప్రధాన సంపాదకులు ఇన్నారెడ్డి, సంఘ నేతలు మనోహర్, చిత్తలూరి ప్రసాద్, గీత, త్రివేణి, విజయ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ఆధ్వర్యంలో ప్రచురించిన 2024 సంవత్సరం క్యాలెండర్‌ను ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ఆదివారం ఆవిష్కరించారు. కొండపైన వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో రూ.25 రుసుముతో నూతన సంవత్సరం క్యాలెండర్లను అమ్మనున్నట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, రఘు పాల్గొన్నారు.

55 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

▶ మొదటి పేజీ తరువాయి

పొత్తులు, సీట్ల కేటాయింపులపై చర్చలు జరుగుతున్నాయి. అవి ఒక కొలిక్కి వచ్చిన తర్వాత అసెంబ్లీ అభ్యర్థుల మలి జాబితాపై కసరత్తు పూర్తిచేసి విడుదల చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తున్నట్టు తెలిసింది.

కాంగ్రెస్ తొలి జాబితా ఇదీ..

కొడంగల్:	ఎనుముల రేవంత్‌రెడ్డి	జహీరాబాద్(ఎస్సీ):	ఆగం చంద్రశేఖర్
మధిర (ఎస్సీ):	మల్లు భట్టి విక్రమార్క	గజ్వేల్:	తూముకుంట నర్సారెడ్డి
ఆందోల్ (ఎస్సీ):	దామోదర రాజనర్సింహ	మేడ్చల్:	తోటకూర వజ్రేశ్ కుమార్
హుజూర్‌నగర్:	ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కుత్బుల్లాపూర్:	కొలను హన్మంతరెడ్డి
కోదాడ:	ఎన్.పద్మావతి	ఉప్పల్:	ఎం.పరమేశ్వర్‌రెడ్డి
నల్లగొండ:	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి	చేవెళ్ల(ఎస్సీ):	పమేన భీంభారత్
మంథని:	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు	పరిగి:	టి.రామ్మోహన్‌రెడ్డి
సంగారెడ్డి:	తూర్పు జగ్గారెడ్డి	వికారాబాద్ (ఎస్సీ):	గడ్డం ప్రసాద్‌కుమార్
ములుగు (ఎస్టీ):	ధనసరి అనసూయ (సీతక్క)	ముషీరాబాద్:	అంజన్‌కుమార్ యాదవ్
భద్రాచలం (ఎస్టీ):	పోదెం వీరయ్య	మలక్‌పేట్:	షేక్ అక్బర్
కొల్లాపూర్:	జూపల్లి కృష్ణారావు	సనత్‌నగర్:	కోట నీలిమ
మల్కాజ్‌గిరి:	మైనంపల్లి హన్మంతరావు	నాంపల్లి:	మహ్మద్ ఫిరోజ్‌ఖాన్
మెదక్:	మైనంపల్లి రోహిత్‌రావు	చాంద్రాయణగుట్ట:	బోయ నగేశ్ (నరేశ్)
నాగార్జునసాగర్:	జయవీర్‌రెడ్డి	కార్వాన్:	ఉస్మాన్ బిన్ మహ్మద్ అలీ హజ్రీ
జగిత్యాల:	టి.జీవన్‌రెడ్డి	గోషామహల్:	మొగిలి సునీత
బెల్లంపల్లి:	గడ్డం వినోద్	యాకుత్‌పుర:	కె.రవిరాజు
మంచిర్యాల:	కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు	బహదూర్‌పుర:	రాజేశ్‌కుమార్ పులిపాటి
నిర్మల్:	కూచాడి శ్రీహరిరావు	సికింద్రాబాద్:	ఆదమ్ సంతోష్‌కుమార్
ఆర్మూర్:	పి.వినయ్‌కుమార్	అలంపూర్(ఎస్సీ):	ఎస్.ఏ.సంపత్‌కుమార్
బోధన్:	పి.సుదర్శన్‌రెడ్డి	అచ్చంపేట(ఎస్సీ):	చిక్కుడు వంశీకృష్ణ
బాల్కొండ:	సునీల్‌కుమార్ ముత్యాల	గద్వాల:	సరితా తిరుపతయ్య
ధర్మపురి(ఎస్సీ):	అడ్లూరి లక్ష్మణ్‌కుమార్	నాగర్‌కర్నూల్:	కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి
నకిరేకల్(ఎస్సీ):	వేముల వీరేశం	కల్వకుర్తి:	కసిరెడ్డి నారాయణరెడ్డి
వేములవాడ:	ఆది శ్రీనివాస్	షాద్‌నగర్:	కె.శంకరయ్య
రామగుండం:	ఎం.ఎస్.రాజ్‌ఠాకూర్	ఆలేరు:	బీర్ల ఐలయ్య
పెద్దపల్లి:	సీహెచ్.విజయరమణారావు	స్టేషన్ ఘన్‌పూర్:	సింగాపురం ఇందిర
మానకొండూరు (ఎస్సీ):	కవ్వంపల్లి సత్యనారాయణ	నర్సంపేట:	దొంతి మాధవరెడ్డి
		భూపాలపల్లి:	గండ్ర సత్యనారాయణరావు

18న ములుగులో సభ.. 19న భూపాలపల్లిలో పాదయాత్ర

- రాహుల్ గాంధీ మూడురోజుల రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారు
- 20న ఆర్మూర్‌లో సభ, పసుపు రైతులతో ముఖాముఖి
- కొండగట్టు నుంచి బస్సుయాత్ర టూర్‌లో మార్పు
- దసరా తర్వాత రెండో విడత పర్యటన.. నామినేషన్లు ముగిశాక మూడో విడత



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణలో మూడు రోజుల పర్యటన ఖరారైంది. ఈనెల 18న కాంగ్రెస్ బస్సుయాత్రను ప్రారంభించేందుకు రానున్న ఆయన మూడు రోజులపాటు ఇక్కడే ఉండనున్నారు. ముందుగా కొండగట్టు నుంచి బస్సుయాత్రను ప్రారంభించాలని భావించినా, రాహుల్ షెడ్యూల్‌లో కొంత మార్పు జరిగింది. దీని ప్రకారం రామప్ప ఆలయం వద్ద రాహుల్ కాంగ్రెస్ బస్సుయాత్రను ప్రారంభిస్తారు. ఏఐసీసీ వర్గాలు వెల్లడించిన ఈ షెడ్యూల్ ప్రకారం 18, 19, 20 తేదీల్లో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో రాహుల్ బస్సుయాత్రలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పాదయాత్రలు చేయనున్న ఆయన పలువురు కార్మికులు, ఇతర వర్గాలతో సమావేశం కానున్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించనున్నారు. ములుగు, పెద్దపల్లి, ఆర్మూర్ బహిరంగ సభల్లో పాల్గొంటారు.

మూడు దశల్లో బస్సు యాత్ర

ప్రతి రోజు మూడు నియోజకవర్గాల చొప్పున 12 రోజులపాటు రాష్ట్రంలోని 36 నియోజకవర్గాల్లో బస్సుయాత్ర నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగా తొలి విడతలో రాహుల్ మూడు రోజులపాటు 8 నియోజకవర్గాల్లో యాత్ర నిర్వహించనున్నారు. మూడు రోజుల పర్యటనతో తొలి విడత యాత్ర ముగియనుండగా, దసరా తర్వాత రెండో విడత ప్రారంభించనున్నారు. ఆ సమయంలో ప్రియాంకా గాంధీ హాజరయ్యే అవకాశముంది. ఇక, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిశాక మూడో విడత నిర్వహించాలని, ఈ యాత్రకు సోనియాతో సహా కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యేలా టీపీసీసీ ప్రణాళిక రూపొందిస్తోంది.

రాహుల్ తొలి విడత షెడ్యూల్ ఇదే

18-10-2023:	సాయంత్రం 4 గంటలకు రామప్ప ఆలయం సందర్శన. ములుగు బహిరంగసభకు హాజరు. రాత్రికి భూపాలపల్లిలో బస
19-10-2023:	ఉదయం 7-8 గంటల వరకు భూపాలపల్లిలో నిరుద్యోగులతో పాదయాత్ర. 10-12:30 గంటల వరకు రామగుండంలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగ బాధితులతో సమావేశం. సాయంత్రం 4-6 వరకు పెద్దపల్లిలో బహిరంగసభ (రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, రైతులతో భేటీ) రాత్రి 7-8 గంటల వరకు కరీంనగర్‌లో పాదయాత్ర, అక్కడే బస.
20-10-2023:	ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బోధన్‌లో బీడీ కార్మికులు, గల్ఫ్‌కు వలసవెళ్లిన వారి కుటుంబాలతో ముఖాముఖి. నిజాం షుగర్ ఫ్యాక్టరీ సందర్శన. సాయంత్రం 4-6 గంటల వరకు ఆర్మూరులో బహిరంగసభ. అక్కడే పసుపు, చెరుకు రైతులతో ముఖాముఖి రాత్రి 7-8 గంటల వరకు నిజామాబాద్‌లో పాదయాత్ర

రూ.3.04 కోట్ల నగదు పట్టివేత



నల్లగొండ క్రైం: ఎలాంటి ఆధారాల్లేకుండా కారులో తీసుకెళ్తున్న రూ.3.04కోట్ల నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎస్పీ అపూర్వరావు తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఆదివారం ఉదయం మాడుగులపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలుపు రంగు కారు ఆపకుండా వేగంగా వెళ్లడంతో అక్కడి పోలీసులు మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరికి సమాచారమిచ్చారు. ఆయన ఇతర పోలీస్‌స్టేషన్ల సిబ్బందిని అప్రమత్తం చేయగా దామరచర్ల మండలం వాడపల్లిలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బారికేడ్లు పెట్టి కారును అడ్డుకున్నారు. కారులోని ఇద్దరు వ్యక్తులు గుజరాత్‌కు చెందిన విపుల్‌కుమార్ భాయ్, అమర్‌సిన్హా జాలగా గుర్తించారు. కారు కింది భాగంలో ప్రత్యేకమైన బాక్స్ ఏర్పాటు చేసి అందులో రూ.3.04కోట్ల నగదు దాచినట్లు గుర్తించి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కారు హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్నట్లు తెలిపారు.

సేవ్ గాజా...!



న్యూఢిల్లీ: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం తాలూకు ప్రకంపనలు ప్రపంచమంతటా పలు రూపాల్లో బయట పడుతున్నాయి. ఢిల్లీలో జరుగుతున్న లాక్మే ఫ్యాషన్ వేదికపై ఆదివారం ఒక యువతి ఉన్నట్టుండి ప్రేక్షకుల్లోంచి దూసుకొచ్చింది. 'సేవ్ గాజా' అని రాసి ఉన్న ప్లకార్డు ప్రదర్శిస్తూ ర్యాంప్‌పై నడిచింది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో అందరూ నిశ్చేష్టులయ్యారు.

అఫ్గానిస్తాన్‌లో మళ్లీ భూకంపం

ఇస్లామాబాద్: అఫ్గానిస్తాన్‌లో మరోసారి భూకంపం సంభవించింది. ఈనెల 7వ తేదీన శక్తివంతమైన భూకంపం చోటుచేసుకున్న హెరాట్ ప్రావిన్స్‌లోనే ఆదివారం మళ్లీ భూమి కంపించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం హెరాట్ ప్రావిన్స్ రాజధాని హెరాట్ నగరానికి 34 కిలోమీటర్ల దూరంలో భూమికి 8 కిలోమీటర్ల లోతులో ఉందని అధికారులు తెలిపారు. తాజా భూకంపం తాకిడికి నలుగురు చనిపోగా మరో 150 మందికి పైగా గాయపడినట్లు స్వచ్ఛంద సంస్థలు తెలిపాయి. బలోచ్ ప్రాంతంలోని రబట్ సాంగి జిల్లాలోని కొన్ని గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభావిత ప్రాంతాలకు సహాయక బృందాలు చేరుకోవాల్సి ఉండగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 7న భూకంపం సంభవించిన హెరాట్ ప్రావిన్స్‌లో గ్రామాలకు గ్రామాలే తుడిచి పెట్టుకుపో యాయి. మొత్తం 2 వేల మందికి పైగా చనిపో గా మృతుల్లో 90 శాతం వరకు మహిళలు, చిన్నారులే ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి పేర్కొంది.

క్రీడలను విద్వేషాస్త్రంగా వాడొద్దు: ఉదయనిధి

సాక్షి, చెన్నై: క్రికెట్ ప్రేక్షకులనుద్దేశిస్తూ తమిళనాడు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. శనివారం అహ్మదాబాద్‌లో భారత్–పాకిస్తాన్ వన్‌డే క్రికెట్ మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. పాక్ ఆటగాడు మొహమ్మద్ రిజ్వాన్ ఔట్ అయి డ్రెస్సింగ్ రూమ్ వైపు వెళ్తుండగా స్టేడియంలో కొందరు ప్రేక్షకులు జై శ్రీరాం...జై శ్రీరాం అని నినదిస్తున్నట్లు చూపే వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో షేర్ అవుతోంది. దీనిపై ఉదయనిధి స్పందించారు. 'ఇలాంటి ధోరణి మంచిది కాదు. క్రీడలను విద్వేషానికి అస్త్రంగా చేసుకోవడం తగదు. క్రికెట్‌ను క్రికెట్‌గానే చూడాలి. ఆటల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందాలి. అతిథులకు మర్యాద, గౌరవాన్ని ఇచ్చే భారతదేశంలో పాకిస్తాన్ క్రీడాకారులకు వ్యతిరేకంగా ఇలాంటి పద్ధతులను అనుసరించడాన్ని వ్యతిరేకిస్తున్నా' అని ట్వీట్‌చేశారు. కాగా, గతంలో సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా తీవ్ర వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్ నుంచి స్వదేశానికి మరో 471 మంది..

న్యూఢిల్లీ: ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నుంచి ఆదివారం రెండు విమానాల్లో 471 మంది భారతీయులు ఢిల్లీకి చేరుకున్నారు. వీటిలో ఒక విమానం ఎయిరిండియాకు చెందినది కాగా, మరోటి స్పైస్‌జెట్ సంస్థదని అధికారులు చెప్పారు. ఆదివారం ఉదయం 197 మందితో కూడిన మూడో విమానం ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగా, 274 మంది ప్రయాణికులతో నాలుగో విమానం సాయంత్రం వచ్చినట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి చెప్పారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆయన 'ఎక్స్'లో విడుదల చేశారు. శుక్ర, శనివారాల్లో ఎయిరిండియా ఏర్పాటు చేసిన ఛార్టర్డ్ విమానాల్లో 435 మంది భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. తాజా తరలింపుతో యుద్ధ వాతావరణం నెలకొన్న ఇజ్రాయెల్ నుంచి ఇప్పటి వరకు నాలుగు విమానాల్లో స్వదేశానికి వచ్చిన భారతీయుల సంఖ్య 900 దాటింది.

43 ఏళ్ల తర్వాత రేప్ కేసు నిందితుడి పట్టివేత

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా పోలీసులు అత్యాచారం కేసులో నిందితుడిని 43 ఏళ్ల తర్వాత పట్టుకున్నారు. మెంధార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్‌గ్లూన్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఖలీక్‌పై 1979లో రేప్ సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 1992లో పూంఛ్ సెషన్స్ కోర్టు సీఆర్‌పీసీలోని సెక్షన్ 512 కింద అబ్దుల్‌పై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. తప్పించుకు తిరుగుతున్న అతడిని మెంధార్ పోలీస్ స్టేషన్ ఏరియాలోనే అరెస్ట్ చేసినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు.

ఆకలి కేకలు.. ఆర్తనాదాలు

గాజాలో ఆహారం, నీరు, ఇంధనం కొరత తీవ్రరూపం

ఉప్పునీరు, అపరిశుభ్రమైన నీటితో గొంతు తడుపుకుంటున్న జనం

- ఆసుపత్రుల్లో దయనీయంగా మారిన క్షతగాత్రుల పరిస్థితి
- బందీలను విడుదల చేస్తేనే సరఫరాలు పునరుద్ధరిస్తామంటున్న ఇజ్రాయెల్
- ఉత్తర గాజా నుంచి జనం తరలింపు పూర్తయ్యాక భూతల దాడులు!
- ఇప్పటివరకు గాజాలో 2,329 మంది, ఇజ్రాయెల్‌లో 1,300 మంది మృతి

గాజా స్ట్రిప్/జెరూసలేం: కాలే కడుపులకు తిండి లేదు, దాహంతో అలమటిస్తున్న గొంతులకు గుక్కెడు నీరు లేదు, ఆసుపత్రుల్లో ఔషధాలు లేవు, రాత్రయితే కరెంట్ లేదు. దూసుకొస్తున్న రాకెట్లు, కళ్లెదుటే కుప్పకూలుతున్న భవనాలు, ప్రాణాలు కోల్పోతున్న సామాన్య జనం. ఇజ్రాయెల్ బలగాల నిర్బంధంలో చిక్కుకున్న గాజాలో ప్రస్తుత దయనీయ పరిస్థితి ఇది. గాజాలోకి ఆహారం, నీరు, కరెంటు సరఫరా కాకుండా దారులు మూసుకుపోయాయి. ఈజిప్టు తన సరిహద్దును మూసివేసింది. గాజాలోని 23 లక్షల మంది జనం అల్లాడిపోతున్నారు. కొందరు మరో దారిలేక ఉప్పునీరు, అపరిశుభ్రమైన నీరు తాగుతున్నారు. ఇజ్రాయెల్ కరుణిస్తే తప్ప వారికి ఆహారం, మంచినీరు దొరకదు. హమాస్ చేతిలో ఉన్న బందీలు విడుదలైన తర్వాతే సరఫరాల గురించి ఆలోచిస్తామని ఇజ్రాయెల్ తేల్చి చెబుతోంది. ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలై వారం రోజులు దాటింది. ఇరుపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. శత్రువులను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ముందుకు దూసుకెళ్తోంది. మిలిటెంట్లు ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్లు ఎక్కుపెడుతున్నారు. ఈ పోరాటంలో గాజాలో ఇప్పటిదాకా 2,329 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ దాడిలో ఇజ్రాయెల్‌లో 1,300 మందికిపైగా జనం మృత్యువాతపడ్డారని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 7,000కుపైగా ఇళ్లు కూలిపోయాయి.

పాలస్తీనియన్ల కోసం రెండు కారిడార్లు

ఉత్తర గాజాను వెంటనే ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేయడంతో వేలాది మంది పాలస్తీనియన్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, సొంత ఇళ్లు వదిలేసి వెళ్లిపోతున్నారు. వారికోసం రెండు సురక్షిత కారిడార్లు ఏర్పాటు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఉత్తర గాజా క్రమంగా ఖాళీ అవుతోంది. 10 లక్షల మందికిపైగా జనం తరలివెళ్లాలంటే వారం రోజులకుపైగా సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడి, గాజాలో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వేలాది మంది బాధితులు ఎటూ కదల్లేకపోతున్నారు. ఆసుపత్రుల్లో ఔషధాలు, ఇంధనం కొరతతో చికిత్సలు ఆగిపోయాయి. గాజాలోని హమాస్ మిలిటెంట్ల స్థావరాలను సమూలంగా నాశనం చేయక తప్పదని, అదే తమ ప్రధాన లక్ష్యమని ఇజ్రాయెల్ సైన్యం పునరుద్ఘాటించింది. మిలిటెంట్ల సొరంగాలను ధ్వంసం చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించింది. కలుగులో దాక్కున్నా చావు తప్పదని హమాస్ సభ్యులను హెచ్చరించింది.

ఆసుపత్రుల్లో బాలింతలు, శిశువులు

యుద్ధం ఉధృతంగా మారుతుందని, ఉత్తర గాజా నుంచి సామాన్య ప్రజలంతా సాధ్యమైనంత త్వరగా దక్షిణ గాజాకు వెళ్లిపోవాలని ఆదివారం ఇజ్రాయెల్ సూచించింది. విమానాల ద్వారా కరపత్రాలు జారవిడిచింది. కాగా, ఉత్తర గాజా నుంచి ఎవరూ వెళ్లొద్దని, ఇళ్లల్లోనే ఉండాలని పాలస్తీనియన్లకు హమాస్ విజ్ఞప్తి చేసింది. ఉత్తర గాజాలోని ఆసుపత్రిల్లో 2,000 మందికిపైగా బాధితులు ఉన్నారని, చాలామంది ఐసీయూల్లో చికిత్స పొందుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఆసుపత్రుల్లో పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, ఇంక్యుబేటర్లలో శిశువులు ఉన్నారని, తరలింపు కార్యక్రమం వల్ల వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

బందీల కుటుంబ సభ్యుల ఆగ్రహం

హమాస్ అధీనంలో ఉన్న 150 మంది బందీల క్షేమ సమాచారం తెలియడం లేదు. బందీలను వెంటనే విడిపించాలని డిమాండ్ చేస్తూ వారి కుటుంబ సభ్యులు టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ రక్షణ శాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. తన భార్య, ముగ్గురు బిడ్డలను మిలిటెంట్లు అపహరించారని, వారిని క్షేమంగా తన వద్దకు చేర్చాలని అవిహై బ్రాడ్జ్ అనే వ్యక్తి కన్నీటితో వేడుకున్నాడు.

ఈజిప్టు సరిహద్దు తెరిస్తే..

ఈజిప్టు–గాజా మధ్యనున్న రఫా సరిహద్దును తెరిపించేందుకు అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. ఈజిప్టుతో చర్చిస్తోంది. గాజా ప్రజల కోసం వివిధ దేశాలు ఇచ్చిన ఆహారం, ఔషధాలు, ఇతర నిత్యావసరాలు ప్రస్తుతం ఈజిప్టులో ఉన్నాయి. వాటిని గాజాకు చేర్చడానికి సరిహద్దును తెరవాలని అమెరికా అంటోంది. ఇజ్రాయెల్‌కు అమెరికా ఆయుధ సాయం అందిస్తోంది. ఇప్పటికే ఒక యుద్ధవిమాన వాహక నౌకను మధ్యధరా సముద్రానికి పంపించింది. యూఎస్ఎస్ ఐసెన్‌హోవర్ యుద్ధనౌకను పంపించినట్లు అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ సౌదీ అరేబియా యువరాజు సల్మాన్‌తో సమావేశమయ్యారు.

కళ్లల్లో భయం మనసు శిథిలం



వైమానిక దాడుల నేపథ్యంలో గాజా స్ట్రిప్‌లో ధ్వంసమైన తమ ఇంట్లోంచి ఆకాశంవైపు భయంతో చూస్తున్న చిన్నారులు

దక్షిణ గాజాకు వెళ్లకుండా అడ్డుకుంటున్న హమాస్

ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. అయితే, జనం వెళ్లిపోకుండా హమాస్ మిలిటెంట్లు ఎక్కడికక్కడ బలవంతంగా అడ్డుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసింది. సామాన్య ప్రజలను రక్షణ కవచంగా వాడుకుంటూ ఇజ్రాయెల్ దాడుల నుంచి కాపాడుకోవాలన్నదే మిలిటెంట్ల అసలు లక్ష్యమని వెల్లడించింది. ఉత్తర గాజా ప్రజలు ముందుకు వెళ్లకుండా మిలిటెంట్లు వాహనాలను అడ్డుగా పెట్టి రోడ్లను దిగ్బంధిస్తున్నారని పేర్కొంది. వారి ఆరాటమంతా సొంత భద్రత కోసమేనని విమర్శించింది. హమాస్ మిలిటెంట్ల ఏరివేత కోసం ఉత్తర గాజాపై భూతల దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ సైన్యం అక్కడున్న పాలస్తీనియన్లకు మరికొంత సమయం ఇవ్వాలని యోచిస్తోంది. జనమంతా దక్షిణ గాజాకు చేరుకున్న తర్వాత భూతల దాడులకు శ్రీకారం చుట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.



దక్షిణ గాజాలో పెట్రోల్ బంక్ వద్ద క్యూ కట్టిన పాలస్తీనియన్లు



గాజా స్ట్రిప్‌లో నీటి కోసం ఎదురుచూస్తున్న స్థానికులు



గ్యాస్‌లేక కట్టెలపొయ్యిపై శరణార్థులకు వంటచేస్తున్న దృశ్యం

హమాస్ సీనియర్ కమాండర్ బిలాల్ అల్‌–ఖేద్రా హతం

హమాస్ మిలిటెంట్లకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాజా స్ట్రిప్‌లో శనివారం రాత్రి జరిగిన ఇజ్రాయెల్ రాకెట్ దాడుల్లో హమాస్ సీనియర్ కమాండర్ బిలాల్ అల్‌–ఖేద్రా మరణించాడు. అంతేకాకుండా పలువురు ఇస్లామిక్ జిహాద్ ఉగ్రవాదులు సైతం హతమయ్యారు. ఈ విషయన్ని ఇజ్రాయెల్ వైమానిక దళం ఆదివారం ట్వీట్ చేసింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ నిరిమ్, నిర్ ఓజ్‌లో గత వారం జరిగిన పలు దాడుల్లో అతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. హమాస్ నుఖ్బా యూనిట్‌కు చెందిన దక్షిణ ఖాన్ యూనిస్ బెటాలియన్‌కు బిలాల్ నేతృత్వం వహిస్తున్నాడు.

నెతన్యాహూ, అబ్బాస్‌కు జో బైడెన్ ఫోన్

ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్నామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి స్పష్టం చేశారు. గాజాలోని పాలస్తీనా ప్రజలకు వెంటనే మానవతా సాయం అందాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బాస్‌తో జో బైడెన్ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణ ముదరకుండా చర్యలు ప్రారంభించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ దిశగా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. గాజా ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు సరఫరా చేయడానికి వీలుగా ఐక్యరాజ్యసమితితోపాటు ఈజిప్టు, జోర్డాన్, ఇజ్రాయెల్ తదితర దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నామని వివరించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి మొదలైన తర్వాత మొహమ్మద్ అబ్బాస్‌తో బైడెన్ మాట్లాడడం ఇదే మొదటిసారి. నెతన్యాహూతో మాట్లాడడం ఐదోసారి.

టెస్లా కారు ప్రాణం కాపాడింది

ఇజ్రాయెల్‌లో హమాస్‌లో చేసిన దాడిలో టెస్లా మోడల్–3 ఎలక్ట్రిక్ కారు ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ఫ్రీడమ్ పార్టీ అధినేత గిలాడ్ అల్పర్ 'ఎక్స్'లో షేర్ చేశారు. అయితే బాధితుడి వివరాలను బహిర్గతం చేయలేదు. గిలాడ్ కథనం ప్రకారం.. బాధితుడు అత్యవసర బృందంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 7న హమాస్ మిలిటెంట్లు దాడి చేస్తున్నారని తెలియడంతో తన టెస్లా మోడల్–3 కారులో అసెంబ్లీ పాయింట్ వద్దకు బయలుదేరాడు. అతడిని చూడగానే మిలిటెంట్లు కాల్పులు ప్రారంభించారు. అది ఎలక్ట్రిక్ కారు అనే విషయం వారికి తెలియదు. డీజిల్ ట్యాంకు ఉండే భాగంపై కాల్పులు జరిపారు. నిజానికి అందులో డీజిల్ ట్యాంకు ఉండదు. టైర్లపై కూడా కాల్చారు. అయినా కారు చెక్కుచెదరలేదు. బాధితుడు మరింత వేగంగా కారులో ముందుకు దూసుకెళ్లాడు. కొన్ని బుల్లెట్లు అతడి శరీరంలోకి దూసుకెళ్లాయి. రక్తం కారుతున్నా అలాగే ఆసుపత్రికి చేరుకున్నాడు. వైద్యులు అతడికి చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనపై టెస్లా, 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ స్పందించారు. టెస్లా కారు వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్సీపీ మాజీ ఎంపీ రూ.315 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: మహారాష్ట్రకు చెందిన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) మాజీ ఎంపీ ఈశ్వర్‌లాల్ శంకర్‌లాల్ జైన్ లల్వానీకి చెందిన రూ.315 కోట్ల విలువైన ఆస్తుల్ని అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది. రాజ్యసభ మాజీ సభ్యుడైన లల్వానీ, కుటుంబసభ్యులపై బ్యాంకులను మోసం చేయడం, మనీల్యాండరింగ్‌కు పాల్పడినట్లు కేసులున్నాయి. రాజ్‌మల్ లఖిచంద్ జ్యువెల్లర్స్, ఆర్ఎల్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, మన్‌రాజ్ జ్యువెల్లర్స్ తదితర సంస్థలకు లల్వానీయే ప్రమోటర్. ఈ కంపెనీల డైరెక్టర్లు/ప్రమోటర్లు తప్పుడు ఆర్థిక లావాదేవీలతో రుణాలు పొంది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.352.49 కోట్లు నష్టం కలుగజేసినట్లు ఈడీ తెలిపింది. కేసు దర్యాప్తులో భాగంగా ఆగస్టులో పలు ప్రాంతాల్లో సోదాలు జరిపినట్లు తెలిపింది. ఈ మేరకు మనీల్యాండరింగ్ నిరోధక చట్టం కింద మహారాష్ట్ర వ్యాప్తంగా 70 చోట్ల ఉన్న స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లు వివరించింది.

కర్ణాటకలో కొనసాగుతున్న ఐటీ దాడులు

బెంగళూరు: కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో గురువారం నుంచి కొనసాగుతున్న సోదాల్లో పట్టుబడిన నగదు మొత్తం రూ.50 కోట్లకు చేరిందని ఆదాయ పన్ను(ఐటీ)శాఖ వెల్లడించింది. ఒక కాంట్రాక్టర్, ఆయన కొడుకు, ఒక జిమ్ యజమాని, ఆర్కిటెక్ట్, రెండు బడా కంపెనీలకు చెందిన మొత్తం 55 ప్రాంతాల్లో దాడులు జరిపినట్లు ఓ అధికారి వివరించారు. శనివారం సాయంత్రం ఆర్కిటెక్ట్, జిమ్ యజమానికి చెందిన ఇళ్లలో చేపట్టిన సోదాల్లో మరో రూ.8 కోట్ల నగదును పట్టుకున్నట్లు చెప్పారు. దీంతో, ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న డబ్బు రూ.50 కోట్లకు చేరుకుందన్నారు. దాడులు ఇంకా కొనసాగుతు న్నాయన్నారు. కర్ణాటకలోని గత బీజేపీ ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్లు వసూలు చేస్తోందంటూ తీవ్ర ఆరోపణలు చేసిన ఓ కాంట్రాక్టర్ ఇంట్లో సోదాల్లో రూ.42 కోట్ల నగదు దొరికినట్లు శుక్రవారం ఐటీ అధికారులు ప్రకటించడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఓటర్లను కొనేందుకే కాంగ్రెస్ ఈ డబ్బును దాచి ఉంచినట్లు బీజేపీ ఆరోపిస్తోంది.

ఎయిరిండియా విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

న్యూఢిల్లీ: దుబాయ్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు వస్తున్న ఎయిరిండియా విమానం మెడికల్ ఎమర్జెన్సీతో ఆదివారం అత్యవసరంగా పాకిస్తాన్‌లోని కరాచీలో దిగింది. ఉదయం 8.51కి దుబాయ్‌లో బయల్దేరగా కాసేపటికే ఒక ప్రయాణికునికి వైద్యపరమైన సమస్య తలెత్తింది. దాంతో విమానాన్ని అతి సమీపంలో ఉన్న కరాచీలో దింపారు. ఆ ప్రయాణికునికి చికిత్స తర్వాత మధ్యాహ్నం 12.30కు విమానం కరాచీ నుంచి అమృత్‌సర్ బయల్దేరింది.

ప్రశ్నలడిగేందుకు లంచం తీసుకున్నారు

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపణ

- చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్‌కు ఫిర్యాదు
- తిప్పికొట్టిన టీఎంసీ నేత

న్యూఢిల్లీ: టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకున్నారంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే ఆరోపించారు. తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన, కాంటెంప్ట్ ఆఫ్ హౌస్, నేరంగా ఆయన పేర్కొన్నారు. మొయిత్రా, వ్యాపారవేత్త నుంచి లంచం తీసుకుంటున్నట్లు ఉన్న తిరుగులేని సాక్ష్యాలను ఒక న్యాయవాది తనతో పంచుకున్నారని దూబే చెప్పారు. 'అదానీ గ్రూప్ లక్ష్యంగా ఇప్పటి వరకు ఆమె లోక్‌సభలో ఇప్పటి వరకు 50 నుంచి 61 వరకు ప్రశ్నలడిగారు. 12 డిసెంబర్ 2005 నాటి 'క్యాష్ ఫర్ క్వెరీ' వ్యవహారాన్ని గుర్తుచేసే విధంగా పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగడం ద్వారా వ్యాపారవేత్త శ్రీ దర్శన్ హీరానందానీ వ్యాపార ప్రయోజనాలను కాపాడేందుకు మహువా మొయిత్రా పన్నిన నేరపూరిత కుట్ర అనేందుకు ఎలాంటి సందేహం లేదు. విచారణ కమిటీ ఏర్పాటు చేసి ఈ ఆరోపణల్లో నిగ్గు తేల్చాలి'అని ఆయన స్పీకర్ బిర్లాను కోరారు. దీనిపై మొయిత్రా ఘాటుగా స్పందించారు. ముందుగా దుబేపై పెండింగ్‌లో ఉన్న ఆరోపణలపై స్పీకర్ చర్యలు తీసుకున్నాక తనపై చర్యలకు ఉపక్రమిస్తే సంతోషిస్తానని ఆమె అన్నారు. 'నకిలీ డిగ్రీ పట్టావాలా, ఇతర బీజేపీ ప్రముఖులపై పెండింగ్‌లో ఉన్న ఉల్లంఘనలు చాలానే ఉన్నాయి. స్పీకర్ వాటిని పరిష్కరించిన వెంటనే నాకు వ్యతిరేకంగా వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేయిస్తే స్వాగతిస్తా'అంటూ ఆమె 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు. రెండు పార్టీలకు చెందిన ఈ ఎంపీల మధ్య పార్లమెంట్‌లోనూ తరచూ వాదోపవాదాలు జరుగుతుంటాయి.

మాజీ సీఈసీ గిల్ కన్నుమూత



న్యూఢిల్లీ: మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) మనోహర్‌సింగ్ గిల్(86) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. 1958 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్ అయిన గిల్ 1996 డిసెంబర్ నుంచి 2001 జూన్ వరకు 11వ సీఈసీగా సేవలందించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2008లో కేంద్ర క్రీడల శాఖ మంత్రి వ్యవహరించారు. ప్రకాశ్ సింగ్ బాదల్ పంజాబ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారిగా పనిచేశారు. గిల్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంఎస్ గిల్ మృతిపట్ల కేంద్ర ఎన్నికల సంఘం విచారం వ్యక్తం చేసింది. ఆయన 1998లో 12వ లోక్‌సభకు, 1999లో 13వ లోక్‌సభకు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని కొనియాడింది.

భారత్ వెలుపల అత్యంత ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం

అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఆవిష్కరణ

వాషింగ్టన్: భారత రాజ్యాంగ రూపశిల్పి బీఆర్ అంబేడ్కర్ అత్యంత ఎత్తయిన విగ్రహాన్ని అమెరికా రాజధాని వాషింగ్టన్ శివారులోని మేరీల్యాండ్‌లో ఆవిష్కరించారు. అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించిన అక్టోబర్ 14వ తేదీని పురస్కరించుకుని అదేరోజు అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ ప్రెసిడెంట్ రామ్ 19 అడుగుల ఎత్తైన ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ'గా పిలుచుకునే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి 500 మందికి పైగా భారతీయ అమెరికన్లతోపాటు, భారత్, తదితర దేశాల నుంచి తరలివచ్చారు. 'మేం దీనిని సమానత్వ విగ్రహం అని పిలుస్తున్నాం. అసమానత్వమనే సమస్య భారతదేశంలో మాత్రమే కాదు, ప్రతిచోటా వివిధ రూపాల్లో ఇది ఉనికిలో ఉంది'అని ఈ సందర్భంగా రామ్ కుమార్ అన్నారు. ఈ విగ్రహాన్ని ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్ రూపొందించారు. గుజరాత్‌లో నర్మదా తీరాన ఏర్పాటైన సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'ని రూపొందించింది కూడా ఈయనే. అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్‌కు సరిగ్గా 22 మైళ్ల దూరంలో ఉన్న అకోకీక్ టౌన్‌షిప్‌లోని 13 ఎకరాల విస్తీర్ణంలో అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో బుద్ధా గార్డెన్‌తోపాటు లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్ ఉన్నాయి. ఈ సెంటర్ ఆవరణలోనే అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారు.



మన టెక్నాలజీని అమెరికా కావాలంది

ఇస్రో చీఫ్ ఎస్.సోమనాథ్ వెల్లడి

రామేశ్వరం: చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంతో అమెరికా నిపుణులు సైతం మన అంతరిక్ష టెక్నాలజీని కోరుతున్నారని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చెప్పారు. సంక్లిష్టమైన రాకెట్ మిషన్‌లను అభివృద్ధి చేయడంలో నిమగ్నమైన అమెరికాలో నిపుణులు, చంద్రయాన్–3 మిషన్‌ను చూశాక, భారత్ తమతో అంతరిక్ష సాంకేతికతను పంచుకోవాలని కోరుకుంటున్నారన్నారు. రోజులు మారాయని, అత్యుత్తమైన పరికరాలను, రాకెట్లను నిర్మించగల సత్తా భారత్ సొంతం చేసుకుందని ఆయన చెప్పారు. అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు ద్వారాలు తెరిచారని ఆయన అన్నారు. దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి సోమనాథ్ మాట్లాడారు. 'మనది చాలా శక్తిమంతమైన దేశం. ప్రపంచంలోనే అత్యుత్తమమైన విజ్ఞానం, మేధస్సు కలిగిన దేశాల్లో భారత్ కూడా ఒకటి. చంద్రయాన్–3 వాహకనౌకను మనమే డిజైన్ చేసి, అభివృద్ధి పరిచాం. ప్రయోగం చేపట్టడానికి కొన్ని రోజులు ముందు ఈ మిషన్‌ను తిలకించేందుకు నాసా నిపుణులను ఆహ్వానించాం. వారు ఇస్రో ప్రధాన కార్యాలయానికి రాగా చంద్రయాన్–3 మిషన్ గురించి వివరించాం. వారంతా చాలా బాగుందని మెచ్చుకున్నారు. మనం చాలా తక్కువ ఖర్చుతో పరికరాలు, సామగ్రిని రూపొందించడం చూసి, ఆశ్చర్యపోయారు. తమ దేశానికి ఈ పరిజ్ఞానాన్ని విక్రయించాలని అడిగారు'అని ఆయన వివరించారు. రాకెట్లు, శాటిలైట్ల నిర్మాణంలో పాల్గొని, అంతరిక్ష రంగంలో మన దేశాన్ని మరింత శక్తివంతమైందిగా మార్చాలని కోరుతున్నాను. ఇక్కడున్న కొందరికి ఆ నైపుణ్యం ఉంది. చంద్రుణ్ని చేరుకునే రాకెట్‌ను డిజైన్ చేయగలరు'అని ఆయన పిలుపునిచ్చారు. 'భారత మహిళా వ్యోమగామి చంద్రయాన్–10 మిషన్‌లో చంద్రుడిపై అడుగుపెడుతుంది. ఆ మిషన్‌లో మీలో ఒకరు, ముఖ్యంగా ఓ బాలిక సైతం ఉండి ఉండొచ్చు'అని ఆయన అన్నారు.

జంగ్ తెలంగాణ



1978లోనూ ఇందిరాకే జై

ఇక్కడా ఇందిరా ప్రభంజనమే

1972 శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో రికార్డు స్థాయిలో కాంగ్రెస్ పార్టీ 219 స్థానాలు గెలుచుకుంది. ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రభంజనం ఆ స్థాయిలో వీచింది. సీపీఐకి ఏడు సీట్లు మాత్రమే వచ్చాయి. ఈసారి కూడా ఇండిపెండెంట్లు 57 మంది గెలిచారు. స్వతంత్ర పార్టీకి రెండు, సీపీఎంకు ఒకటి, ఎస్‌టీపీఎస్ (సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి) కు ఒక సీటు వచ్చాయి. ఇదే తరహాలో తెలంగాణలో కూడా ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి మొత్తం 101 స్థానాలకు గానూ 78 స్థానాలు దక్కాయి. సీపీఐ మూడు, సీపీఎం ఒకటి, ఎస్‌టీపీఎస్ ఒకటి గెలుచుకున్నాయి. ఇండిపెండెంట్లు 18 మంది నెగ్గారు.

1978 శాసనసభ ఎన్నికల్లో సైతం ఇందిరాగాంధీ నాయకత్వానికే ఉమ్మడి ఏపీ జై కొట్టింది. 1977లో ఆమె లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయినా, పార్టీ చీలినా, ఏపీ ప్రజలు మాత్రం ఆమె కొత్తగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ (ఐ) కే అధికారం కట్టబెట్టారు. ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్(ఐ)కి 175, జనతాపార్టీకి 60, కాంగ్రెస్ (ఆర్)కు 30, సీపీఎంకి 8, సీపీఐకి ఆరు స్థానాలు దక్కగా, ఇండిపెండెంట్లు పదిహేను మంది గెలిచారు. ఈ ఎన్నికల నుంచి ఇండిపెండెంట్ల ప్రభావం తగ్గి పార్టీల ఆధిపత్యం పెరిగింది. తెలంగాణలో కాంగ్రెస్(ఐ)కి 65, జనతాకు 15, కాంగ్రెస్ ఆర్‌కు 12, సీపీఎంకు ఐదు, సీపీఐకి మూడు సీట్లు దక్కగా, ఇండిపెండెంట్లు ఏడుగురు గెలిచారు.

మీకు తెలుసా?



1983లో ఎన్టీఆర్ శకం..

తెలంగాణలో మాత్రం ఒకింత తక్కువే

1983 శాసనసభ ఎన్నికలలో ఉమ్మడి ఏపీలో ప్రముఖ నటుడు ఎన్.టి.రామారావు కొత్తగా స్థాపించిన తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. టీడీపీకి 201 సీట్లు రాగా, కాంగ్రెస్‌కి 60 సీట్లు వచ్చాయి. సీపీఎంకు ఐదు, సీపీఐకి నాలుగు, బీజేపీకి మూడు, జనతా పార్టీకి ఒకటి, ఐసీజేకి ఒకటి చొప్పున సీట్లు రాగా, ఇండిపెండెంట్లు 19 మంది గెలిచారు. ఆంధ్ర, రాయలసీమల్లో టీడీపీకి 158 స్థానాలు రాగా, తెలంగాణలో 43 వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి ఆంధ్ర,రాయలసీమలలో కలిపి కేవలం 17 సీట్లే రాగా, తెలంగాణలో టీడీపీతో సమానంగా 43 రావడం విశేషం. మిగిలిన ప్రాంతం అంతా ఎన్టీఆర్ ప్రభంజనం వీయగా, తెలంగాణలో మాత్రం ఆ స్థాయిలో కనిపించకపోవడం విశేషం. తెలంగాణలో సీపీఎంకి ఐదు, సీపీఐకి నాలుగు, జనతా పార్టీకి ఒకటి, బీజేపీ రెండు సీట్లు రాగా, తొమ్మిది మంది ఇండిపెండెంట్లు నెగ్గారు.

ఓట్ దిస్ పాయింట్

బీఎల్‌ఓ అంటే ఎవరు? విధులు ఏమిటి?

- ఓటర్ల జాబితాల రూపకల్పనలో ఎన్నికల సంఘానికి సహకరించే స్థానిక ప్రభుత్వ/తాత్కాలిక ప్రభుత్వ ఉద్యోగులను బూత్ స్థాయి అధికారి(బీఎల్‌ఓ) అంటారు. వీరు సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధిలో నివాసంతో పాటు ఓటు హక్కును కలిగి ఉండి స్థానిక ప్రజలతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు. ఓటర్ల నమోదు, వివరాల దిద్దుబాటుతో పాటు చనిపోయిన/వలస పోయిన ఓటర్ల తొలగింపు కోసం స్థానిక ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించడంలో ఎన్నికల యంత్రాంగానికి సహకరిస్తారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 13బీ(2) కింద అంగన్‌వాడీ వర్కర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, కరెంట్ బిల్ రీడర్లు, పోస్ట్‌మెన్, ఆశవర్కర్లు వంటి వారిని బీఎల్‌ఓగా నియమిస్తారు.

ఈఆర్వో, ఏఈఆర్వో అంటే ఎవరు ? వారి విధులు ఏమిటి?

- ఓటరు జాబితాల రూపకల్పనకు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో)ని నియమిస్తారు. ఆయన కింద ఒకరు లేదా ఎక్కువ మంది సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్వో)గా పనిచేస్తారు. ఏఈఆర్వోలకు ఈఆర్వోలతో సమాన అధికారాలుంటాయి కానీ నియోజకవర్గంలోని కొంత భాగాన్ని మాత్రమే వారికి కేటాయిస్తారు. బీఎల్‌ఓలను సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితాలను రూపొందించాల్సిన బాధ్యత వీరిదే. ఓటర్ల నమోదుకు వచ్చే దరఖాస్తులు/అభ్యంతరాలను వీరే పరిశీలించి ఆమోదించడం/తిరస్కరించడం చేస్తారు.

గాసిప్ టైమ్



'వెన్నెల మాటున చీకట్లు'

మిలిటరీ ప్రాంతం ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లోని ఓ నియోజకవర్గంలో అనూహ్య సమీకరణలు రెండు ప్రధాన పార్టీల ఆశావహులకు నిరాశ మిగిల్చేలా ఉన్నాయని అంటున్నారు. అక్కడ పోటీలో ఉండే బలమైన నేత మృతి చెందడంతో ఆయన కుమార్తెకు అధికార బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చింది. దీంతో తనకే టికెట్ ఖాయమని ఇన్నాళ్లు భావించిన ఓ యువ నాయకుడు డీలా పడ్డారట. ఇక, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలో కూడా చాలామంది టికెట్ ఆశించారు. కానీ, అనూహ్యంగా ఓ ప్రజాగాయకుడి కూతురికి టికెట్ ఇవ్వాలని అధిష్టానం నిర్ణయం తీసుకుందన్న వార్తల నేపథ్యంలో ఆశావహుల్లో 'వెన్నెల మాటున చీకట్లు'నెలకొన్నాయనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

మాటలు జాగ్రత్త!

భిన్న కుల, మత, భాషల ప్రజల మధ్య విద్వేషాలు పెంచొద్దు

- కుల, మతాల పేరుతో ఓట్లు అడగవద్దు
- ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రచారానికి నో...
- ప్రత్యర్థులపై వ్యక్తిగత విమర్శలకు తావు లేదు
- విధానాలు, గత రికార్డు, చేసిన పనులకే విమర్శలు పరిమితం కావాలి
- ఎన్నికల ప్రవర్తన నియమావళి స్పష్టీకరణ
- కోడ్ సంకలనాన్ని విడుదల చేసిన సీఈఓ కార్యాలయం

ముహమ్మద్ ఫసియొద్దీన్

కుల మతాల పేరుతో ఓట్లను అభ్యర్థించవచ్చా? గుడులు, మసీదులు, చర్చీలు, గురుద్వారాలు వంటి ప్రార్థన స్థలాల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించవచ్చా?

ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం... 'లేదు'. ఎవరైనా అలా చేస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినట్టే. మీ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ సజావుగా అమలు అవుతోందా? పార్టీలు, అభ్యర్థులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ప్రవర్తన, చర్యలు.. నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయా? అనే అంశాలను ప్రజలు కూడా పరిశీలించవచ్చు. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘిస్తే స్థానిక ఎన్నికల పరిశీలకులను కలిసి లేదా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు లేదా 'సీ–విజిల్' యాప్ ద్వారా ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటోలు/వీడియోలు తీసి నేరుగా ఎన్నికల సంఘానికి పంపొచ్చు. వివిధ సందర్భాల్లో కేంద్ర ఎన్నికల సంఘంజారీ చేసిన నిబంధనల సంకలనాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయం తాజాగా విడుదల చేసింది. అందులోని ముఖ్యాంశాలు..



సభలకు ముందస్తు అనుమతి

- శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవడానికి వీలుగా ప్రతిపాదిత సభ సమయం, వేదికను ముందస్తుగా స్థానిక పోలీసు యంత్రాంగానికి తెలియజేయాలి.
- సభ వేదిక ఉన్న ప్రాంతంలో ఏవైనా నిషేధాజ్ఞలు అమల్లో ఉంటే వాటిని కచ్చితంగా పాటించాలి. అవసరమైతే ముందుగా దరఖాస్తు చేసుకుని సడలింపులు పొందాలి.
- సభలో లౌడ్ స్పీకర్, ఇతర సదుపాయాలను వినియోగించడానికి ముందస్తుగా సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందాలి.

విద్వేషాలు రెచ్చగొట్టరాదు...

- భిన్న కుల, మత, భాష, వర్గాల ప్రజల మధ్య విభేదాలను పెంపొందించే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.
- ప్రత్యర్థి పార్టీలపై చేసే విమర్శలు కేవలం ఆ పార్టీ విధానాలు, కార్యక్రమాలు, గత చరిత్ర, చేసిన పనులకు పరిమితమై ఉండాలి. వ్యక్తిగత విమర్శలు చేయకూడదు. ధ్రువీకరణ జరగని ఆరోపణలు, వక్రీకరణల ఆధారంగా విమర్శలు చేయరాదు.
- ఎన్నికల చట్టాల్లో నేరపూరిత చర్యలుగా పేర్కొన్న కార్యకలాపాలకు అన్ని పార్టీలు, అభ్యర్థులు దూరంగా ఉండాలి. ప్రధానంగా ఓటర్లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేయడం, ఓటర్ల స్థానంలో ఇతరులతో ఓటేయించడం, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించడం, పోలింగ్‌కు 48 గంటల ముందు సభలు, సమావేశాలు జరపడం, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడానికి రవాణా సదుపాయం కల్పించడం వంటివి చేయరాదు.
- ఇంట్లో ప్రశాంతంగా బతికేందుకు ప్రతి పౌరుడి హక్కును గౌరవించాలి. వ్యక్తుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా వారి ఇళ్ల ముందు ఏ పరిస్థితుల్లోనూ నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు చేపట్టరాదు.
- యజమానుల సమ్మతి లేకుండా వారి స్థలాలు, భవనాలు, ప్రహరీ గోడలను జెండాలు, బ్యానర్లు, పోస్టర్ల కోసం వినియోగించరాదు. గోడలపై ఎలాంటి రాతలు రాయకూడదు.
- ఇతర పార్టీల సమావేశాలు, ఊరేగింపులకు తమ మద్దతుదారులు భంగం చేయకుండా చూసుకోవాలి.
- ఏదైనా ఓ పార్టీ కార్యకర్తలు వేరే పార్టీల సమావేశం జరుగుతున్న ప్రాంతం మీదుగా ఊరేగింపులు నిర్వహించకూడదు. ఒక పార్టీ అతికించిన పోస్టర్లను మరో పార్టీ కార్యకర్తలు తొలగించకూడదు.



ఊరేగింపులు...

- ఊరేగింపుల రూట్ మ్యాప్‌ను నిర్వాహకులు ముందుగా స్థానిక పోలీసులకు తెలియజేయాలి.
- ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఊరేగింపులు చేసుకోవాలి. భారీ ర్యాలీ అయితే తగిన నిడివికి తగ్గించుకోవాలి.
- ఇద్దరు లేదా అంతకుమించిఅభ్యర్థులు/పార్టీలు ఏక కాలంలో ఒకే రూట్‌లో ఊరేగింపు నిర్వహించే సమయంలో నిర్వాహకులు ముందుగా సంప్రదింపులు జరిపి ఘర్షణ జరగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలి.
- ఊరేగింపులో తీసుకెళ్లే వస్తువుల విషయంలో పార్టీలు, అభ్యర్థులు నియంత్రణ పాటించాలి. ఆ వస్తువులు అసాంఘిక శక్తుల చేతిలో దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇతర పార్టీల నేతల దిష్టి బొమ్మలను ఊరేగించడం, వాటిని బహిరంగంగా దహనం చేయడం వంటివి చేయరాదు.

పోలింగ్ బూత్‌ల వద్ద..

- ఓటర్లు మినహా పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు ఎవరికీ అనుమతి ఉండదు. కేంద్ర ఎన్నికల సంఘం పాస్ కలిగిన వారికి మినహాయింపు.
- పరిశీలకులను ఎన్నికల సంఘం నియమిస్తుంది. ఎన్నికల నిర్వహణ విషయంలో పార్టీలు, అభ్యర్థులకు ఫిర్యాదులుంటే వాటిని పరిశీలకుల దృష్టికి తేవాలి.

స్వేచ్ఛగా ఓటు వేసేలా..

- అభ్యర్థులు/పార్టీలు ఎలాంటి ఆటంకాలు, బెదిరింపులకు తావు లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా ఎన్నికల అధికారులకు సహకరించాలి.
- తమ అనధికార కార్యకర్తలకు గుర్తింపు కార్డులు, బ్యాడ్జీలను ఇవ్వాలి.
- ఓటర్లకు పంపిణీ చేసే చిట్టీలపై గుర్తులు, పార్టీల పేర్లు ఉండరాదు.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి మద్యం సరఫరా జరపరాదు.
- పోలింగ్‌బూత్‌ల వద్ద పార్టీలు, అభ్యర్థులు ఏర్పాటు చేసే క్యాంపుల వద్ద ప్రజలను గుమికూడనీయొద్దు.
- అభ్యర్థుల క్యాంపుల వద్ద పోస్టర్లు, జెండాలు, గుర్తులు, ఇతర ప్రచార సామగ్రిని ప్రదర్శించరాదు. ఆహార పదార్థాలను సరఫరా చేయరాదు.
- పోలింగ్ రోజు వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలుంటాయి. పర్మిట్లు పొంది వాటికి స్టిక్కర్ బాగా కనిపించేలా వాహనంపై అతికించాలి.






ఈ కొండ గట్టెక్కిస్తుందని..

కొండగట్టులో కేసీఆర్ పూజలు, సంజయ్ ముడుపు

19న ముడుపు కట్టేందుకు రాహుల్‌గాంధీ వచ్చే అవకాశం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ముడుపు కట్టి మొక్కడం తెలుగు ప్రజల సంప్రదాయం. అందులోనూ ఏదైనా మంచిపని చేసేముందు.. కొత్త వాహనం కొన్న తర్వాత పూజలు చేయించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం జగిత్యాల) కొండగట్టు ఎంతో ప్రసిద్ధి చెందింది. 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాచీన ఆలయానికి తెలుగువారే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వస్తారు. ముఖ్యంగా తెలుగు రాజకీయ నేతలు ఇక్కడ పూజలు నిర్వహించి ముడుపులు కట్టి మొక్కులు చెల్లించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసిన సమయంలోనూ సీఎం కేసీఆర్ ఇక్కడ పూజలు చేయడం గమనార్హం. ప్రత్యేక రాష్ట్రం సిద్ధిస్తే.. కొండగట్టుకు వచ్చి మొక్కు తీరుస్తానని ఆయన ఉద్యమ సమయంలో అంజన్నకు మొక్కుకున్నారు. ఇటీవల జగిత్యాల పర్యటన సందర్భంగా అంజన్నకు తన మొక్కు చెల్లించుకున్నారు.

- కొండగట్టు అంటే సీఎం కేసీఆర్‌కు మొదటి నుంచి ప్రత్యేకమైన అభిమానం. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచే ఇక్కడికి కుటుంబంతో వచ్చేవారు.
- ఎమ్మెల్సీ కవిత కూడా బాల్యం నుంచే కొండగట్టుకు వచ్చేవారు. ఎంపీ అయిన తర్వాత కూడా పలుమార్లు ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.
- 2019లో ఎంపీగా గెలవకముందు సంజయ్ కూడా అంజన్నకు ముడుపు కట్టారు. ఆ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్య విజయాన్ని సాధించిన సంజయ్, కొండగట్టులో మొక్కు చెల్లించుకున్నారు.
- ఈనెల 19న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కరీంనగర్ మీదుగా బోధన్ వెళ్లే దారిలో కొండగట్టును దర్శించుకోనున్నారు. రాష్ట్రంలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు వాయుపుత్రుని దీవెనలు ఉండాలని కాంగ్రెస నేతలు భావిస్తున్నారు. వాస్తవానికి కొండగట్టు పూజలు షెడ్యూలులో లేనప్పటికీ, రాహుల్‌గాంధీని కొండగట్టు వద్ద ఆపి, పూజలు చేయించేలా ప్రణాళిక రచిస్తున్నారు. అక్కడే కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలకు పూజలు కూడా చేయించనున్నారు.



పొలిటికల్ లైన్

ఢిల్లీ లీడర్స్ రాకతో.. కేడర్‌లో జోష్

కె.రాహుల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనసంఘ్ (బీజేపీగా ఏర్పడడానికి ముందు) తరఫున ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గెలుస్తూ వచ్చారు. 1982కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా తీరు, రాజకీయాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్న సందర్భంలో బీజేపీ సొంతంగా రాష్ట్రంలో ఓ రాజకీయశక్తిగా ఎదిగేందుకు సానుకూల పరిస్థితులున్నట్టు పార్టీ నేతలు అంచనా వేశారు. అయితే టీడీపీ ఆవిర్భావం, ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించడం వంటి పరిణామాలు, టీడీపీతో పొత్తు, 1995లో ఎన్టీఆర్‌ను పదవీచ్యుతుడిని చేసి చంద్రబాబు సీఎం అయ్యాక, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో వచ్చిన మార్పుచేర్పులు, టీడీపీతో పొత్తుల కొనసాగింపు వంటివి రాష్ట్రంలో బీజేపీకి నష్టం చేశాయని చెప్పొచ్చు. తర్వాత 1998 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో ఉమ్మడి ఏపీలో బీజేపీ ఒంటరిగా పోటీచేసి 4 ఎంపీ సీట్లు గెలుపొంది సత్తా చాటింది. అయితే ఆ వెంటనే 1999లో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో పొత్తు కుదుర్చుకోక తప్పలేదు. ఆ పరిస్థితి తెలంగాణ ఏర్పడే దాకా కొనసాగడం రాజకీయంగా బీజేపీకి తీరని నష్టం చేసిందని ఆ పార్టీ అగ్రనేతలే చెబుతుండడం గమనార్హం.

ఉమ్మడి ఏపీలో..1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో టీడీపీతో పొత్తుతో పోటీచేసి బీజేపీ 12 అసెంబ్లీ స్థానాలు గెలిచింది. ఉమ్మడి ఏపీ, ఆ తర్వాత తెలంగాణలో అవే కమలదళం గెలిచిన అత్యధిక సీట్లు. అయితే తెలంగాణ ఏర్పడ్డాక 2014లో తొలిసారి ఐదు సీట్లు సాధించినా, 2018లో రెండోసారి జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు లేకుండా సొంతంగా పోటీ చేసినప్పుడు కేవలం 8 శాతం ఓట్లతో ఒక్క స్థానానికే పరిమితమైంది. కానీ అనూహ్యంగా 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగానే 4 సీట్లు గెలుచుకోవడంతో పాటు ఓటింగ్ శాతాన్ని ఒక్కసారిగా 20 శాతానికి పెంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో నువ్వా నేనా అన్నట్టుగా జరిగిన పోటీలో విజయం సాధించడం, ఈ రెండు ఉప ఎన్నికల మధ్య జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకంగా 48 సీట్లు (దీనికి ముందు 4 సీట్లే) గెలుపొందడంతో ఒక్కసారిగా బీజేపీపై అంచనాలు పెరిగిపోయాయి.ఈ పరిస్థితుల్లో జరిగిన మునుగోడు ఉపఎన్నికలో రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని పార్టీ వర్గాలు అంచనా వేసినా, 12 వేల ఓట్ల తేడాతో బీఆర్ఎస్‌చేతిలో ఆయన ఓటమి చవిచూశారు. అయితే అంతకు ముందు అంటే 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి పడిన 13 వేల ఓట్లు 90 వేల ఓట్లకు పెరగడం బీజేపీకి కొంత ఊరటనిచ్చింది. ఈ విధంగా ఈ అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మూడో స్థానానికే పరిమితం చేయడం విశేషం. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన కుందూరు జానారెడ్డి రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో ముచ్చటగా మూడోసారి జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భవితవ్యం ఎలా ఉంటుందో చూడాలి.

12 సీట్ల నుంచి ఒక్క సీటుకు..

1999లో అత్యధికంగా 12 సీట్లలో విజయం

- 2018లో ఒక్క సీటుకే పరిమితమైన బీజేపీ
- వచ్చే ఎన్నికల్లో విజయంపై పార్టీ నేతల్లో ఆశలు
- ప్రచారానికి తరలిరానున్న అగ్రనేతలు

బీజేపీ విజయం ఇలా..

1980లో పార్టీ ఏర్పడ్డాక ఉమ్మడి ఏపీలో, ఆ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన ఎమ్మెల్యే సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

2018లో కేవలం ఒకేఒక్క సీటు టి.రాజాసింగ్ గెలుపొందగా..అంతకుముందు వరుసగా మూడుసార్లు గెలిచిన జి.కిషన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఆ తర్వాత జరిగిన రెండు ఉప ఎన్నికల్లో దుబ్బాక నుంచి ఎం.రఘునందన్‌రావు, హుజూరాబాద్ నుంచి ఈటల రాజేందర్ గెలుపొందారు. 1983 నుంచి వరుసగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బలం పెరుగుతూ... తగ్గుతూ వచ్చింది.

మూడు వేర్వేరు గుర్తులపై జంగారెడ్డి విజయదుందుభి

1967లో భారతీయ జన సంఘ్ (బీజేఎస్) దీపం గుర్తుపై ఉమ్మడి ఏపీలో మూడుసీట్లు గెలవగా అందులో ఒక స్థానంలో తెలంగాణ నుంచి చందుపట్ల జంగారెడ్డి గెలుపొందారు. ఎమర్జెన్సీ తర్వాత ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో జాతీయ స్థాయిలో ఇందిరతో విభేదించి బయటకు వచ్చిన లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో బీజేఎస్, ఇతర పార్టీలు కలిపి జనతా పార్టీ ఏర్పడింది. 1978లో ఉమ్మడి ఏపీలో జనతా పార్టీ నాగలిపట్టిన రైతు గుర్తుపై 60 మంది గెలుపొందగా, వారి లో తెలంగాణ నుంచి జంగారెడ్డి ఉన్నారు. ఇక 1980లో బీజేపీ ఏర్పడ్డాక ఇందిరాహత్యానంతరం జరిగిన 1984 లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో దేశవ్యాప్తంగా వీచిన కాంగ్రెస్ ప్రభంజనాన్ని తట్టుకుని ఏపీలో టీడీపీ 30 సీట్లు గెలిచింది. ఆ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బీజేపీ రెండే రెండు సీట్లు గెలవగా అందులో ఒకటి హన్మకొండ. ఇక్కడ కమలం గుర్తుపై పోటీ చేసిన జంగారెడ్డి నాటి కేంద్రమంత్రి పీవీ నరసింహారావును ఓడించి చరిత్ర సృష్టించారు.








బండి సంజయ్ మార్పుతో..

రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ ఏడాది మార్చిలో మూడేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న బండి సంజయ్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసే దాకా పదవిలో కొనసాగుతారని అంతా భావించారు. కానీ కొన్నాళ్లకే సంజయ్‌ను మారుస్తున్నారంటూ ప్రచారం మొదలై రెండు, మూడు నెలలు కొనసాగింది. ఆ ప్రచారాన్ని నిజం చేస్తూ కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డిని నాలుగోసారి (ఉమ్మడి ఏపీలో రెండు సార్లు, ఈ విడత కలుసుకుని తెలంగాణలో రెండోసారి) రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. దీంతో కేడర్‌లో స్తబ్దత, కొంత అయోమయ వాతావరణం ఏర్పడింది.

మోదీ సభలతో నయా జోష్

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోగానే ప్రధాని మోదీ ఈ నెల 1న మహబూబ్‌నగర్, 3న నిజామాబాద్‌లలో జరిపిన పర్యటన పార్టీలో కొత్త ఉత్సాం నింపిందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు తొమ్మిదేళ్లలో బీజేపీ చేసిన అభివృద్ధిని ప్రధాని వివరించడం ప్రజల్లో సానుకూలత పెరగడానికి దోహదపడిందని అంటు న్నారు. ఇక షెడ్యూల్ వెలువడిన మరుసటి రోజే బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆదిలాబాద్‌లో జనగర్జన సభ నిర్వహించారు. ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడాల్సి ఉండగా, ఎన్నికల ప్రచార గడువు ముగిసే నాటికి పది ఉమ్మడి జిల్లాల పరిధిలో మూడేసి చొప్పున మోదీ, అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాల బహిరంగ సభలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఈ సభల విజయవంతం, వీటిలో ప్రస్తావించే అంశాలు, ఇచ్చే హామీలు పార్టీకి మరింత మేలు చేస్తాయని బీజేపీ నేతలు ఆశిస్తున్నారు.




సాక్షి

పసుపు.. చక్కెర

ఉమ్మడి నిజామాబాద్‌లో ఈ రెండే ప్రధానాంశాలు

తుమాటి భద్రారెడ్డి

రైతు ఉద్యమాల వేదికగా పేరున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అధికార బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు శాసనసభ ఎన్నికలకు సకల అస్త్రాలతో సన్నద్ధమవుతున్నాయి. ఈ ఉమ్మడి జిల్లాలో మొత్తం 9 శాసనసభ స్థానాలు ఉండగా 2014లో బీఆర్‌ఎస్ క్లీన్ స్వీప్ చేసింది. 2018లో ఎల్లారెడ్డి మినహా మిగిలిన 8 సీట్లు గెలిచింది. అయితే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ బీఆర్‌ఎస్‌లోకి ఫిరాయించారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం పసుపు బోర్డు హామీతో బరిలోకి దిగిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రైతుల ఆసరాతో అనూహ్యంగా కేసీఆర్ కుమార్తె కవితపై విజయం సాధించారు. ఇక ఇప్పుడు నిజాం షుగర్స్ అంశం ప్రధాన ఎజెండాగా రైతుల ఓట్లు మరోసారి కొల్లగొట్టే లక్ష్యంతో బీజేపీ ప్రణాళిక రూపొందించుకుంటోంది. కాంగ్రెస్ సైతం నిజాం షుగర్స్, మంచిప్ప రిజర్వాయర్ ముంపు, పోడు భూముల అంశం, ధరణి సమస్యలు, ఆరు హామీలతో ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. అలాగే దళితబంధులో కమీషన్ల వసూళ్లు, డబుల్ ఇళ్ల నిర్మాణంలో విఫలం, కామారెడ్డి జిల్లాలో సాగునీటి సమస్య తదితరాలపైనా ప్రచారం చేస్తోంది. ఇక సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని, పైగా ఉమ్మడి జిల్లాలోని కామారెడ్డిలో సీఎం కేసీఆర్ బరిలోకి దిగుతుండడంతో ఆ ప్రభావం చుట్టుపక్కల నియోజకవర్గాలపై ప్రభావం చూపుతుందని బీఆర్‌ఎస్ అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. ప్రస్తుతానికి మూడు పార్టీల మధ్య త్రిముఖ పోరు ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రకటన తర్వాత సమీకరణాలు మారనున్నాయి. - సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



ఎల్లారెడ్డి.. ఏలేదెవరో?

గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన జాజాల సురేందర్ బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. కేసీఆర్ పక్క నియోజకవర్గంలో పోటీ చేస్తుండడంతో గెలుపుపై ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్, సుభాష్‌రెడ్డి మధ్య టికెట్ పోటీ ఉంది. ఇక్కడ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్య ద్విముఖ పోటీ నడుస్తోంది.

జుక్కల్ ఎవరిపరం?

సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే మూడోసారి గెలుస్తాననే ధీమాతో ఉన్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతార, బుచ్చన్న టికెట్ రేసులో ఉన్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం, గడుగు గంగాధర్ మధ్య పోటీ నెలకొనగా మరో ఎన్‌ఆర్‌ఐకి టికెట్ ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

బాల్కొండ బరిలో ముక్కోణపు పోటీ

వరుసగా రెండుసార్లు గెలుపొందిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి తాను చేసిన అభివృద్ధి గెలిపిస్తుందని ధీమాగా ఉన్నారు. అయితే ఇక్కడ కాంగ్రెస్ నుంచి ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డికి టికెట్ వచ్చింది. ఈయనకు గత ఎన్నికల్లో బీఎస్పీ తరఫున 42వేల ఓట్లు దక్కడం గమనార్హం. ఇక బీజేపీ తరఫున ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి బదులు మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మను బరిలోకి దించేందుకు బీజేపీ ప్లాన్ చేస్తోంది. దీంతో త్రిముఖ పోటీ తప్పని పరిస్థితి.

బోధన్ బాస్ ఎవరో?..

మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి గెలిచేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ టికెట్ ఆశిస్తున్న మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డి ఎవరి ప్రచారం వారు చేస్తున్నారు. కాంగ్రెస్ తరఫున మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డికే టికెట్ ఇచ్చారు. షకీల్‌ను ఓడించాలనే లక్ష్యంతో శరత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటుండడం గమనార్హం.

ఆర్మూర్ ఆషామాషీ కాదు

ఇప్పటికే రెండుసార్లు గెలవడంతో ఈసారి గెలిస్తే మంత్రి పదవి వస్తుందని బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారు. అయితే జీవన్‌రెడ్డి వ్యవహార శైలిపై బీఆర్‌ఎస్ స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర అసంతృప్తితో ఉండడంతో గడ్డు పరిస్థితి తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి పొద్దుటూరి వినయ్‌రెడ్డికి టికెట్ ఖరారు అయ్యింది. బీజేపీ నుంచి పైడి రాకేశ్‌రెడ్డి బరిలో ఉన్నట్లు చెబుతున్నప్పటికీ పార్టీ ఆదేశిస్తే చివరి నిమిషంలో ఎంపీ అర్వింద్ బరిలో ఉండే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అర్వింద్ బరిలో ఉంటే గెలుపు సులువని పార్టీ శ్రేణులు, వివిధ వర్గాలు భావిస్తున్నాయి.

నిజామాబాద్‌లో నిలిచేది ఎవరు?

ముచ్చటగా మూడోసారి గెలిచేందుకు బిగాల గణేశ్‌గుప్తా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బలంగా ఉన్నాయి. బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ టికెట్ కోసం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఢిల్లీ స్థాయిలో గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడి పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను బట్టి పోటీ రసవత్తరంగా మారనున్నట్లు తెలుస్తోంది.

నిజామాబాద్ రూరల్‌లో సీన్ మారుతుందా?

వరుసగా మూడోసారి, మొత్తంగా ఐదోసారి గెలిచి కేబినెట్‌లో స్థానం సంపాదించేందుకు బాజిరెడ్డి గోవర్ధన్ లెక్కలు వేసుకుంటున్నారు. బీజేపీ నుంచి కులాచారి దినేష్‌కు టికెట్ దక్కనుందనే ప్రచారం నడుస్తోంది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, నగేష్‌రెడ్డి టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. మంచిప్ప జలాశయం ముంపు అంశం, ధరణి, పోడు భూముల అంశాలు కాంగ్రెస్ ప్రధాన ప్రచార అస్త్రాలుగా వాడుతోంది.

కామారెడ్డిలో కింగ్‌కి పోటీ ఇచ్చేనా?

బీఆర్‌ఎస్ నుంచి సీఎం కేసీఆర్ బరిలోకి దిగుతున్నప్పటికీ కాంగ్రెస్ నుంచి షబ్బీర్‌అలీ, బీజేపీ నుంచి వెంకటరమణారెడ్డి పోటీలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. షబ్బీర్ అలీ గతంలో తాను చేసిన అభివృద్ధి గురించి చెబుతున్నారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్, అక్రమ వెంచర్లు, ధరణి అక్రమాలు, పావలా వడ్డీ బకాయిల ఉద్యమాల్లో పాల్గొన్న వెంకటరమణారెడ్డి గెలుస్తాననే ధీమాతో ఉన్నారు.

బాన్సువాడ బరిలో గెలుపెవరిది?

రాష్ట్రంలోనే అత్యధికంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి గెలుపుపై ధీమాగా ఉన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయనే నమ్మకంతో బరిలో మరోమారు దిగుతున్నారు. కాంగ్రెస్ నుంచి మదన్‌మోహన్ నిలబడితే గెలుపు అవకాశాలుంటాయనే చర్చ నడుస్తోంది. బీజేపీ నుంచి మాల్యాద్రిరెడ్డి టికెట్ రేసులో ఉన్నారు.

'ఒంటె సిద్ధాంతా'నికి విరుగుడు.. 'గుర్రం' స్టెప్పు!

కాస్త ఊపిరాడేలా, కొద్దిగా గాలీ-వెలుతురూ వచ్చేలా..కూసంత ''సౌకర్యంగా'' ఉండే ఓ గుడారాన్ని అడుగుతాడు ఓటరు. ఈ 'సౌకర్యం' అనే మాట ఏలినవారికి 'విశాలం' అనేలా ధ్వనిస్తుంది. 'కోర్కెలు అనంతాలూ..వనరులు పరిమితాలు' అనే ఎకనమిక్స్ సిద్ధాంతం ఇటు ఓటరుకూ, అటు పాలించేవారికీ అడ్డుపడుతుంది.



గుడారం సైజు పెంచలేం. కాబట్టి దాంట్లోకి ఒంటెను వదలమంటారు ప్రభువులవారు. ఒక్కసారిగా కాదు. మెల్లమెల్లగా. మొదట తల, మెడ, తర్వాత సగం వరకు..అటు పిమ్మట మొత్తం ఒంటె దేహాన్ని. ఆ పైన ఒంటెను కొద్దిగా బయటకు తెచ్చినా..ఆ చర్య ఇచ్చే కాస్తంత వెసులుబాటూ ఎంతో గొప్పగా, మరెంతో 'విశాలం'గా, ఇంకెంతో 'సౌకర్యంగా' అనిపిస్తుంటుంది. ఇదీ ఒంటె సిద్ధాంతం.

ఈ సిద్ధాంతం అన్నది ఆల్వేస్ బ్రహ్మాండంగా వర్కవుట్ అవుతుందని కనిపెట్టినవారు రాజకీయవేత్తలే. అందుకే 'సైంటిస్టు'ల సంక్లిష్ట సూత్రాల కన్నా..మన పొలిటికల్ లీడర్ల ప్రాక్టికల్ సిద్ధాంతాలే మిన్న.

ఈ సిద్ధాంతం అమల్లో కేంద్రంలోని పాలకులు ఇంకా గ్రేట్. వారు ఒకటీ, అరా కాకుండా ఏకంగా రెండుమూడు ఒంటెల్ని గుడారంలోకి ఒకేసారి ప్రవేశపెడతారు. వాటితో చాలాసేపు సహజీవనం చేయిస్తారు. ఆ తర్వాత ఒక్క ఒంటెను కాస్తంత బయటకు తెచ్చినా చాలు..అదే పదివేలు అనేలా సర్దుకుపోతాడు ఓటరు.

కేంద్రంలోని పాలకులు ఈ ఒంటె సిద్ధాంతాన్ని అనేక విషయాల్లో అమలు చేస్తున్నారూ.. చేస్తుంటారు. అన్నీ చెప్పుకోవడం కుదరదు కదా. మచ్చుకు గ్యాస్ సిలిండరును ఉదాహరణగా తీసుకుందాం. దాదాపు రూ.400 దగ్గరున్న సిలెండరు చకచకా రూ.1200 వరకు వెళ్తుంది. కానీ ఎన్నికలప్పుడు కేవలం రూ.200 మాత్రమే తగ్గుతానంటుంది.

ఘనత వహించిన బీఆర్‌ఎస్‌వారు ఒంటె సిద్ధాంతానికి బ్రహ్మాండమైన ఓ విరుగుడు కనిపెట్టారు. వారి వాగ్దానం ప్రకారం... సిలిండర్ ధరను ఒకేసారి పదేళ్ల కిందటి ధరకు నెడతామంటున్నారు. దాంతో జేబుగలిగిన ప్రతి మారాజుకూ, కిచెన్ గలిగిన ప్రతి మహారాణికీ ఒక్కసారిగా ఎంతో భారం తొలగుతుందీ. మరెంతో భాగ్యం కలుగుతుంది.

టైమ్-మెషీన్‌లో ఒకేసారి పదేళ్ల వెనక్కు వెళ్లడమంటే మాటలా! ప్రజలందరికీ మూకుమ్మడిగా పదేళ్ల కిందినాటి వయసూ, యౌవనమూ, పదేళ్ల కిందటి విగరూ, పొగరూ పునర్-ప్రాప్తించిన ఫీలింగ్ కలగదా? విగరూ, పొగరూ పాలితులకూ!... 'పవరు'పాలకులకు!!

చదరంగంలో 'గుర్రం' స్టెప్పు ఒకటుంటుంది. దాన్ని ప్రయోగిస్తే..ఏకకాలంలో అది రెండు 'ఫోర్సు'లకు ఎసరు పెడుతుంది. ఇక్కడ సిద్ధాంతపు 'ఒంటె' సిద్ధాంతాన్ని దెబ్బకొట్టడానికి 'గుర్రం' స్టెప్పు వేశారు..వ్యూహాల్లో దిట్ట అయిన కేసీఆర్‌వారు.

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు.

ఒక పిట్ట..కేంద్రంలో గ్యాస్ సిలిండరు ధరను మూడు రెట్లు పెంచేసిన పార్టీ!

మరో పిట్ట..పొరుగు రాష్ట్రంలోలా ఇక్కడా మహిళా సోదరీమణుల్ని బస్సుల్లో ఉచితంగా తిప్పాలనుకుంటున్న పార్టీ. ఎప్పుడో ఓసారి చేసే 'ప్రయాణం' కంటే

రోజూ కిచెన్‌లో చేసే 'వంట'కే కదా ప్రయారిటీ!!

ఇక... మూడో పిట్ట గురించి వేరే చెప్పాలా.. ఇతర పిట్టలు తప్పించుకున్నా..ఇప్పటికిప్పుడు వేటకూ, వేటుకూ గురితప్పకుండా గురయ్యే 'ఓటరు' పిట్ట!!!

పేరు మార్చుకొని.. పోటీకి



మేడ్చల్: రెండుసార్లు పోటీ చేసినా ఎమ్మెల్యేగా విజయం సాధించకపోవడంతో ఓ నేత ఏకంగా తన పేరునే మార్చుకున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తోటకూర జంగయ్యయాదవ్ 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం తరఫున, 2014లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాంగ్రెస్ ప్రకటించిన తొలిజాబితాలో మేడ్చల్ నుంచి వజ్రేష్‌యాదవ్‌కు టికెట్ ఓకే చేశారు.

పంచతంత్రం

40 ఏళ్లలో తొలిసారిగా ఆ 40 గ్రామాల్లో ఓటింగ్

బస్తర్(ఛత్తీస్‌గఢ్): మావోల ప్రాబల్యం అధికంగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో గత 40 ఏళ్లుగా ఎలాంటి ఓటింగ్ సాధ్యపడలేదు. 40 ఏళ్లలో తొలిసారిగా ఆ గ్రామాల్లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ సుసాధ్యం కానుంది. మావోయిస్టులకు పట్టున్న 40 గ్రామాల్లో 120 పోలింగ్ కేంద్రాలను శనివారం ఏర్పాటుచేశారు. గత ఐదేళ్లుగా ఈ ప్రాంతాల్లో 60కిపైగా భద్రతా బలగాల శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇన్నాళ్ల కృషి ఫలితంగా మావోల చెర నుంచి ఈ గ్రామాలకు విముక్తి లభించిందని పోలీసులు చెప్పారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేలా పోలీసులుకు తగు తర్ఫీదునిచ్చామని బస్తర్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ వెల్లడించారు.

కాంగ్రెస్ సర్వేను బీజేపీకి అమ్ముకున్నారు

జైపూర్: రాజస్తాన్‌లో ఓ వార్తాసంస్థపై ఒక ఎన్నికల వ్యూహరచన సంస్థ రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేసింది. రాజస్తాన్ రాష్ట్ర కాంగ్రెస్ కోసం డిజైన్‌బాక్స్‌డ్ అనే ఎన్నికల వ్యూహరచన సంస్థ పనిచేస్తోంది. రాజస్తాన్‌లో ఎన్నికల సరళిపై ఒక సర్వేను చేసి రాష్ట్ర కాంగ్రెస్‌కు తన నివేదికను సమర్పించింది. ఒక్కో నియోజకవర్గంలో కాంగ్రెస్ బలాబలాలు, గెహ్లాట్ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాలు, ఎన్నికల ప్రచారం తదితర వివరాలను కాంగ్రెస్‌కు అందజేస్తోంది. అయితే కాంగ్రెస్ కోసం ఈ సంస్థ చేపట్టిన సర్వే తాలూకు సమగ్ర వివరాలు అంతకుముందే బీజేపీ చేతికొచ్చాయని ఓ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. డిజైన్‌బాక్స్‌డ్‌లోని ఒక ఉద్యోగి రూ.20 లక్షల కోసం ఆ సర్వేలోని పూర్తి వివరాలను బీజేపీకి అమ్ముకున్నారని వార్తాసంస్థ ఆరోపించింది. దీనిపై డిజైన్‌బాక్స్‌డ్ డైరెక్టర్ నరేశ్ అరోరా స్పందించారు. 'సంస్థ ఉద్యోగి సర్వే వివరాలు అమ్ముకున్నాడనేది అబద్ధం. కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ గోవింద్ సింగ్‌తో నాకు విభేదాలు ఉన్నాయని కట్టుకథలు అల్లారు. రాష్ట్రంలో జరుగుతున్న కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంపై బురద చల్లేందుకు చేస్తున్న కుట్ర ఇది. న్యూస్‌పేపర్ యాజమాన్యం వెంటనే బేషరతు క్షమాపణలు చెప్పాలి. లేదంటే రూ.100 కోట్ల పరువునష్టం దావాను ఎదుర్కోవాలి. మిగతా న్యూస్‌పేపర్లు ఇలాంటి చెత్త కథనాలను వండే పని పెట్టుకోవద్దు'అని అరోరా వ్యాఖ్యానించారు.


రాజస్తాన్‌లో కాంగ్రెస్‌కు.. వ్యతిరేక పవనాలు

దానికి తోడైన ఇంటి పోరు
అవినీతిపై బీజేపీ ముమ్మర ప్రచారం
సమస్యలకు ఎదురీదుతున్న గహ్లోత్

'రాజస్తాన్‌లో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పోటాపోటీగా ఉండనుంది'

- ఈ మాటలన్నది ఏ ఎన్నికల విశ్లేషకుడో కాదు. స్వయానా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ! ఇది కేవలం నెల రోజుల క్రితం సంగతి!. తమ పాలనలోని ఈ రాష్ట్రంపై ఈసారి ఆ పార్టీ ఏ మేరకు ఆశలు పెట్టుకుందో చెప్పేందుకు ఈ వ్యాఖ్యలే నిదర్శనం. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఇతర రాష్ట్రాలతో, ముఖ్యంగా మధ్యప్రదేశ్‌తో పోలిస్తే రాజస్తాన్‌లో కాంగ్రెస్ పరిస్థితి అంత ఆశావహంగా ఏమీ లేదని ఆ పార్టీ స్థానిక నేతలే చెబుతున్నారు. ఇందుకు కారణాలూ అనేకం. రాజస్తాన్‌లో 1990లో బీజేపీ తొలిసారి అధికారంలోకి వచ్చింది. అప్పటినుంచీ అక్కడ దానికి, కాంగ్రెస్‌కు ద్విముఖ పోరే సాగుతూ వస్తోంది. ఇక ప్రభుత్వ వ్యతిరేకత ఇక్కడ ఎప్పుడూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానాంశంగానే ఉంటుంది. అలా చూసుకున్నా ఈసారి అధికారం తమదేనని బీజేపీ ధీమాగా ఉంది. గహ్లోత్ సర్కారు విచ్చలవిడి అవినీతికి పాల్పడుతోందని, అసమర్థ పాలన సాగుతోందని సర్వత్రా అభిప్రాయం నెలకొందని చెబుతోంది. దీనికి తోడు రాష్ట్ర కాంగ్రెస్ నేతల అంతర్గత పోరు తమ పనిని మరింత తేలిక చేస్తుందని భావిస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉండటం, ప్రధాని మోదీ ఛరిష్మా వంటివి మరింతగా కలిసొస్తాయని కాషాయ నేతలంటున్నారు. తమ డబుల్ ఇంజన్ నినాదానికే ఈసారి రాజస్తానీలు ఓటేస్తారని బీజేపీ ఆశతో ఉంది. ఈ నేపథ్యంలో ఒకవైపు యువ నేత సచిన్ పైలట్ అసమ్మతి రాగాలను ఎదుర్కొంటూనే, మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతకూ అడ్డుకట్ట వేసేందుకు సీఎం అశోక్ గహ్లోత్ చెమటోడుస్తున్నారు.





పథకాలే పథకాలు...

ఎన్నికల వేళ ఓటర్లను ఆకట్టుకునేందుకు కొద్ది నెలల ముందు నుంచే పలు ప్రజాకర్షక పథకాలకు గహ్లోత్ తెర తీశారు.

- ప్రభుత్వోద్యోగులకు పాత పెన్షన్ పథకం అమలు
- రాష్ట్రంలో కులాలవారీగా జన గణన
- రూ.25 లక్షల ఆరోగ్య బీమా కవరేజీ
- పట్టణ ఉపాధి హామీ పథకం
- సామాజిక భద్రత కింద ఒక్కొక్కరికి నెలకు రూ.1,000
- ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
- కులగణన ప్రకటన ఓబీసీలు తదితర ప్రాబల్య వర్గాల్లో బాగా పని చేస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది.
- తూర్పు రాజస్తాన్ కెనాల్ ప్రాజెక్టుతో ఆ ప్రాంతమంతటికీ తాగు, సాగునీరు అందిస్తామని చెబుతోంది.
- పథకాల్లో లబ్ధిదారులుగా చేరేందుకు ఇన్‌ఫ్లేషన్ రిలీఫ్ క్యాంపుల్లో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా గహ్లోత్ స్వయంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు!

బీజేపీది అదే వ్యూహం...



రాష్ట్రంలో తమకనువైన పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ విశ్వసిస్తోంది. వాటినుంచి గరిష్ఠంగా ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తోంది.

- అయితే రాష్ట్ర బీజేపీలోనూ గ్రూపు తగాదాలకు కొదవ లేదు!
- మాజీ సీఎం వసుంధర రాజే వర్గం ఈసారి ఆమే ముఖ్యమంత్రి రేస్‌లో ముందున్నారని ఇప్పట్నుంచే ప్రచారం చేస్తున్నారు. ఇతర సీనియర్లకు ఇది నచ్చడం లేదు.
- దాంతో ఎందుకైనా మంచిదని మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మాదిరిగా రాజస్తాన్‌లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ముందస్తుగా ఎవరినీ ప్రకటించలేదు. తద్వారా ఎన్నికల వేళ సీనియర్లలో అసంతృప్తులు చెలరేగి సహాయ నిరాకరణ తదితరాలకు దారి తీయకుండా జాగ్రత్త పడుతోంది.
- ఎప్పట్లాగే మోదీ మేనియానే తారకమంత్రంగా బీజేపీ రంగంలోకి దిగింది. ఆయన ఇప్పటికే రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలతో హోరెత్తిస్తున్నారు.
- హిందూత్వ కార్డును ప్రబలంగా బీజేపీ ప్రయోగిస్తోంది. గతేడాది రాష్ట్రంలో జరిగిన మత కల్లోలాలను మోదీ స్వయంగా గహ్లోత్ సొంత అసెంబ్లీ స్థానమైన సర్దార్‌పురా ఎన్నికల సభలో ప్రస్తావించారు!

2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

మొత్తం అసెంబ్లీ స్థానాలు	200
బీజేపీ	73
కాంగ్రెస్	100
స్వతంత్రులు	13
ఇతరులు	14

2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు

మొత్తం స్థానాలు	25
బీజేపీ	24
కాంగ్రెస్	0
ఆర్ఎల్‌పీ	1

ఇంటిపోరు ఏం చేసేనో...!

పథకాలు, ప్రచారాల మాటెలా ఉన్నా, నానాటికీ తీవ్రమవుతున్న ఇంటి పోరుతో గహ్లోత్ సతమతమవుతున్నారు.

- అధికారంలోకి వచ్చిన నాటినుంచీ పార్టీ యువ నేత సచిన్ పైలట్ ఆయనకు కంట్లో నలుసుగా మారారు.
- 2020లో పైలట్ బహిరంగంగా గహ్లోత్‌పై తిరుగుబావుటా ఎగరేశారు.
- అధిష్టానం జోక్యంతో అప్పటికి తగ్గినా అడుగడుగునా గహ్లోత్‌ను ఆయన ముప్పుతిప్పలు పెడుతున్నారు.
- అంతటితో ఆగకుండా తీవ్రమైన అవినీతి ఆరోపణలు గుప్పిస్తున్నారు.
- అసమర్థ పాలన సాగుతోందంటూ విమర్శలు సంధిస్తూ బీజేపీ పని తేలిక చేస్తున్నారు.
- అటు బీజేపీని, ఇటు అసమ్మతిని, తిరుగుబాటును ఎదుర్కోలేక గహ్లోత్ సతమతమవుతున్నారు!

- నేషనల్ డెస్క్, సాక్షి

---

144 మందితో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ మొదటి జాబితా

- 69 మంది సిట్టింగ్‌లకు మళ్లీ అవకాశం
- సీఎం చౌహాన్‌పై విక్రమ్ మస్తల్ పోటీ

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి వచ్చే నెల 17న జరగనున్న ఎన్నికలకు గాను కాంగ్రెస్ పార్టీ 144 మందితో కూడిన మొదటి జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఇందులో రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్‌తోపాటు 69 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలున్నారు. టీవీ సీరియల్‌లో హనుమాన్ పాత్రధారిగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు విక్రమ్ బస్తల్ బుధ్ని బీజేపీకి చెందిన సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై పోటీకి దిగనున్నారు. మాజీ సీఎం కమల్‌నాథ్ తన సొంత నియోజకవర్గం ఛింద్వారా నుంచి బరిలోకి దిగుతారు. రాజ్యసభ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ కుమారుడు జైవర్ధన్ సింగ్ రాఘవ్‌గఢ్ నుంచి, సోదరుడు లక్ష్మణ్ సింగ్ చచౌరా నుంచి పోటీ చేయనున్నారు. వీరిద్దరూ ఆయా స్థానాల్లో సిట్టింగ్‌లే. మొదటి జాబితాలో 39 మంది ఓబీసీలు, 22 మంది ఎస్సీలు, 30 మంది ఎస్టీలకు స్థానం కల్పించినట్లు కాంగ్రెస్ నేత చరణ్ సింగ్ సాప్రా చెప్పారు. ఇంకా జనరల్ కేటగిరీలో 47 మంది, మైనారిటీ వర్గం నుంచి ఆరుగురికి, మరో 19 మంది మహిళలకు కూడా అవకాశమిచ్చామన్నారు. అసెంబ్లీలోని 230 సీట్లకు గాను బీజేపీ ఇప్పటికే 136 మందితోకూడిన మొదటి జాబితా విడుదల చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో 30 మందితో మొదటి జాబితా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చే నెలలో రెండు విడతలుగా జరగనున్న ఎన్నికలకు గాను ఆదివారం కాంగ్రెస్ పార్టీ 30 మంది అభ్యర్థులతో మొదటి జాబితా విడుదల చేసింది. ముఖ్యమంత్రి భూపేష్ భగేల్, ఆయన మంత్రివర్గంలోని 12 మంది, అసెంబ్లీ స్పీకర్ మహంత్ సహా 22 మంది పాత వారు కాగా, కొత్తగా ఎనిమిది మందికి అవకాశం కల్పించింది. సిట్టింగ్‌లు 8 మందికి మొండిచేయి చూపింది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ దీపక్ బైజ్‌ను ఈసారి అసెంబ్లీ బరిలో దించుతోంది. 'మొదటి విడత పోలింగ్ జరిగే 20 స్థానాలకు గాను 19 చోట్ల అభ్యర్థులను ఇప్పటికే ఖరారు చేశాం. జగదల్‌పూర్ స్థానానికి కూడా సాయంత్రానికల్లా ప్రకటిస్తాం. 90 సీట్లున్న అసెంబ్లీలో 75 సీట్లలో మేమే విజయం సాధిస్తాం'అని బైజ్ చెప్పారు.



మిజోరం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కిరెణ్ రిజిజు నియామకం

న్యూఢిల్లీ: మిజోరం రాష్ట్రంలో పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజును బీజేపీ నియమించింది. సహాయక ఇన్‌చార్జ్‌లుగా పార్టీ జాతీయ కార్యదర్శి అనిల్ ఆంటోనీ, నాగాలాండ్ ఉపముఖ్యమంత్రి యాన్‌తుంగో పటోన్‌లను నియమించింది. 40 అసెంబ్లీ స్థానాలున్న మిజోరంలో నవంబర్ ఏడో తేదీన శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ మూడోతేదీన ఫలితాలు ప్రకటిస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మిజో నేషనల్ ఫ్రంట్ అత్యధికంగా 26 చోట్ల గెలిచింది. మరోవైపు ఛత్తీస్‌గఢ్ బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షునిగా జతీందర్ పాల్ మల్హోత్రాను బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ఎంపికచేశారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

సాక్షి
కరీంనగర్
సోమవారం, 16, అక్టోబర్, 2023



పీఎం శ్రీ.. అభివృద్ధికి దోహదం

జిల్లాలో పీఎం శ్రీ పథకం జిల్లా పాఠశాలల అభివృద్ధికి దోహదం అవుతోంది. పలు పాఠశాలలకు నిధులు విడుదల అయ్యాయి.

10లో▸



పచ్చివడ్లకు డిమాండ్

జిల్లాలో వరికోతలు ప్రారంభం అయ్యాయి. పలువురు వ్యాపారులు పచ్చి ధాన్యం కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

10లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.0/22.0

జిల్లాలో ఆకాశం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతాయి. చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీజేపీ జనగర్జన సభ



సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీపీ

హుజూరాబాద్‌: జమ్మికుంటలోని డిగ్రీ కళాశాల మైదానంలో నేడు బీజేపీ జనగర్జన సభ జరగనుంది. కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంత్రి హైదరాబాద్‌ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌ ద్వారా జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌వద్దకు మధ్యాహ్నం 12.40కి చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పబ్లిక్‌ మీటింగ్‌కు వెళ్తారు. గంటపాటు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగివెళ్తారు. కాగా సభ భద్రతా ఏర్పాట్లను సీపీ సుబ్బారాయుడు, అడిషనల్‌ డీసీపీ(లాఅండ్‌ఆర్డర్‌) లక్ష్మీనారాయణ, హుజూరాబాద్‌ ఏసీపీ జీవన్‌రెడ్డి పరిశీలించారు.

కేసీఆర్‌ ఓటమి బీజేపీ చేతుల్లోనే ఉంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌

జమ్మికుంట: కేసీఆర్‌పై పోటీచేస్తానన్న మాటకు కట్టుబడి ఉన్నానని, సీఎం కేసీఆర్‌ ఓటమి బీజేపీ చేతుల్లోనే ఉందని హుజూరాబాద్‌ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ పేర్కొన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నేడు నిర్వహించే బీజేపీ బహిరంగసభ ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. రాజేందర్‌ మాట్లాడుతూ.. బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేస్తున్నారని, ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. హుజూరాబాద్‌లో గతంకన్నా ఈ సారి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌ సింగ్‌ హాజరయ్యే బహిరంగ సభకు ప్రతీ ఇంటినుంచి తరలిరావాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ధర్మారావు, వేణుగోపాల్‌రెడ్డి, అరెపల్లి మోహన్‌, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, అర్జున్‌రావు, ఎర్రబెల్లి సంపత్‌రావు, జీడీ మల్లేశ్‌ పాల్గొన్నారు.

ఆర్టీసీ 100రోజుల ఫెస్టివల్‌ చాలెంజ్‌ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

విద్యానగర్‌(కరీంనగర్‌): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 15 అక్టోబర్‌ 2023 నుంచి 22 జనవరి 2024 వరకు దసరా, దీపావళి, క్రిస్మస్‌, సంక్రాంతి పండగల నేపథ్యంలో అనుసరిస్తున్న గ్రాండ్‌ ఫెస్టివల్‌ చాలెంజ్‌లో భాగంగా ఆదివారం కరీంనగర్‌ 1,2 డిపోల్లో జెండా ఆవిష్కరించారు. కరీంనగర్‌ రీజనల్‌ మేనేజర్‌ ఎస్‌.సుచరిత, డిప్యూటీ రీజనల్‌ మేనేజర్‌ (ఆపరేషన్స్‌) ఎస్‌.భూపతిరెడ్డి, డిపో మేనేజర్లు వి.మల్లయ్య, ఎల్‌.మల్లేశం, కరీంనగర్‌ బస్‌స్టేషన్‌ అసిస్టెంట్‌ ట్రాఫిక్‌ మేనేజర్‌ పి.రజనీకృష్ణ, మెకానికల్‌ సూపర్‌వైజర్‌ తిరుపతి పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విద్యానగర్‌(కరీంనగర్‌): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ చేనేత సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పద్మశాలీలకు పార్టీలు టికెట్లు ఇస్తే వారిని గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో 30 మంది సభ్యులతో కోర్‌ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు బుర్ర మల్లేశం, జక్కని సంజీవ్‌ కుమార్‌, మేడం రామకృష్ణ, కోమటి సదానందం, సిలువేరి గణేశ్‌, రాష్ట్ర కార్యదర్శి ఎలిగేటి శ్రీనివాస్‌, గుజాతార, అడిచర్ల శ్రీనివాస్‌, మంచి కట్ల కోటేశ్వర్‌, పిస్క లక్ష్మీనారాయణ, జడల చిరంజీవి, అడెపు సంపత్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి తాత్కాలికంగా రద్దు

కరీంనగర్‌ అర్బన్‌: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని రద్దు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ బి.గోపి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి నిర్వహించడం జరిగే ప్రక్రియ. కాగా ఎన్నికల కోడ్‌ ముగిసేంతవరకు ప్రజావాణి ఉండదని స్పష్టం చేశారు.

ఏడుగురితో హస్తం తొలి జాబితా

- పెద్దపల్లిలోని మూడు నియోజకవర్గాలకూ అభ్యర్థుల వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో మరో ఆరుస్థానాలకు త్వరలో ప్రకటన
- ఆరు పథకాలే ఆయుధాలంటున్న కాంగ్రెస్‌ నేతలు
- 19న పెద్దపల్లి, కరీంనగర్‌లో రాహుల్‌ పర్యటన
- ఎన్టీపీసీ, సింగరేణి కార్మికులు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ బాధితులతో సమావేశం
- రాహుల్‌ యాత్రతో కొత్త జోష్‌ వస్తుందంటున్న నేతలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌:

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌ తొలిజాబితా విడుదలైంది. ఏడుగురు అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించిన కాంగ్రెస్‌ పార్టీ.. మిగిలిన ఆరుస్థానాలకు త్వరలోనే రెండోజాబితాలో అభ్యర్థులను ప్రకటించనుంది. వాస్తవానికి 'కారు' పార్టీతో పోల్చితే 'హస్తం' పార్టీ అభ్యర్థుల ఎంపికలో జాప్యం చేసింది. ఇవేమీ ఎన్నికలపై ప్రభావం చూపబోవని, ఆలస్యంగా వచ్చినా సరే తాము ప్రచార కదనరంగంలో కొదమసింహాల్లా దూకుతామని ధీమాగా ఉన్నారు. తొలిజాబితా అనుకూల పవనాలు ఉన్నచోట అధికార బీఆర్‌ఎస్‌ను ధీటుగా ఎదుర్కోగలిగిన అభ్యర్థులు ఉన్న స్థానాలు కావడం గమనార్హం.

ఈ స్థానాలకు అభ్యర్థులు..

ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి జిల్లాపైనే కాంగ్రెస్‌ పార్టీ బాగా ఆశలు పెట్టుకుంది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో మంథనిలో ఒకేచోట తమ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండటం.. ఇక్కడే పార్టీకి పట్టు ఉండటంతో ముందుగా ఆ జిల్లాలోని మూడుస్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ తరువాత జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, జగిత్యాలకు అభ్యర్థులను ప్రకటించిన హస్తం పార్టీ.. కోరుట్లను తరువాత జాబితాకు మార్చింది. రాజన్నసిరిసిల్లజిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో వేములవాడకు అభ్యర్థిని ప్రకటించి.. సిరిసిల్లకు ఆపింది. కీలకమైన కరీంనగర్‌లో ఒక్క మానకొండూరుకు అభ్యర్థిని ప్రకటించి.. మిగిలిన చొప్పదండి, హుజూరాబాద్‌, హుస్నాబాద్‌, కరీంనగర్‌ స్థానాల ప్రకటన వాయిదా వేసింది. ప్రస్తుత జాబితాలోని అభ్యర్థుల్లో ముగ్గురు ఓసీ (వెలమ, బ్రాహ్మణ, రెడ్డి) సామాజికవర్గాలకు చెందిన వారు కాగా.. ఇద్దరు బీసీ (మున్నూరు కాపు, బుందెల), మరో ఇద్దరు ఎస్సీ (మాదిగ) సామాజికవర్గాలకు చెందిన వారు.

ఆరుపథకాలపై విశ్వాసం

కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు తమను అధికారంలోకి తీసుకొస్తాయని హస్తం పార్టీ నేతలు బలంగా నమ్ముతున్నారు.

- మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రతి మహిళకూ నెలకు రూ.2,500 ఆర్థిక సాయం.
- రూ.500కే గ్యాస్‌ సిలిండర్‌, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.
- రైతు భరోసా కింద ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15,000 పెట్టుబడి సాయం , వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఆర్థిక సాయం.
- వరి పంటకు అదనంగా రూ.500 బోనస్‌.
- గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు కరెంట్‌ ఉచితం.
- ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల సాయం.
- యువ వికాసం కింద విద్యా భరోసా కార్డు ద్వారా విద్యార్థులకు రూ.5 లక్షల పరిమితితో వడ్డీరహిత ఆర్థిక సాయం, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్‌ స్కూళ్ల ఏర్పాటు.
- చేయూత కింద పింఛనుదారులకు నెలకు రూ.4,000 పింఛను, ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల బీమా.

అభ్యర్థి పేరు: తాటిపర్తి జీవన్‌ రెడ్డి



పుట్టినతేదీ: 05-01-1951
విద్యార్హతలు: బీఏ. ఎల్‌ఎల్‌బీ (ఉస్మానియా)
సామాజిక వర్గం: రెడ్డి
స్వగ్రామం: బతికెపెల్లి, పెగడపల్లి మండలం, జగిత్యాల
అనుభవం: ఆరుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్సీ

అభ్యర్థి పేరు: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



పుట్టినతేదీ: 30 మే 1969
విద్యార్హతలు : ఎంఏ, ఎల్‌ఎల్‌బీ
సామాజిక వర్గం: బ్రాహ్మణ
స్వగ్రామం : ధన్వాడ, కాటారం మండలం
అనుభవం : మంత్రి, నాలుగు సార్లు ఎమ్మెల్యే

అభ్యర్థి పేరు: ఆది శ్రీనివాస్‌



పుట్టినతేదీ: 15-09-1966
విద్యార్హతలు: ఐటీఐ
సామాజికవర్గం: బీసీ, మున్నూరు కాపు
స్వగ్రామం : రుద్రంగి
అనుభవం: 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో పోటీ, ప్రస్తుతం తెలంగాణ పీసీసీ కార్యదర్శి, వేములవాడ ఇన్‌చార్జి

అభ్యర్థి పేరు: చింతకుంట విజయరమణారావు



పుట్టినతేదీ: 08-11-1966
విద్యార్హతలు: ఇంటర్‌
సామాజిక వర్గం: వెలమ
స్వగ్రామం : శివపల్లి, ఎలిగేడు
అనుభవం: 2001లో జెడ్పీటీసీ, 2009లో ఎమ్మెల్యే

అభ్యర్థి పేరు: రాజ్‌ఠాకూర్‌ మక్కాన్‌సింగ్‌



పుట్టినతేదీ: 15-08-1972
విద్యార్హతలు: బీఏ
సామాజిక వర్గం: బీసీ, బుందేలా
స్వగ్రామం : రామగుండం, గోదావరిఖని
అనుభవం: శాప్‌ చైర్మన్‌, 2014, 2108లో రామగుండం నుంచి ఎమ్మెల్యేగా పోటీ.

అభ్యర్థి పేరు: కవ్వంపల్లి సత్యనారాయణ



పుట్టినతేదీ: 10-06-1967
విద్యార్హతలు: ఎంబీబీఎస్‌ జనరల్‌ సర్జన్‌
సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : కరీంనగర్‌
అనుభవం: 2009లో, 2014లో ఎమ్మెల్యేగా పోటీ

అభ్యర్థి పేరు: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌



పుట్టినతేదీ: 01-04-1968
విద్యార్హతలు: ఇంటర్‌, ఐటీఐ (పెద్దపల్లి)
సామాజిక వర్గం: ఎస్సీ (మాదిగ)
స్వగ్రామం : గోదావరిఖని
అనుభవం: జెడ్పీ చైర్మన్‌, ఎస్సీ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌, 2014, 2018లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ..

అభ్యర్థులు వీరే..

రామగుండం:	రాకూర్‌ మక్కాన్‌సింగ్‌
పెద్దపల్లి :	చింతకుంట విజయరమణారావు
మంథని :	దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
ధర్మపురి :	అడ్లూరి లక్ష్మణ్‌
జగిత్యాల :	తాటిపర్తి జీవన్‌రెడ్డి
వేములవాడ :	ఆది శ్రీనివాస్‌
మానకొండూరు:	కవ్వంపల్లి సత్యనారాయణ

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...

మానకొండూర్‌: మానకొండూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను. నియోజకవర్గంలో ప్రధానంగా రహదారులు లేవు. రోడ్లు వేయించి రవాణా సౌకర్యం మెరుగు పరుస్తా. మండలాల్లో కళాశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు సర్కారు విద్య అందేందుకు కృషిచేస్తా. దళితవాడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటా. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్‌ పార్టీ తరఫున మానకొండూరు అభ్యర్థిగా నన్ను ప్రకటించినందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. – కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్‌ కాంగ్రెస్‌ అభ్యర్థి

19న రాహుల్‌ పర్యటన

ఈనెల 19న కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌గాంధీ పెద్దపల్లి, కరీంనగర్‌ జిల్లాల్లో పర్యటించనున్నారు. 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సింగరేణి, ఎన్టీపీసీ ఉద్యోగులు, యూనియన్‌ లీడర్లు, ఆర్‌ఎఫ్‌సీఎల్‌ కార్మికులు, కాంట్రాక్ట్‌ ఉద్యోగాల బాధితులతో సమావేశం అవుతారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పెద్దపల్లిలో బహిరంగసభలో మాట్లాడతారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్‌, రైతులతో సమావేశమవుతారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పెద్దపల్లి నుంచి కరీంనగర్‌ వరకు పాదయాత్ర ద్వారా చేరుకుంటారు. రాహుల్‌ పాదయాత్ర ద్వారా ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీకి పూర్వవైభవం వస్తుందని సీనియర్‌ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తొలిరోజు ఐదుగురికి బీ–ఫామ్స్‌

- సీఎం చేతులమీదుగా తీసుకున్న బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు
- హైదరాబాద్‌లో అందుకున్న మంత్రి కేటీఆర్‌
- హుస్నాబాద్‌ బహిరంగ సభలోనే సతీష్‌బాబుకు..
- మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయికి, హుజూరాబాద్‌ నుంచి 'పాడి'కి బీఫామ్‌





సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా బీ–ఫామ్‌ అందుకుంటున్న రసమయి బాలకిషన్‌, పాడి కౌశిక్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, కరీంనగర్‌: ఉమ్మడి జిల్లా పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను తొలిరోజు (ఆదివారం) నలుగురు అభ్యర్థులకు పార్టీ బీ–ఫామ్‌లను సీఎం కేసీఆర్‌ హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో అందించారు. హైదరాబాద్‌లో అందుకున్నవారిలో రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్‌, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌ రెడ్డి, హుజూరాబాద్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌ రెడ్డి ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు హాజరైన సీఎం కేసీఆర్‌.. ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌బాబుకు సభావేదికపైనే బీ–ఫామ్‌ అందించారు. దీంతో బీ–ఫామ్‌ అందుకున్నవారి సంఖ్య ఐదుకు చేరింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని మిగితా అభ్యర్థులకు సోమవారం తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా బీ–ఫామ్స్‌ అందించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించారు.

కదిలేదే లే..!

- బల్దియాలో పాతుకుపోతున్న ఉద్యోగులు
- ఏళ్లుగా ఇక్కడే తిష్ట
- అధికారులపైనే పెత్తనం

కరీంనగర్‌ కార్పొరేషన్‌: వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులు. తమ పైఅధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటించే పోస్టుల్లో ఉన్న వాళ్లే. కాని నగరపాలకసంస్థలో ఏళ్లుగా తిష్టవేశారు. పరిస్థితిని పూర్తిగా తమకు అనుకూలంగా మార్చుకున్నారు. అధికారులు ఎవరు వచ్చినా తమ మాట వినే పరిస్థితికి తీసుకువచ్చారు. లాంగ్‌స్టాండింగ్‌ను తప్పించుకొనేందుకు అప్పుడప్పుడు ఇతర నగరాలకు వెళ్లి, మళ్లీ ఇక్కడికే చేరుకొంటారు. ఏ అక్రమ పని ఎలా చేయాలి.. దానికి ఎంత వసూలు చేయాలి.. ఎవరికి ఎంత వాటా పంచాలనేది వాళ్ల రోజు వారి విధులు.

ఏళ్లకాలంగా..

నగరపాలకసంస్థలోని పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, పారిశుధ్య, ఇంజినీరింగ్‌ విభాగాల్లో కొంతమంది ఉద్యోగులు ఏళ్లకాలంగా పాతుకుపోయారు. స్థానచలనం అనే మాట మరిచిన సదరు ఉద్యోగులు, ఆయా విభాగాల్లో అంతా తామై నడిపిస్తున్నారు. అధికారులు సైతం సదరు ఉద్యోగులు చెప్పిన వాటికే సంతకాలు పెట్టే పరిస్థితి బల్దియాలో ఉంది. నిత్యం బల్దియా కార్యాలయంలో తచ్చాడుతుండే బ్రోకర్ల ద్వారా వీరంతా పనుల కోసం వచ్చే ప్రజలను పీల్చిపిప్పిచేస్తున్నారు.



ప్రతి వింగ్‌లో కలెక్షన్‌ కింగ్స్‌

ఆయా విభాగాల్లో ఏళ్లకాలంగా తిష్ట వేసిన సదరు ఉద్యోగులు కలెక్షన్‌ కింగ్స్‌గా అవతారమెత్తారు. అనుమతులు లేకుండా, అనుమతులు మీరి ఇళ్లు కట్టాలన్నా, నిబంధనలనే మాటే మరిచి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నా, ఇంటినంబర్లు సృష్టించి ఖాళీ స్థలాలను సొంతం చేసుకోవాలన్నా, ఆస్తిపన్ను తక్కువ కావాలన్నా, అభివృద్ధి పనుల అంచనాలు తారుమారు కావాలన్నా సదరు ఉద్యోగుల పాత్రే ప్రధానం. తమను కలిస్తేనే అపార్ట్‌మెంట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, లేదంటే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టడం, తిరస్కరించి ఇబ్బందులు పెట్టడం, డబ్బులు ఇవ్వగానే అనుమతులు జారీ చేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య. ఇటీవల వెలుగు చూసిన హోర్డింగ్స్‌ అక్రమాలు, ఖాళీ స్థలాలకు ఇంటినంబర్లు తదితర వ్యవహారాల్లో ఈ ఉద్యోగులదే కీలక పాత్ర.

బదిలీ లేదు..

సాధారణంగా రెండు మూడేళ్ల తరువాత ఉద్యోగులు బదిలీ అవుతుంటారు. నగరపాలకసంస్థలో మాత్రం నాలుగైదు ఏళ్లు, ఒకరిద్దరు ఎనిమిది ఏళ్ల పాటు ఇక్కడే తిష్ట వేసిన ఉద్యోగులు ఉన్నారు. వీరంతా కూడా అవినీతి, అక్రమాల్లో ఆరితేరి తమ స్థానాన్ని సుస్థిరం చేసుకొన్న వాళ్లే. కింది నుంచి పై స్థాయి వరకు వీరికి ఉన్న ఆర్థిక సంబంధాలతోనే బదిలీ మాట అనేది మరిచిపోయారనేది బల్దియా వర్గాలో బహిరంగరహస్యమే. ఒకవేళ లాంగ్‌ స్టాండింగ్‌ అడ్డుగా అనిపిస్తే, కొద్దికాలం పాటు ఇతర నగరాలకు వెళ్లి మళ్లీ ఇక్కడికే వస్తారు. ఇక్కడనే వివిధ హోదాల్లో సర్దుబాటు అవుతూ ఉంటారు. మొత్తానికి నగరపాలకసంస్థను వీడకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉంటారు. నగరపాలక సంస్థ పరిధిలో జరిగే అవినీతి, అక్రమాలకు బాధ్యులైన ఇలాంటి ఉద్యోగులను తప్పిస్తేనే పాలన పారదర్శకంగా సాగే అవకాశం ఉంది.

గన్స్‌పై ఖాకీల నజర్‌!

- పోలీసుస్టేషన్లలో డిపాజిట్‌ చేయాలని సీపీ ఆదేశాలు
- జిల్లావ్యాప్తంగా 120కిపైగా తుపాకులు
- ఇప్పటి వరకు 69 డిపాజిట్‌



కరీంనగర్‌క్రైం: ఎన్నికల కోడ్‌ అమలుతో తుపాకీలపై పోలీసులు నజర్‌ పెట్టారు. ప్రయివేటు వ్యక్తుల వద్ద తుపాకులను సమీప పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని ఆదేశించారు. వివిధ వర్గాల వారు ఆత్మరక్షణ కోసం లైసెన్సులు పొందుతారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు, బంగారం, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు, పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు చేసేవారు గన్‌ లైసెన్సు తీసుకుంటారు. ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో నగదు భద్రతకు గన్స్‌ కోసం దరఖాస్తులు చేసుకుంటారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్న సమయంలో ప్రైవేటు వ్యక్తులు వాడుతున్న గన్స్‌ సమీప పోలీస్‌స్టేషన్‌లో డిపాజిట్‌ చేయాలని సీపీ సుబ్బారాయుడు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 120కిపైగా లైసెన్స్‌డ్‌ గన్స్‌ ఉండగా.. ఇప్పటివరకు 69 ఆయుధాలు ఇప్పటి వరకు డిపాజిట్‌ చేసినట్లు సమాచారం. నిర్ణీత సమయంలో ఆయుధాలు డిపాజిట్‌ చేయని వారిపై చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల సమయంలో తుపాకులపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

గన్స్‌ డిపాజిట్‌ చేయాలి



ఎన్నికల నియామవళిని అనుసరించి తుపాకులు డిపాజిట్‌ చేయాలని ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 69 తుపాకులు డిపాజిట్‌ చేశారు. డిపాజిట్‌చేయని వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు 883 మందిని బైండోవర్‌ చేశాం. ఎన్నికల సందర్భంగా అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

– ఎల్‌.సుబ్బారాయుడు, కరీంనగర్‌ సీపీ

మేనిఫెస్టో సంబురాలు



కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌ ఆదివారం విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోతో విపక్ష పార్టీల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని మేయర్‌ వై.సునీల్‌రావు అన్నారు. ఆదివారం తెలంగాణచౌక్‌లో బీఆర్‌ఎస్‌ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్‌ ఆధ్వర్యంలో మేనిఫెస్టో విడుదల, అభ్యర్థులకు బీఫామ్‌లు అందజేయడాన్ని హర్షిస్తూ స్వీట్లు పంచి సంబురాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్‌కు, పార్టీకి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మేయర్‌ వై.సునీల్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో బీఆర్‌ఎస్‌ పార్టీకి ఎదురులేదని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టో జనరంజకంగా ఉందని తెలిపారు. ముచ్చటగా మూడోసారి బీఆర్‌ఎస్‌ పార్టీ అధికారంలోకి రావడం కేసీఆరే సీఎం కావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ రెడ్డవేని మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ పొన్నం అనిల్‌కుమార్‌, కొత్తపల్లి మున్సిపల్‌ చైర్మన్‌ రుద్ర రాజు, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకం.. అభివృద్ధికి దోహదం

- పాఠశాలల్లో మౌలిక వసతులు, సైన్స్‌ ల్యాబ్‌లు
- జిల్లాలో 13 స్కూళ్ల ఎంపిక
- ఐదేళ్ల పాటు విడతల వారీగా నిధుల కేటాయింపు


చొప్పదండి మండలం రుక్మాపూర్‌ మోడల్‌స్కూల్‌

కరీంనగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి పేద విద్యార్థులకు కార్పొరేట్‌ విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్‌ ఫర్‌ రైజింగ్‌ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని కొనసాగిస్తూ విడతల వారీగా నిధులు కేటాయించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలల అభివృద్ధికి ఈ పథకాన్ని 2022–23 నుంచి 2026–27 వరకు కొనసాగించేందుకు నిర్ణయించారు. ఎంపికైన పాఠశాలల్లో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు. జిల్లాలో పీఎంశ్రీ కింద 13 పాఠశాలలను ఎంపిక చేశారు. పాఠశాలల గుర్తింపు, లక్ష్యాల నిర్ధారణ, చర్చ, ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనుల అమలుకు చర్యలు తీసుకుంటారు.

రూ.1.27 కోట్ల నిధులు విడుదల

ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్‌ స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరానికి మేజర్‌ రిపేరింగ్‌ పనులు, సైన్స్‌ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.1.27కోట్ల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సైన్స్‌ల్యాబ్‌ల కోసం జిల్లాలోని ఇల్లందకుంట హైస్కూల్‌, హుజూరాబాద్‌ మండలం చెల్పూర్‌, మానకొండూర్‌ హైస్కూల్‌, రామడుగు, సైదాపూర్‌, వీణవంక ఆదర్శ పాఠశాలలకు రూ.16 లక్షల చొప్పున నిధులు విడుదల చేసింది. అలాగే మేజర్‌ రిపేరింగ్‌ల కోసం చొప్పదండి, గంగాధర, కరీంనగర్‌, సైదాపూర్‌, రామడుగు, వీణవంక, శంకరపట్నం ఆదర్శ పాఠశాలలకు ఒక్కో స్కూల్‌కు రూ.4.5 లక్షల చొప్పున విడుదలయ్యాయి.

నైపుణ్యం పెంపొందించేందుకే..

- ఎంపికైన పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతారు. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కార్పొరేట్‌ స్థాయిలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక వనరులు సమకూర్చుతారు.
- విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు.
- వారికి మానసిక స్వేచ్ఛను కల్పించి వివిధ అంశాలపై కౌన్సెలింగ్‌ ఇస్తారు. దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాల అమలుకు ప్రాధాన్యత ఇస్తారు. విద్యార్థుల్లో భాషాపరమైన లోపాలను సరిదిద్దుకోవడానికి అవసరమైన సాంకేతిక వనరులను వినియోగించుకునేలా ప్రోత్సహిస్తారు.
- ఎంపికైన పాఠశాలల్లో సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తారు. ఎల్‌ఈడీ దీపాలను అన్ని తరగతి గదుల్లో ఏర్పాటు చేయిస్తారు. పోషకాహార పెరటి తోటల పెంపకం, ప్లాస్టిక్‌ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించడం, నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, బొమ్మలతో ఆకర్షణీయంగా బోధన చేసి విద్యార్థులను ఆకట్టుకునేలా చర్యలు తీసుకుంటారు.
- విద్యార్థులకు చదువుతో పాటు క్షేత్రస్థాయి పనుల్లో కూడా శిక్షణ ఇస్తారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాత స్వయం ఉపాధి పథకాలతో లబ్ధి పొందడంపై అవగాహన కల్పిస్తారు.
- విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసి వారి స్థాయిని పరిశీలిస్తారు. తద్వారా వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడం సులభతరమవుతుంది.

ఆధునిక వసతులతో పాటు..



పాఠశాల విద్యలో సమూల మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా పీఎంశ్రీ పథకాన్ని చేపట్టారు. ఎంపికైన పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, ఆధునిక వసతులతో బోధన, విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా డిజిటల్‌ లైబ్రరీ, సైన్స్‌ ల్యాబ్‌, సమాచార వ్యవస్థ, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు అవసరమైన వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి తెస్తారు.

– సీహెచ్‌. జనార్దన్‌రావు, డీఈవో

అనారోగ్యంతో తండ్రి మృతి.. రోడ్డున పడ్డ కుటుంబం


అనాథలైన చిన్నారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంటాడుతున్న పేదరికం.. బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తల్లి.. అనారోగ్యంతో తనువు చాలించిన తండ్రి వెరసి నేడు ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇంత కాలం భర్త కూలీనాలీ చేసి ఆ కుటుంబాన్ని పోషించాడు. గతేడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబ పెద్ద ఆదివారం మృతిచెందాడు. దీంతో భార్య, ఇద్దరు కూతుళ్లు రోడ్డున పడ్డారు. ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మాచర్ల స్వామి–సుజాత దంపతులకు అశ్విత, అనిన్య కూతుళ్లు. భార్య బీడీలు చుడుతుండగా, స్వామి కూలీ పనులు చేసేవాడు. స్వామి ఏడాది క్రితం అనా రోగ్యం బారిన పడ్డాడు. ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. ఖరీదైన వైద్యం అందక రెండు రోజుల క్రితం తీవ్ర అనారో గ్యానికి గురయ్యాడు. ఇంటి వద్దనే ఉన్న స్వామి మరణించాడు. అంత్యక్రియలు నిర్వహించడానికి గ్రామస్తులు చందాలు పోగుచేసి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. స్వామి మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు అనాథలుగా దిక్కులు చూస్తున్నారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తన భర్త మృతితో దిక్కులేని వాళ్లమయ్యామని సాయం అందించి ఆదుకోవాలని సుజాత కోరుతుంది. సాయం అందించే వారు ఫోన్‌పే 63018 38702 మాచర్ల సతీశ్‌కు ఆర్థిక సహాయం అందించాలని వేడుకుంటుంది.

క్లుప్తంగా

రాముని సేవలో ప్రధాన న్యాయమూర్తులు


పూజలు చేస్తున్న మూడు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి వారిని రాజన్నసిరిసిల్ల, కరీంనగర్‌, పెద్దపల్లి జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు ప్రేమలత, ప్రతిమ, హేమంత్‌కుమార్‌ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో నిత్యం వెలిగే నందదీపం, మూల విగ్రహాలను సందర్శించారు. ఆలయ విశిష్టత గురించి ఆలయ కమిటీ చైర్మన్‌ మల్లుగారి నర్సాగౌడ్‌ వివరించారు.

హాకీ పోటీలకు ఎంపిక


విగ్నేష్‌

హుజూరాబాద్‌: పట్టణానికి చెందిన హాకీ ప్లేయర్‌ సొల్లు విగ్నేష్‌ చైన్నైలో జరగనున్న సౌత్‌ జోన్‌ చాంపియన్‌ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి 14వ తేదీ వరకు మొదటి హాకీ ఇండియా సబ్‌ జూనియర్‌ మెన్స్‌, ఉమెన్స్‌ సౌత్‌ జోన్‌ చాంపియన్‌షిప్‌ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

దుర్గమ్మకుంటలో మొసలి


దుర్గమ్మకుంటలో మొసలి

మల్లాపూర్‌: మండలకేంద్రంలోని దుర్గమ్మకుంట చెరువులో ఆదివారం మొసలి కనిపించింది. స్థానికుల కథనం ప్రకారం.. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకుంటకు ఆనుకుని కనకదుర్గాదేవి ఆలయంలో వేడుకలు నిర్వహించేందుకు వెళ్లిన భక్తులకు చెరువులో మొసలి కనిపించింది. విషయాన్ని వారు గ్రామస్తులకు తెలిపారు. దీంతో వారు తండోపతండాలకు వచ్చి చూశారు. గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

నగదు పట్టివేత

రామగిరి: ఎస్సై రవి ప్రసాద్‌ ఆధ్వర్యంలో ఆదివారం సెంటనరీకాలనీలో వాహనాల తనిఖీ చేశారు. మంథని మండలం గోపాల్‌పూర్‌ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.60,350 నగదు స్వాధీనం చేసుకున్నారు. తగిన ఆధారాలు చూపించకపోవడంతో నగదు సీజ్‌ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో జగిత్యాల యువకుడి ఆత్మహత్య



జగిత్యాల క్రైం: జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన దొనకంటి సాయిరాం (30) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన సాయిరాం జగిత్యాలలోని మహాలక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌ వెళ్లాడు. హిమాయత్‌నగర్‌లోని వెలమ హాస్టల్‌లో శనివారం క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు.

ఉద్యోగం ముసుగులో కాంట్రాక్టులు

- విద్యుత్‌ సంస్థలో యథేచ్ఛగా వ్యవహారం
- 'మామూలు'గా తీసుకుంటున్న ఉన్నతాధికారులు
- ఆపరేటర్‌ బదిలీతో వెలుగుచూస్తున్న వైనం

కొత్తపల్లి(కరీంనగర్‌): ఉద్యోగం ముసుగులో కాంట్రాక్టు పనులు చేపడుతూ రెండు చేతులా సంపాదిస్తున్న వ్యవహారం విద్యుత్‌ సంస్థలో యథేచ్ఛగా కొనసాగుతోంది. విద్యుత్‌ సంస్థ నిబంధనలు తుంగలో తొక్కుతూ బంధువుల అవతారంలో ఉద్యోగులే కాంట్రాక్టు పనులు చేపడుతున్నప్పటికీ ఉన్నతాధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటూ పనికాజేస్తున్నారు. కరీంనగర్‌ రూరల్‌ డివిజన్‌ పరిధిలోని చెర్లభూత్కూర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌ శ్యాం నిర్లక్ష్య ధోరణితో కాంట్రాక్ట్‌ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్యాం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పరిగణలోకి తీసుకున్న అధికారులు అతనిపై బదిలీ వేటు వేయడం విద్యుత్‌ సంస్థలో చర్చకు దారితీసింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఆపరేటర్‌పై సస్పెన్షన్‌ వేటు వేయాల్సిన అధికారులు బదిలీ చేయడంపై అనుమానాలకు తావిస్తోంది. ఇదిలా ఉంటే ఓ పక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క కాంట్రాక్టర్‌ అవతారమెత్తినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు అతనిపై లోతుగా విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. విద్యుత్‌ సంస్థలోని అనేక మంది కాంట్రాక్టర్ల అవతారమెత్తుతున్నప్పటికీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. విద్యుత్‌ సంస్థ నియమ నిబంధనల ప్రకారం అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు కాంట్రాక్టర్లుగా వ్యవహరించకూడదు. కాని వీటన్నింటిని పట్టించుకోకుండా రెండు చేతులా సంపాదిస్తున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులు మమకారం చూపుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెర్లభూత్కూర్‌ ఆపరేటర్‌ శ్యాం ఓ పక్క సబ్‌స్టేషన్‌ ఆపరేటర్‌గా పనిచేస్తూనే మరోపక్క ఆయన భార్య పేరిట లైసెన్స్‌ తీసుకొని కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇతని సోదరుడి పేరుతో సైతం లైసెన్స్‌ తీసుకొని విద్యుత్‌ సంస్థలో కాంట్రాక్టు పనులు చేస్తున్నట్లు తీవ్ర చర్చ జరుగుతోంది. అదేవిధంగా అతని తండ్రి సైతం పెద్దపల్లి సర్కిల్‌ పరిధిలోని సుల్తానాబాద్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులు వ్యవహరిస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగం చాటున కాంట్రాక్టు పనులు చేపట్టే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ మేనిఫెస్టోతో ఎంతో మేలు


మాట్లాడుతున్న పొలాడి రామారావు


కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ మేనిఫెస్టోతో రైతులకు, పేదలకు ఎంతో మేలు చేకూరుతుందని రైతు ప్రజా సంఘాల జాతీయ నాయకుడు పొలాడి రామారావు అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ ప్రకటించిన బీఆర్‌ఎస్‌ పార్టీ ఎన్నికల ప్రణాళికలో రైతుబంధు పథకానికి రూ.16వేలకు పెంపు, వికలాంగుల పెన్షన్లు పెంపు, పేద మహిళలకు నెలకు మూడువేలగా ఆర్థిక సాయం చేకూర్చు, గ్యాస్‌ సిలిండర్‌ రూ.400కే అందించడం , రేషన్‌ కార్డు ఉన్న పేదలకు సన్నబియ్యం సరఫరా చేయడం, అగ్రవర్ణ పేదలకు నియోజకవర్గాని ఒక్కటి చొప్పున 119గురుకులాల ఏర్పాటు, ఆరోగ్య శ్రీ పథకం రూ.15లక్షలు పెంపు, పేదలకు రూ.5లక్షల జీవిత బీమా కల్పించడం లాంటి పథకాలను ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం పేద బడుగు బలహీనవర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మార్క అజయ్‌ మృతదేహం

హుజూరాబాద్‌ రూరల్‌: మండలంలోని మాందాడపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన తాడిచర్ల సాయితేజ, మార్క అజయ్‌(35) సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై హుజూరాబాద్‌ వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గంమధ్యలో కరీంనగర్‌–వరంగల్‌ ప్రధాన రహదారిపై మాందాడిపల్లి శివారులో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటన ఇద్దరు గాయపడ్డారు. 108లో స్థానికులు హుజూరాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మార్క అజయ్‌ మృతిచెందాడని వైద్యులు తెలిపారు. సాయితేజ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్‌ బోల్తా


బోల్తాపడిన వ్యాన్‌

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో కొబ్బరి బోండాల లోడ్‌ వ్యాన్‌ ఆదివారం వేకువజామున బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌ భీమయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, వివరాలు సేకరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హుజూరాబాద్‌రూరల్‌: మండలంలోని సింగాపూర్‌ శివారులో పేకాట ఆడుతున్న 11మందిని ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ రమేశ్‌ తెలిపారు. వీరి నుంచి రూ.50,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో తుమ్మనపల్లికి చెందిన ఇద్దరు, సింగాపూర్‌కు చెందిన 8మంది, హుజూరాబాద్‌కు చెందిన వారు ఒకరు ఉన్నారు.

పచ్చి వడ్లకు డిమాండ్‌

- పెద్ద ఎత్తున రైసుమిల్లర్ల కొనుగోలు
- జిల్లాలో ప్రారంభమైన వరికోతలు


మొగ్దుంపూర్‌లో వరికోస్తున్న హార్వెస్టర్‌

కరీంనగర్‌రూరల్‌: జిల్లాలో వానాకాలం సీజన్‌ వరిపంట కోతలు ప్రారంభమయ్యాయి. వర్షాలు ఆలస్యంగా కురిసినప్పటికి వరిసాగు చేసిన రైతుల్లో ఆశలు నింపింది. జిల్లావ్యాప్తంగా 2.72లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా సీజన్‌ అరంభంలో కురిసిన వర్షాలకు వరినాట్లు వేసిన ప్రాంతాల్లో పంట చేతికందుతుండగా ఆయకట్టు పరిధిలో వరికోతలు ఆలస్యం కానున్నాయి. కొన్ని మండలాల్లో వరిపంట ఇప్పుడిపుడే పొట్టదశకు చేరుకోగా ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు వరికోతలపై దృష్టిపెట్టారు. రైసుమిల్లర్లకు సైతం ధాన్యం అవసరముండటంతో పెద్ద ఎత్తున కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు.

పచ్చి వడ్లు కొంటున్న మిల్లర్లు

రైతులు పంటను కోసి నేరుగా రైసుమిల్లులకు తరలిస్తున్నారు. రైసుమిల్లర్లు దొడ్డురకం ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1800నుంచి రూ.1900 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వారం, పదిరోజుల్లో డబ్బులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో మిల్లర్లకు పచ్చి వడ్లను విక్రయించేందుకు రైతులు ముందుకొస్తున్నారు. ప్రభుత్వం ఈ సారి ధాన్యం మద్దతుధర సాధారణం రూ.2,183, ఏ–గ్రేడుకు రూ.2,203 నిర్ణయించింది. అయితే ప్రస్తుతం వరికోస్తున్న రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడం, కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట క్వింటాలుకు రెండు, మూడు కిలోల అదనపు తూకంతో నష్టపోతామనే ఆలోచనతో పచ్చివడ్లను మిల్లర్లకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు వచ్చేనెల మొదటివారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కేంద్రాలు ప్రారంభించినప్పటికి ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నడిచే అవకాశం లేదనే ఆలోచనతో ముందుగా కోతలు చేపట్టిన రైతులు మిల్లర్లకు విక్రయించేందుకు ఆసక్తిచూపుతున్నారు. ప్రస్తుతం మిల్లర్ల వద్ద ధాన్యం స్టాక్‌లేకపోవడంతో అందివచ్చిన అవకాశంగా పచ్చివడ్లను కొంటున్నారు.

మొగిపురుగుతో తగ్గిన దిగుబడి

వాతావరణం మార్పులతో వరిపంటకు ఆశించిన మొగిపురుగు ప్రభావంతో దిగుబడి తగ్గిపోయే అవకాశముందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఆకాశం మేఘావృతంకావడం, వర్షాలు కురువడంతో గాలిలో తేమశాతం పెరిగి మొగిపురుగు వేగంగా వ్యాప్తిచెందింది. దీంతో వరికంకులు తెల్లగా మారిపోయాయి. అధిక విస్తీర్ణంలోని వరిపొలాలు మొగిపురుగు బారిన పడ్డాయి. పలుమార్లు క్రిమీసంహారక మందులను వాడినప్పటికి పురుగు ఉధృతి తగ్గలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికి చేతికందిన పంటను రైతులు వెంటనే కోయిస్తు మిల్లుల్లో ధాన్యం విక్రయిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్‌ భర్తకు గాయాలు


దెబ్బతిన్న కారు

తిమ్మాపూర్‌: కరీంనగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని అలుగునూర్‌– వరంగల్‌ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై ప్రమోద్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మానకొండూరు మండలం గంగిపల్లి సర్పంచ్‌ భర్త సాగర్‌ తన కారులో కరీంనగర్‌ వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో సాగర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 వాహనంలో కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

రూ.11 వేల మద్యం పట్టివేత

మెట్‌పల్లి: పట్టణంలోని అర్బన్‌ హౌజింగ్‌కాలనీలో బెల్టు దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన రూ.11వేల మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడు పంగ రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యం


ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందిస్తున్న వినోద్‌కుమార్‌

- 1.33 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌
- ప్రతిమ ఫౌండేషన్‌ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

కరీంనగర్‌: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్దపీట వేస్తోందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌ కుమార్‌ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రతిమ ఫౌండేషన్‌ సౌజన్యంతో వారధి స్టడీ సర్కిల్‌లో కానిస్టేబుల్‌, ఎస్సై కోచింగ్‌ పొంది ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఆదివారం ఫౌండేషన్‌ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ హరిణి ఆధ్వర్యంలో సన్మానించారు. వినోద్‌కుమార్‌, మేయర్‌ యాదగిరి సునీల్‌ రావు హాజరై ప్రతిమ ఫౌండేషన్‌ సౌజన్యం సహకారంతో కానిస్టేబుల్‌, ఎస్సై ఉద్యోగాలు సాధించిన 37మంది అభ్యర్థులను అభినందించారు. వినోద్‌ కుమార్‌ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పుట్టిందే మలి దశ తెలంగాణ ఉద్యమం అని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చిన నుంచి ఇప్పటివరకు 1.33 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు 88వేల ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్‌ ఇచ్చామన్నారు. మరో 5,600 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్‌ ఇచ్చామని తెలిపారు. కరీంనగర్‌ స్టడీసర్కిల్‌ ద్వారా వివిధశాఖల్లో 287మంది ఉద్యోగాలు సాధించడం సంతోషకరమని తెలిపారు. గ్రంథాలయ చైర్మన్‌ పొన్నం అనిల్‌గౌడ్‌, ప్రతిమ ఫౌండేషన్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ప్రతీక్‌, స్టడీ సర్కిల్‌ ఇన్‌చార్జ్‌ శ్రీనివాస్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు జక్కుల నాగరాజు పాల్గొన్నారు.

గంజాయి రహిత గ్రామాలే లక్ష్యం


మాట్లాడుతున్న విమలక్క

రామగిరి(మంథని): గంజాయి రహిత గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా పోరాటాలు చేస్తామని ప్రజాగాయకురాలు విమలక్క అన్నారు. ప్రస్తుతం పల్లెలు, పట్టణాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. మద్యపాన నిషేధం, గంజాయి నియంత్రణకు సమష్టి పోరాటాలే శరణ్యమని అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీకాలనీలో ఆదివారం రాత్రి జరిగిన బహుజన బతుకమ్మ సంబురాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహిళలతో బతుకమ్మ ఆడారు. అనంతరం విమలక్క మాట్లాడారు. బహుజన బతుకమ్మ ఉత్సవం కాదని, ఒక ఉద్యమంలా మహిళందరూ ముందుకు సాగాలని కోరారు. ఈ ఏడాది 'మద్యం రద్దు– మగువల రక్షణ' నినాదంతో మహిళలను చైతన్యపరుస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఏ పార్టీకి తాము మద్దతు ఇవ్వబోమని, మద్యపానం, గంజాయి, మహిళలపై అఘాయిత్యాలు నియంత్రణించిన పార్టీకే మద్దతు పలకాలని మహిళలను కోరారు. మహిళలపై దాడులు ఆగడంలేదని, వారు గౌరవంగా ముందుకు సాగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కులం, మతం పేరిట మహిళలపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గద్దర్‌కు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాల్‌పల్లి జెడ్పీ చైర్‌పర్సన్‌ జక్కు శ్రీహర్షిణి, మంథని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పుట్ట శైలజ, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైస్‌ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, సర్పంచులు అల్లం తిరుపతి, పల్లె ప్రతిమ, కళాకారులు పాల్గొన్నారు.

జిల్లా తెరవే నూతన కార్యవర్గం


శంకరయ్య


సీవీకుమార్‌

కరీంనగర్‌కల్చరల్‌: కరీంనగర్‌ ఫిల్మ్‌ భవన్‌లో కందుకూరి అంజయ్య అధ్యక్షతన తెలంగాణ రచయితల వేదిక (తెరవే) జిల్లా కార్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తెరవే జిల్లా అధ్యక్షుడుగా సి.వి.కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా దామరకుంట శంకరయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రామానుజం సుజాత, నాంపల్లి సుజాత, పెనుగొండ బసవేశ్వర్‌, విలాసాగరం రవీందర్‌, కామారపు అశోక్‌, మహమ్మద్‌ నసీరుద్దీన్‌, సహాయ కార్యదర్శులుగా ఎదునూరి రాజేశ్వరి, బోనగిరి హరిప్రియ, ఎక్కలదేవి మధుశ్రీ, వెగ్గలం ఉషశ్రీ, పత్తెం వసంత, దామెర లక్ష్మి, మేడి చంద్రయ్య, గాలిపల్లి జగదీష్‌, మేరుగు ప్రవీణ్‌, గసికంటి సంజీవ్‌, తెరవే జిల్లా ప్రచార కార్యదర్శిగా గుండు రమణయ్య, ఆర్థిక కార్యదర్శిగా నేరువట్ల చైతన్యలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా నడిమెట్ల రామయ్య, రావుల పవన్‌, బి. అభిషేక్‌, శీలంపల్లి క్రాంతి, నల్ల రాజేశ్వరి, మోర అనిల్‌ కుమార్‌, ఖాలిద్‌, పి.సత్యనారాయణ రాజు, మహనీయ, మేర్గు అంజయ్య, బదావత్‌ అశోక్‌, వొడ్నాల రాజేశం, డి.అఖిల్‌ కుమార్‌, గిరిధర్‌ రావు, ప్రేమ్‌ సాగర్‌ రావులు ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు వ్యవహరించారు.

క్లుప్తంగా

బీసీలకు క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న బొల్లం లింగమూర్తి

కరీంనగర్: బీసీ మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడటమే కాకుండా సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్యపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లం లింగమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు అధిక అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు అజయ్, అశ్విన్, శ్రీనివాస్, మధుబాబు, రమేష్, కోటీశ్వర్, వికాస్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో బీఆర్‌ఎస్ సంబరాలు


మిఠాయిలు పంచి పెడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తపల్లి: బడుగు, బలహీనవర్గాలు, నిరుపేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ఎన్నికల మెనిఫెస్టోను సీఎం కేసీఆర్ రూపొందించడాన్ని హర్షిస్తూ ఆదివారం కొత్తపల్లి మండలం చింతకుంటలో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచిపెడుతూ బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల శాఖ అధ్యక్షుడు గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, మైనారిటీ విభాగం అధ్యక్షుడు సయ్యద్ చాంద్, నాయకులు సతీశ్‌కుమార్, సోమిరెడ్డి లచ్చిరెడ్డి, మణికంఠగౌడ్, అరుణ్, శ్రీను, అజయ్, నరేందర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు


హైదరాబాద్ వెళ్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేస్తున్న మాదిగల విశ్వరూప పాదయాత్రకు మద్దతుగా ఆదివారం ఎంఈఎఫ్, ఎంఆర్పీఎస్ నాయకులు కరీంనగర్ కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కవ్వంపెల్లి రాములు, నాయకులు బెజ్జంకి అనిల్, సుంకె సత్యనారాయణ, వద్లూరి రాజమల్లన్న, తాండ్ర నర్సన్న, గసికంటి కుమార్, దండు అంజయ్య, గోస్కి శంకర్, కనకం అంజి బాబు, గొర్రె రాజయ్య తదితరులున్నారు.


మహాశక్తి ఆలయంలో..


భవానీ దీక్ష స్వీకరిస్తున్న బండి సంజయ్‌కుమార్


పూజల్లో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు దంపతులు

కొలువైన దుర్గామాత

దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మండపాలు, ఆలయాల్లో దుర్గామాత కొలువుదీరారు. ప్రత్యేక పూజలు, విశేషాలంకరణలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. చైతన్యపురిలోని మహాశక్తి ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠాపన, శ్రీబాలా త్రిపుర సుందరీదేవి (శైలపుత్రి) అలంకరణ చేశారు. గణపతి పూజ, మాతృకపూజ, అంకురారోపణము, అఖండ దీపారాధనలు, చతుషష్టి, ఉపచార పూజ, ఫలరసపంచామృతాభిషేకం నిర్వహించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ భవానీ మాల స్వీకరించారు. రామేశ్వరాలయంలో మొదటి రోజు అమ్మవారు పర్వతవర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. కూడళ్లలో నెలకొల్పిన దుర్గామాత మండపాల వద్ద వైభవంగా పూజలు జరిగాయి. భగత్‌నగర్‌లో నెలకొల్పిన మండపవద్ద పూజల్లో మేయర్ సునీల్‌రావు దంపతులు తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్


బోయివాడలో..


టవర్ సర్కిల్‌లో..


రామేశ్వరాలయంలో..


చెర్లభూత్కూర్‌లో..


ఎలబోతారంలో..


దుర్శేడ్‌లో..


గంజ్‌లోని భగత్‌సింగ్ విగ్రహం వద్ద..


గంజ్ ప్రాంతంలో..


బొమ్మకల్‌లో..

దుర్గాభవానీ ఆలయంలో..


బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై..

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో నవరాత్రుల తొలిరోజైన ఆదివారం దుర్గాభవానీ అమ్మవారు బ్రహ్మీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పవనకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. కలశస్థాపన, చతుషష్ట్యుపచార పూజ, గోపూజ, చండీహోమం, కన్యాసువాసినీ పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీరె సారె పెట్టి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వినోద్‌కుమార్, సునీల్‌రావు

కరీంనగర్: కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నవంబర్ 4న కుల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగనున్న తెలంగాణ ప్రజాగర్జన బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆదివారం ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ , మేయర్ వై.సునీల్‌రావులు క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కుల, ప్రజా సంఘాలు మంచి కార్యక్రమం తీసుకున్నందుకు నాయకులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని అన్నారు. బహిరంగ సభకు కుల, ప్రజా సంఘాలు, కార్మికులు, కవులు, మేధావులు పెద్ద ఎత్తున హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల, ప్రజా సంఘాల నాయకులు జీఎస్.ఆనంద్, కలర్ సత్తన్న, మహమ్మద్ షుక్రోద్దీన్, ఎండీ బషీర్, రమేశ్‌గౌడ్, సముద్రాల అజయ్, స్వరూప, లత, మల్లన్న, ప్రభాకర్, మల్లక్క, నర్సయ్య, శ్రీనివాస్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు 'సంచారం' పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 17న కవి అన్నవరం దేవేందర్ రచించిన 'సంచారం' యాత్ర వ్యాసాగ్రంథాన్ని సోహితి సోపతి ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు సభా సంచాలకుడు కూకట్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. పుస్తకావిష్కరణకు పెద్దపల్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్‌తో పాటు బీఎస్.రాములు, స్వర్ణకిలారి, గులాబీల మల్లారెడ్డి, గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్, పొన్నం రవిచంద్ర, కందుకూరి అంజయ్య, బూర్ల వెంకటేశ్వర్లు, సీవీ కుమార్‌లు అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

అల్ఫోర్స్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కొత్తపల్లి: కరీంనగర్ భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్‌లో ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. లయన్స్ క్లబ్‌ఆఫ్ శాతవాహన, అల్ఫోర్స్ విద్యా సంస్థలు సంయుక్త నిర్వహణలో ప్రారంభమైన శిక్షణ తరగతులను ఆదివారం అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డితో కలిసి 320జీ గవర్నర్ రాజిరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు యాదగిరిశేఖర్ రావులు ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకనుగుణంగా విద్యా బోధన చేస్తూ విద్యార్థులు రాణించేలా కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రక్రియపై దృష్టి పెట్టాలని సూచించారు. లయన్స్ క్వెస్ట్‌ను అమలుపరుస్తూ విద్యార్థులకు విస్తృతంగా అవగాహన పెంపొందిస్తున్నందుకు డా.నరేందర్ రెడ్డిని లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు కెప్టెన్ బి.మధుసూదన్‌రెడ్డి, శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, మహేందర్, సత్యనారాయణ, అరవింద్, రమేశ్, ట్రైనర్ రేణుక, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గం

కరీంనగర్: నగరంలోని 2వ డివిజన్ విద్యారణ్యపురి రోడ్ నం.1కాలనీలో బీసీ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఆదివారం కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అల్సా లక్ష్మీనారాయణ, బాలెంగుల హనుమయ్య, అధ్యక్షుడిగా జడల రఘునందన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నర్సింగ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా అంబాదాస్, జనరల్ సెక్రెటరీగా కోరెపు లక్ష్మయ్య, కోశాధికారిగా బూర్ల సతీశ్, జాయింట్ సెక్రెటరీగా గౌడ మార్కండేయ, ముద్దసాని ఐలయ్య, ముఖ్య సలహాదారులుగా వెల్దండి చంద్రయ్య, డైరెక్టర్స్‌గా పోలోజు లక్ష్మణాచారి, పదాల శ్రీనివాస్, దుబ్బాక దేవేందర్, కొమురయ్య, జంగా శంకర్, పులరావు, గందె కోటేశ్వర్‌రావు, ఆంజనేయులు, భరత్ మల్లేశం, బొజ్జా అనిల్‌లు ఎన్నికయ్యారు. కాలనీ అభివృద్ధి కోసం బీసీ కుల బాంధవులు సమష్టిగా సమావేశమై రూ.50 వేలను పోగు చేసుకొని కాలనీ అభివృద్ధికి వెచ్చించాలని నిర్ణయం తీసుకున్నారు.

వైభవంగా శ్రీచక్ర ఊరేగింపు



గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామంలో గల శ్రీమానసాదేవి ఆలయంలో ప్రతిష్ఠించే శ్రీచక్రంను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం గుండ్లపల్లి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆలయ పూజారి మామిడాల నాగసాయిశర్మ ప్రత్యేక పూజలు చేశారు. గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్, జంగపల్లి, హన్మాజిపల్లె, మైలారం, గన్నేరువరం, మాదాపూర్, పారువెల్ల, వద్లూరు గ్రామాల మీదుగా శ్రీమానసాదేవి ఆలయం వరకు మహిళల కోలాటం, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపు సాగింది. ఆయాగ్రామాల భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, సహకార సంఘం చైర్మన్ తన్నీరు శరత్‌రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాంప్ ప్రారంభం


ఎన్‌సీసీ శిక్షణకు హాజరైన కెడెట్లు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్ మైదానంలో ఆదివారం ఎన్‌సీసీ క్యాంపు ప్రారంభమైంది. క్యాంపును కల్నల్ డానియల్ లాటిజెన్ ప్రారంభించిన మాట్లాడుతూ క్రమశిక్షణ, దేశభక్తి, విధేయత, బాధ్యత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. 40 రోజులు పాటు జరిగే శిక్షణలో ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంపై అవగాహన కల్పిస్తామన్నారు. క్యాంపులో పాల్గొంటున్న 500 మంది కెడెట్లకు ముగింపు రోజున సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. సర్దార్ మజర్ సాగర్‌సంగ్, కెప్టెన్ సింగేస్, ఏఎన్‌ఓ త్రివేణి, హరీశ్‌బాబు, ఉదయతె, సత్యప్రకాష్, కేర్ టేకర్ పాల్గొన్నారు.

చెస్ పోటీలకు స్పందన



కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లాకేంద్రంలోని జ్యోతినగర్‌లో ఉన్న జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫిడే రేటింగ్ సెలక్షన్ చదరంగ టోర్నమెంటు పేరుతో అండర్‌- 7,9,11,13,15 విభాగాల్లో బాల, బాలికలకు చదరంగ పోటీలను ఆదివారం నిర్వహించడం జరిగిందని జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్లు కంకటి కనుకయ్య, కంకటి అనూప్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని ఔత్సాహికులైన చదరంగ క్రీడాకారులు ప్రతిభను మెరుగు పెట్టేందుకు క్రమ జీనియస్ అకాడమీ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. విజేతలైన క్రీడాకారులకు బహుమతులతో పాటు టాప్–3లో నిలిచిన క్రీడాకారులకు అతిత్వరలో కరీంనగర్‌లో జరుగబోయే ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌కు ఎంట్రీ ఫీజును జీనియస్ అకాడమీ చెల్లించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీల్లో టాప్–3లో సీహెచ్ కశ్యప్, ఎస్.నాగచైతన్య, అభిరాం నిలువగా అండర్–7,9,11,13, 15 విభాగాలలో టాప్–3లో నిలిచిన క్రీడాకారులకు మొత్తంగా 30పైగా మెమొంటోలను, నగదు బహుమతులు కంకటి కనుకయ్య విజేతలకు అందించారు. సృజన్, తరుణ్, అభిరాం, రేవిక్, నితిన్, విశ్వప్రకాశ్‌బాబులు పాల్గొన్నారు.

యోగా 'నగర్'

- రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కరీంనగర్ ఆతిథ్యం
- ఇప్పటికే రెండు సార్లు నిర్వహణ
- ఈనెల 18, 19 తేదీల్లో మరోసారి రాష్ట్రస్థాయి పోటీలు
- 15 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు రాక


2021లో జరిగిన 8వ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చాంపియన్‌షిప్‌ను సాధించిన జిల్లా జట్టు (ఫైల్)

కరీంనగర్‌స్పోర్ట్స్: ప్రస్తుత కాలంలో యోగాకు యమ క్రేజీ పెరిగింది. యావత్ ప్రపంచం యోగా జపం చేస్తున్నారు. అందరికీ యోగా అవసరం అనే కాన్సెప్ట్‌తో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నారు. ఇక కరీంనగర్‌లో జరిగే యోగా పోటీల గురించి చెప్పాలంటే రాష్ట్రంలో ఎవరిని అడిగినా ఇట్టే చెప్పేస్తారు. యోగాలో అంతటి క్రేజీ సంపాదించుకుంది మన స్మార్ట్‌సిటీ. తెలంగాణ ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటివరకు రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం ఇవ్వగా ఈనెల 18, 19 తేదీల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలతో మరోమారు వేదిక కానుంది. 17 ఏళ్ల నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఆదిపత్యాన్ని చెలాయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. 2005 నుంచి 2022 వరకు 17 ఏళ్ల కాలంలో 15సార్లు చాంపియన్‌గా నిలవడం విశేషం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొమ్మిదిసార్లు (కరోనా కారణంగా ఒకసారి పోటీలు జరగలేదు) రాష్ట్రస్థాయి పోటీలు జరుగగా వరుసగా 8సార్లు విజేతగా నిలిచి రికార్డు సృష్టించింది. యోగాలో ఎంతో ఘన చరిత్ర ఉన్న కరీంనగర్ జిల్లా 18 నుంచి జరిగే 10వ రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్‌పై కన్నేయగా.. పోటీల వివరాలపై ప్రత్యేక కథనం.

15 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారుల రాక

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ నెల 18 నుంచి జరుగనున్న 10వ రాష్ట్రస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రంలోని 15 జిల్లాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారులు, 50 మంది అధికారులు రానున్నట్లు యోగా సంఘం కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. 8-10, 10-12, 12-14, 14-18, 18-21, 21-25, 25-30, 30-35, 35-45, 45 ఏళ్ల వయస్సు విభాగాల్లోనే కాక కోచ్‌లు, మేనేజర్లు, జడ్జిలకు వేరుగా ప్రొఫెషనల్ విభాగంలో పోటీలు జరుగుతాయని అన్నారు. అదేవిధంగా రిథమిక్, ఆర్టిస్టిక్ కేటగిరీలో 8–18, 18–35 ఏళ్ల వారికి పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాణించిన క్రీడాకారులను నవంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే జాతీయ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

రెండు సార్లు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ

జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఏటా జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావంకు ముందు పలుసార్లు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2017, 2021లలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా పేరుగడించింది. కాగా ఈనెల 18, 19 తేదీల్లో జరుగనున్న 10వ రాష్ట్రస్థాయి యోగా పోటీల నిర్వహణతో మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు కరీంనగర్ వేదికగా నిలవడం విశేషం



.8 సార్లు చాంపియన్ మనమే..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం 9సార్లు రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. 2014లో మహబూబ్‌నగర్, 2015లో నిజామాబాద్, 2016లో ఆదిలాబాద్, 2017లో కరీంనగర్, 2018లో పెద్దపల్లి, 2019లో సరూర్‌నగర్, 2021లో కరీంనగర్, 2022లో రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో పోటీలు జరిగాయి. ఇందులో కరీంనగర్ జిల్లా జట్టు 8సార్లు వరుసగా చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించింది.

వరుసగా చాంపియన్‌షిప్..



రాష్ట్రంలో కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులకు తిరుగులేదు. అందుకు నిదర్శనం జట్టు సాధిస్తున్న విజయాలే. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి విజేతగా నిలుస్తున్నాం. యోగాలో రాష్ట్రంలో తిరుగులేని జిల్లాగా పేరు సంపాదించుకున్నాం. 10వ రాష్ట్ర పోటీల్లోనూ విజయం సాధిస్తాం. – ఎస్.సిద్ధారెడ్డి, యోగా సంఘం ప్రధాన కార్యదర్శి

యోగా క్రీడాకారుల కేంద్రంగా..



కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులకు నిలయంగా మారింది. రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్ షిప్ తో పాటు ఏటా జాతీయ స్థాయి పోటీల్లో చాలా మంది క్రీడాకారులు పాల్గొని సత్తా చాటుతున్నారు. జాతీయ పోటీలు ఎక్కడ జరిగినా కరీంనగర్ క్రీడాకారులు ఉండాల్సిందే. – రామకృష్ణ, కోచ్

జాతీయస్థాయిలో పతకమే లక్ష్యం



జాతీయస్థాయి యోగా చాంపియన్ షిప్ పోటీల్లో విజయం సాధించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఫస్ట్ వచ్చా. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ఫస్ట్ వచ్చి జాతీయపోటీలకు ఎంపికై పతకం సాధిస్తా. – డి.స్ఫూర్తి, క్రీడా పాఠశాల విద్యార్థి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తాం

గంగాధర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలతో పాటు మూడోసారి అధికారంలోకి రాగానే చేపట్టే సంక్షేమ పథకాల గూర్చి ప్రజలకు వివరించి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ద్యావ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చొప్పదండి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్ గెలుపు కోసం ఆరు మండలాల కార్యకర్తలు, నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు గెలుపు కోసం అమలుకాని హామీలు ఇస్తున్నారని విమర్శించారు.

క్లుప్తంగా...

2014 నుంచి చేయలేనిది 2023లో చేస్తారా?

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కన్న తల్లికి అన్నం పెట్టని వాడు, చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుగా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఎద్దేవాచేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోపై అరుణ స్పందిస్తూ 2014 నుంచి కేసీఆర్ సీఎంగా ఉండి చేయలేని పనులు, 2023లో చేస్తానంటే తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైపోయిందని ప్రశ్నించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు కేవలం తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేయడానికి తప్ప, నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశం కేసీఆర్‌కు లేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేస్తానని చెప్పి, ఇంత వరకు దాని దిక్కు మొక్కు లేకుండా చేసిన ఘనుడు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కేసీఆర్ సర్కార్ చేసిన అభివృద్ధి ఏమి లేదు కాబట్టి, కేవలం ఉచిత పథకాలను నమ్ముకుని ఎన్నికలకు పోయేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఉన్న వారికి ఉచితాలు ప్రకటించడం పక్కన పెట్టి, మొదట రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకం తెలంగాణలో అమలవుతోందా? ఒకవేళ అమలైతే, ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో ఎంత వరకు ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నారో వెల్లడించాలని అరుణ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇంటి స్థలాలు!

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని, ఈ విషయాన్ని శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో కమిటీకి నివేదిస్తామని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు డెక్కన్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బొల్లోజు రవి, ఉపాధ్యక్షుడు మరిపాల శ్రీనివాస్, కోశాధికారి చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు జి.ప్రతాప్‌రెడ్డి, దండ రామకృష్ణ, సభ్యులు క్రాంతి, పోలంపల్లి ఆంజినేయులు తదితరులు ఆదివారం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని చేర్చాలని ఆయన్ను కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు పట్ల కాంగ్రెస్ సానుకూలంగా ఉందని రేవంత్ హామీనిచ్చారు.

2017లోనే 'స్కిల్' కేసు

నమోదు, దర్యాప్తు మొదలైంది అప్పుడే

- స్పష్టం చేస్తున్న కేంద్ర జీఎస్టీ డీజీ లేఖ
- అప్పట్లోనే రాష్ట్రానికి సమాచారమిచ్చినా.. కేసును తొక్కిపెట్టిన టీడీపీ సర్కారు
- పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుంది
- చంద్రబాబుకు '17ఏ'వర్తించదని నిపుణుల స్పష్టీకరణ


DIRECTORATE GENERAL OF GST INTELLIGENCE,
Pune Zonal Unit,
'A' Wing, 3rd Floor, GST Bhawan
F.No: DGGI/PRU/AN/142/2017
To : The Principal Director General, DGGSTI, New Delhi
From: Additional Director General, DGGSTI, PZU
INCIDENT REPORT NO. 22/ST/2017-18
Name and address of the assessee: M/s Skiller Enterprises India Pvt Ltd (formerly known as PVSP IT Skills Projects Pvt Ltd) 316/ 274 Second Floor, West End Marg, Saidulajab, New Delhi-110030
Service Tax Registration No. AAICP2127JSD001
Range-60, Hauz Khas New Division, Central GST Delhi

స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదయ్యిందని కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ 2018 ఫిబ్రవరిలో అప్పటి టీడీపీ ప్రభుత్వానికి రాసిన లేఖ

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిన మాజీ సీఎం చంద్రబాబు 'సెక్షన్ 17ఏ'ను సాకుగా చూపిస్తూ విచారణను అడ్డుకునేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. ఈ కేసు 2020లో నమోదైందని బుకాయిస్తున్న టీడీపీ వాదనకు కేంద్ర జీఎస్టీ విభాగం లేఖ ద్వారా తెర దించింది. టీడీపీ సర్కారు హయాంలోనే స్కిల్ స్కామ్ మూలాలు వెలుగులోకి వచ్చాయని, దీనిపై 2017లోనే కేసు నమోదైందని ఆ లేఖలో స్పష్టం చేసింది. జీఎస్టీ విభాగం లేఖ వెలుగులోకి రావడంతో ఈ కేసులో కీలక ప్రశ్నలకు సమాధానాలు దొరికినట్టైంది.

సాంకేతిక సాకు ఎత్తుగడ

స్కిల్ స్కామ్‌లో చంద్రబాబును అరెస్ట్ చేయాలంటే గవర్నర్ అనుమతి అవసరమంటూ టీడీపీ వ్యూహాత్మకంగా ఓ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. సీమెన్స్‌కు తెలియకుండా, ఆ కంపెనీ ముసుగులో సాగించిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని టీడీపీ గానీ ఆయన న్యాయవాదులు గానీ చెప్పే సాహసం చేయలేకపోతున్నారు. 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చిన 17 ఏ సెక్షన్ ప్రకారం చంద్రబాబుకు రాజ్యాంగ రక్షణ లభిస్తుందని మాత్రమే అడ్డగోలుగా వాదిస్తున్నారు.

2017లోనే కేసు నమోదు..

చంద్రబాబు బృందం ఎతుగడలను కేంద్ర జీఎస్టీ విజిలెన్స్ విభాగం చిత్తు చేసింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ డైరెక్టర్ జనరల్ (డీజీ) రాసిన లేఖ తాజాగా వెలుగులోకి రావడంతో టీడీపీ పన్నాగం బెడిసికొట్టింది. స్కిల్ స్కామ్ కేసు 2017లోనే నమోదై దర్యాప్తు కూడా అప్పుడే మొదలైనట్లు స్పష్టమైంది. కాబట్టి చంద్రబాబుకు సెక్షన్ 17ఏ వర్తించదని తేటతెల్లమైంది. 2017 మేలో పుణెలో కొన్ని షెల్ కంపెనీల్లో నిర్వహించిన తనిఖీల్లో జీఎస్టీ విభాగం భారీ అక్రమాలను గుర్తించింది. నకిలీ ఇన్వాయిస్‌లతో జీఎస్టీ ఎగవేతకు పాల్పడ్డ కంపెనీలను గుర్తించి విస్తృతంగా సోదాలు జరిపింది. వీటిలో స్కిల్లర్ అనే కంపెనీ కూడా ఉంది. దీనిపై నాడే తీగలాగడంతో చంద్రబాబు ప్రభుత్వ అవినీతి డొంకంతా కదిలింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఏపీఎస్ఎస్‌డీసీ) పరికరాలను సరఫరా చేసినట్లు చూపించేందుకు నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించినట్లు తేలింది. ఆ ఇన్వాయిస్‌లను చూపించే ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి నిధులు పొందినట్లు నిర్ధారణ అయింది. దీనిపై జీఎస్టీ విభాగం 2017 మే నెలలోనే కేసు నమోదు చేసింది. పూర్తి స్థాయిలో విచారించి ఆధారాలతో సహా కుంభకోణాన్ని బట్టబయలు చేసింది.

పాత కేసులకు పాత చట్టమే

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులు దారి మళ్లడంపై విచారించాలని సూచిస్తూ ఏపీ ఏసీబీ విభాగానికి 2018 ఫిబ్రవరిలోనే సమాచారం ఇచ్చింది. ఈమేరకు కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ లేఖ రాశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. చంద్రబాబు ఒత్తిడితో ఏసీబీ విభాగం ఆ కేసును తొక్కిపెట్టింది. అంటే స్కిల్ స్కామ్ బయటపడింది... కేసు నమోదైంది 2017లోనే అని స్పష్టమవుతోంది. అప్పటికి 17ఏ సెక్షన్ అమలులోకి రాలేదు. ఆ సెక్షన్ 2018 జూలైలో చేయగా 2018 నవంబరు నుంచి అమలులోకి వచ్చింది. కాబట్టి స్కిల్ స్కామ్ కేసులో నిందితుడు చంద్రబాబుకు 17ఏ సెక్షన్ కింద రక్షణ లభించదన్నది నిర్ధారణ అయినట్టేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాత కేసులకు పాత చట్టమే వర్తిస్తుందని తేల్చి చెబుతున్నారు. అవినీతికి పాల్పడి ఆధారాలతోసహా అడ్డంగా దొరికిన చంద్రబాబు సాంకేతిక సాకులతో తప్పించుకునేందుకు చేస్తున్న యత్నాలు ఫలించవని వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర జీఎస్టీ ఇంటలిజెన్స్ విభాగం డీజీ లేఖతో చంద్రబాబు కుట్ర బెడిసికొట్టినట్టేనని చెబుతున్నారు.

శ్రీవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేందర్‌నాథ్‌రాయ్, జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.


ఆలయం వెలుపల జస్టిస్ మానవేందర్‌నాథ్ రాయ్



కుటుంబ సభ్యులతో జస్టిస్ రవీంద్రబాబు, కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు

పెట్టుబడుల పరుగులు..

- ఏపీలో మరో రూ.1,624 కోట్లు వాస్తవ రూపంలోకి..
- నేడు సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నాలుగు యూనిట్ల ప్రారంభోత్సవాలు..



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: ఏపీ ప్రభుత్వం కృషి ఫలితంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మరో రూ.1,624 కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రానున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటనలో పలు ఐటీ, ఫార్మా కంపెనీల ప్రారంభోత్సవాలు, భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రధానంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు ఐజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమి టెడ్, లారస్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 4,160 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. సీఎం సోమవారం ప్రారంభించే, భూమి పూజ నిర్వహించే యూనిట్ల వివరాలివీ..

ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్..

విశాఖపట్నంలోని మధురవాడ ఐటీ హిల్ నెంబర్-2లో ఇన్ఫోసిస్ ఒక కొత్త డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. సుమారు రూ.41కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను భవిష్యత్తులో మరింత విస్తరించనున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా పనిచేస్తుంది. దీని ఇంటీరియర్ డిజైన్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైబ్రీడ్ వర్క్‌ప్లేస్‌గా రూపొందించారు. దాదాపు వెయ్యి మంది ఈ సెంటర్ నుంచి పనిచేయనున్నారు.

ఇజియా స్టెరిల్స్ ప్రైవేట్ లిమిటెడ్..

ఫార్మా, బయెటెక్ ఉత్పత్తులకు సంబంధించి రూ.300.78 కోట్లతో పరవాడ ఫార్మాసిటీలో నిర్మించిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఇజియా (ఈయూఐజీఐఏ) యూనిట్‌ను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. ఈ యూనిట్ ద్వారా 800 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

లారస్ సింథసిస్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్..

యాక్టివ్ ఫార్మాస్యుటికల్ ఇంగ్రిడియంట్ (ఏపీఐ) ఉత్పత్తులకు సంబంధించి రూ.421.70 కోట్లతో అచ్యుతాపురంలో నిర్మించిన ఈ యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. దీని ద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాల కల్పన జరగనుంది. ఇదే కంపెనీ మరో 15 ఎకరాల్లో రూ.407.40 కోట్లతో ఏర్పాటు చేసే యూనిట్ నిర్మాణ పనులకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్..

అచ్యుతాపురం ఏపీ సెజ్‌లోని లారస్ ల్యాబ్స్‌లో నిర్మించిన అదనపు భవన సముదాయాన్ని, యూనిట్-2 ఫార్ములేషన్ బ్లాక్‌ను కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. రూ.460 కోట్లతో ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతోపాటు రూ.407.40 కోట్లతో లారస్ ల్యాబ్స్ కొత్త పరిశ్రమకు కూడా సీఎం భూమిపూజ చేస్తారు. బీచ్ క్లీనింగ్ కోసం జీవీఎంసీ కొనుగోలు చేసిన ప్రత్యేక వాహనాల్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

వాళ్లు చస్తే నా డబ్బులతో బీమా చెల్లిస్తా..

- సీఎం కుటుంబంపై ఎంపీ అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ మేనిఫెస్టో చించివేత



డిచ్‌పల్లి (నిజామాబాద్‌రూరల్): సీఎం కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కూతురు కవిత చనిపోతే తన సొంత డబ్బులతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షలు బీమా కింద ఆ కుటుంబానికి చెల్లిస్తానని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. తెల్ల రేషన్‌కార్డుదారులు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇస్తామని బీఆర్ఎస్ ప్రకటించడంపై మండిపడ్డారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయని సీఎం కేసీఆర్.. ఇప్పుడు ప్రకటించిన కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఇదొక చెత్త మేనిఫెస్టో అంటూ బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఎంపీ చించివేశారు. గతంలో తనను చెప్పుతో కొడతానని ఎమ్మెల్సీ కవిత అన్నారని, ఆమెను నలిపి బయటపడేస్తానని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సీఎం కేసీఆర్ కంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పెద్ద అవినీతిపరుడని, కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం పాతాళానికి పోతుందన్నారు. ఒకవేళ రాష్ట్రంలో హంగ్ వచ్చినా బీజేపీదే అధికారమని అర్వింద్ అన్నారు.

బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ: రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో తాను బీజేపీ టికెట్‌పై మునుగోడు నుంచే పోటీ చేస్తానని బీజేపీ నేత, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు సీఎం కేసీఆర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలను నమ్మరని, వాళ్లిద్దరూ ఒక్కటేనన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే పార్టీనని 2018 ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరడమే ఇందుకు తార్కాణమన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో తాను ఓడిపోయినప్పటికీ తనకు 87 వేల ఓట్లు వేసి నైతిక విజయం మునుగోడు ప్రజలు ఇచ్చారన్నారు.

బాసరలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


గంగహారతిలో పాల్గొన్న రామారావుపటేల్

భైంసా(ముధోల్): బాసరలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ప్రారంభించారు. ఆదివారం వేకువజామున 4 గంటలకే అర్చకులు కలశాలతో ఆలయానికి వెళ్లి ఉత్సవాలకు అంకురార్పణచేశారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మతల్లికి పూజలుచేసి సూర్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు క్యూలైన్‌లలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి రోజు సైతం అక్షరాభ్యాస పూజలు జరిగాయి.

గంగహారతి...

బాసరలో నవరాత్రుల ప్రారంభాన్ని పురస్కరించుకుని బాలబ్రహ్మచారి గంగేశ్వర్ మహారాజ్(మద్నాపూర్) ఆధ్వర్యంలో నిర్వహించిన దిండిపాదయాత్ర బాసరకు చేరుకుంది. గోదావరి నది తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి గంగహారతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

గంగను చేరిన గౌరమ్మ..





'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో..' అంటూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఆదివారం మహిళలు, యువతులు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఆయా కాలనీల నుంచి బతుకమ్మ పాటలకు కోలాటాలు ఆడుతూ గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు శోభాయాత్రగా చేరుకున్న మహిళలు, యువతులు ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం గడ్డెన్నవాగు ప్రాజెక్టు నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. - భైంసాటౌన్



బీఎడ్‌లో ప్రవేశాలకు 17న ఎంపిక

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ బీఎడ్ కళాశాలలో 2023-25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక ఈనెల 17న ఉదయం 10గంటలకు ఉంటుందని పీవో చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని బీఎడ్ కళాశాలలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

బీజేపీ వీడే ప్రసక్తే లేదు

- ఎంపీ సోయం బాపూరావు


మాట్లాడుతున్న ఎంపీ బాపూరావు

ఆదిలాబాద్: గిరిజన బిడ్డనైన తనను ఢిల్లీ వరకు తీసుకెళ్లిన బీజేపీని వీడే ప్రసక్తి లేదని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ మార్పుపై తనపై వస్తున్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపించి, అభ్యర్థులను అసెంబ్లీలో కూర్చోబెడతానని పేర్కొన్నారు. నగదు పంచే సంస్కృతిని బీఆర్ఎస్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఒక పీఎం స్థాయి వ్యక్తి ఎవరికీ డబ్బులు పంచరని, కేవలం ప్రజా సంక్షేమం గురించి మాత్రమే ఆలోచిస్తారన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని, తమ పార్టీ అధికారంలోకి రావాలని అటు ప్రజలు, బీజేపీ కార్యకర్తలు కోరుకుంటున్నారని వెల్లడించారు. ఆదిలాబాద్‌లో ఎన్నికల వేడి మొదలైందని, ఈ దిశగా ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బీజేపీపై సోషల్ మీడియాలో విభేదాలు ఉన్నట్టు సృష్టిస్తున్నారన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా వాటిని తిప్పికొట్టాలన్నారు. బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, ఆదినాథ్, చిట్యాల సుహాసినిరెడ్డి, బోయర్ విజయ్, మయూర్ చంద్ర తదితరులు ఉన్నారు.

'గౌరవెల్లి' బాధ్యత నాదే..!


హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ బీఫాం ఇస్తున్న సీఎం కేసీఆర్


సభకు హాజరైన జనం

- ఆరు నెలల్లో పూర్తి చేస్తాం
- లక్ష ఎకరాలకుపైగా నీరు అందిస్తాం
- హుస్నాబాద్ సభలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ
- ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు జనం మధ్యే బీఫాం అందజేత

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని సీఎం కేసీఆర్ అన్నారు. ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడారు. సభలో సీఎం కేసీఆర్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రతిపక్షాలు కుట్రలు చేసి, కేసులు వేసి అడ్డుకున్నప్పటికీ ఒక్కొక్కటిగా అధిగమిస్తూ పనులు పూర్తి చేశామని, మెయిన్ కెనాల్ మాత్రమే పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. ఎన్నికల తర్వాత 6 నెలల్లో పూర్తి చేసి తానే వచ్చి ప్రాజెక్టును ప్రారంభిస్తానన్నారు. ఈ ప్రాజెక్టుతో 1.06లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. మహాసముద్రం గండిని పూడ్చాలని కెప్టెన్ లక్ష్మీకాంతారావు తన దృష్టికి తెచ్చినప్పుడు తనతోపాటు తన మిత్రుడు కవ్వ లక్ష్మారెడ్డితో కలిసి గండిని పరిశీలించి నిర్మాణ పనులు చేపట్టామని గుర్తు చేశారు. మహాసముద్రం గండి నిండటంతో భూగర్భ జలాలు పెరిగి పంటలకు కావాల్సిన నీళ్లు అందుతున్నాయన్నారు. కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయ జాతరకు తను వచ్చి మిఠాయిలు తిన్నానని నాటి జ్ఞాపకాలను సీఎం గుర్తు చేస్తుకున్నారు. దేవాలయాలన్నీ అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో కొత్త బస్టాండ్, ఎల్కతుర్తిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే సతీష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల మధ్యే సతీశ్‌కుమార్‌కు బీ ఫారం అందజేశారు.

నాటి కలలు సాకారం

- మంత్రి హరీశ్‌రావు

ఒకప్పుడు హుస్నాబాద్ కరువుపీడిత, కల్లోల ప్రాంతంగా ఉండేదని, ప్రస్తుతం పచ్చటి పొలాలతో కళకళలాడుతున్నదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి నీళ్లు, రెవెన్యూ డివిజన్, డీఎస్పీ, మున్సిపాలిటీ, కొత్తగా అక్కన్నపేట మండలం ఇలా అనేక కలలు సాకారమయ్యాయని అన్నారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మచ్చలేని నాయకుడన్నారు. వచ్చే ఎన్నికల్లో అక్కడ కేసీఆర్, ఇక్కడ సతీశ్‌కుమార్‌కు హ్యాట్రిక్ అందించేలా తీర్పు ఉండాలని మంత్రి హరీశ్‌రావు ప్రజలను కోరారు.

90 శాతం ఓట్లు మనకే పడాలి..

20ఏళ్ల క్రితం తెలంగాణ తెస్తామని గులాబీ జెండా పట్టి ప్రత్యేక రాష్ట్రం తెచ్చామని, అలాగే అభివృద్ధి చేశామని, 24గంటలూ కరెంట్, నీళ్లు ఇస్తున్నామని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు. చెప్పినవన్నీ చేశామని తెలిపారు. నూటికి తొంభై శాతం ఓట్లు బీఆర్ఎస్‌కే పడేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యు డు కేశవరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సిద్దిపేట జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనకు లక్షలాదిగా తరలిరావాలి

- ప్రజా సంఘాల చైర్మన్ గజ్జెల కాంతం


మాట్లాడుతున్న గజ్జెల కాంతం

గొల్లపల్లి: నవంబర్ 4న కరీంనగర్ అంబేద్కర్‌స్టేడియంలో జరిగే తెలంగాణ ప్రజాగర్జన బహిరంగసభకు లక్షలాదిగా ప్రజలు తరలిరావాలి వచ్చి విజయవంతం చేయాలని ప్రజా సంఘాల చైర్మన్ గజ్జెల కాంతం కోరారు. గొల్లపల్లిలో ఆదివారం మండలంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దేశ సంపదను అమిత్ షా బినామి అయినటువంటి గౌతమ్ అదానీకి కట్టబెడుతున్నారని బీజేపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. 33శాతం మహిళా రిజర్వేషన్లు ప్రకటించిన మోడీ కులాలవారిగా వాటాలను తేల్చాలని హెచ్చరించారు. దేశంలో దళితులకు రక్షణలేకుండా పోయిందని, బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ని దేశం నుంచి తరిమికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పేట భాస్కర్, ప్రధాన కార్యదర్శి హన్మండ్లు, జిల్లా అధ్యక్షుడు పవన్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెవులమద్ది వినోద్, టీపీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరేశ్, మంతెన లక్ష్మణ్ పాల్గొన్నారు.

సన్నిధి

మంచిమాట

ఏడవలేక నవ్వటం



మనుషులు ఏడవ లేక పోవటం వల్ల నవ్వుతారు అంటాడు జార్జ్ బెర్నార్డ్ షా. నిజమే కదా! పిల్లలు కింద పడి దెబ్బతగిలితే ఏడుస్తారు. పెద్దవాళ్ళకి ఆ ధైర్యం ఉండదు. పైకి ఏడవరు. ఎవరు ఏమనుకుంటారో అని సంకోచం. ఇతరుల అభిప్రాయాల కోసం బతకటం అల వాటు అవుతుంది ఎదుగుతున్న కొద్దీ. చిన్న పిల్లలకి ఆ బాధ లేదు. తమ నొప్పి మాత్రమే వాళ్ళకి ప్రధానం. భావాలని దాచుకోవటం తెలియదు. అవసరం లేదు.

బాల్యావస్థ దాటి ఎదుగుతున్న కొద్దీ ఇతరులు తనని గురించి ఏమనుకుంటున్నారో అన్న దానికి ప్రాధాన్యం ఇవ్వటం ఎక్కువ అవుతూ ఉంటుంది. తన ప్రవర్తన మార్చుకునే ఉద్దేశం ఉండదు గాని, అందరు తనని గొప్పవాడుగా భావించాలనే తపన ఉంటుంది. దాని కోసమే నటించటం. ఏడుపు వచ్చినా దాన్ని అదుపులో పెట్టి, బాధాప్రక టనకి ఒక మాధ్యమం కావాలి కనుక ఏడుపునే నవ్వుగా మార్చటం జరుగుతుంది. తెలివితేటలు పెరు గుతున్న కొద్దీ ఆ సంఘటనకి రకర కాల చిలవలు పలవలు చేర్చటం కూడా చూస్తాం. తాను కావాలనే పడినట్టు చెప్పటమో, అదే బండి అయితే అది బాగుండ లేదనో, బాగు చేయటానికి ఇస్తే సరిగ్గా చేశారో లేదోనని పరీక్ష చేయబోయాననో చెపుతూ ఉంటారు.

''అసలు దెబ్బ తగలనే లేదు'',

''ఇట్లాంటివి ఎన్ని చూశాం? ఇదొక లెక్కా?''

వంటి వ్యాఖ్యానాలు విషయాన్ని తేలిక చేయటానికి చెప్పినా చెప్పకపోతేనే మర్యాదగా ఉండేది అనిపి స్తుంది.

ఇది నేలమీద పడటం అన్నదానికి సంబంధిం చింది మాత్రమే కాదు. అన్ని విషయాలకి వర్తిస్తుంది. ఆర్థికంగా కాని, వ్యాపారపరంగా కాని, ఉద్యోగపరంగా కాని, కుటుంబపరంగా కాని, మరేదైనా కాని, దెబ్బ తగిలినప్పుడు గుట్టుగా ఉండటం మంచిదే కాని, అదేదో ఘనతగా చెప్పుకోవటం హర్షణీయం కాదు. ఏడిస్తే చూసి సంతోషించేవారు, ఓదార్చి తృప్తిపడే వారు ఉంటారు. మరింత నైతిక ధైర్యాన్ని దిగజార్చే వారూ ఉంటారు. కనుక బాధ పడుతున్నట్టు చెప్పకూ డదు. అసలు విషయం ఏమంటే బాధపడకూడదు. పైకి నవ్వేసి లోపల బాధతో కుమిలి పోవటం మంచిది కాదు.

ప్రస్తుతం మనం సమకాలిక సమాజాన్ని గమనిం చినట్టయితే చాలా మంది మనుషులు నవ్వుతూ కనపడటం ఏడవ లేక మాత్రమే అని అర్థం అవుతుంది. ఆ నవ్వులలో ఏ మాత్రం స్వచ్ఛత కనపడదు. లోపల ఉన్న బాధని, దుఃఖాన్ని, కష్టాలని, దిగులుని, నిరాశా నిస్పృహలని తెచ్చిపెట్టుకున్న నవ్వు వెనక దాచి కనపడతారు. ఆ నవ్వుల్లో జీవం ఉండదు. సహజత్వం ఉండదు. నవ్వు ఒక ముసుగు. నటులు ముఖానికి వేసుకున్న రంగు లాంటిది.

మనోభావాలని యథేచ్ఛగా ప్రకటించ కలిగితే, కనీసం ఆత్మీయుల ముందు గుండెల్లో ఉన్న బరువు తగ్గుతుంది. తరువాత హాయిగా నవ్వగలుగుతాం. ఏడవటం తప్పు కాదే! మనిషికి సహజంగా ఉన్న లక్షణం.

ఒకరు బాగుపడుతుంటే చూసి ఏడవటం తప్పు కాని, కష్టం వచ్చినప్పుడు ఏడవటం మానవ సహజం. శ్రీరామచంద్రుడంతటి వాడే తండ్రి మర ణవార్త విని భోరున విలపించాడు. అది మాన వత్వం. బాధ కలిగినప్పుడు ఏడిచి మనసులో ఉన్న బాధని బయటికి వెళ్ళగక్కకపోతే ఎన్నోరకాల అనా రోగ్యాలు వస్తాయి. గుండె బరువుని తగ్గించి తేలిక పరచకపోతే అది గుండెపోటు, రక్తపోటు, మధు మేహం మొదలైన రూపాంతరాలు చెందుతుంది.

నవ్వు ముఖకండరాలకి మంచి వ్యాయామం. శరీరానికి ఆరోగ్యం. మనస్సుకి రసాయనం ఎదుటి వారికి ఆహ్లాదం. అట్లా ఉండాలంటే ఏడవలేక నవ్వ కూడదు. ఆనందంతో నవ్వాలి.

– డా. ఎన్. అనంతలక్ష్మి

అమృత బిందువులు

దుర్మార్గులతో స్నేహం చేయకూడదు. వాళ్ళతో విరోధం కూడా కూడదు. వారిని పట్టించుకో కుండా ఉండడమే మేలు. నిప్పును పట్టుకుంటే కాలుతుంది. చల్లారిన తర్వాత పట్టుకున్నా మసి అవు తుంది. కనుక దాని జోలికి పోకపోవడమే మేలు.

విలువలేని దుమ్ము కూడా ఒక్కోసారి నీ కంట్లో పడి విలవిలలాడేలా చేస్తుంది. విలువ లేని కొందరు మనుషులు కూడా చాలాసార్లు తమ మాటలతో బాధ పెడతారు. ఊదేసుకుని ముందుకు వెళ్ళడమే ఉత్తముల లక్షణం.

నమ్మకం అనేది గాజు పాత్ర లాంటిది .
గాజుపాత్ర ఒక్కసారి చేతి నుండి కింద పడితే దాన్ని అతికించడం ఎలా అసాధ్యమో, ఒకసారి మనం ఒక వ్యక్తి దగ్గర నమ్మకాన్ని కోల్పోతే మళ్ళీ తిరిగి ఆ నమ్మకాన్ని సంపా దించడం అలా అసాధ్యం... అసంభవం.
కాబట్టి కలుషితమైన ఈ రోజుల్లో కల్మషం లేకుండా నిన్ను ఎవరైనా నమ్మితే ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం నీ ప్రాణాన్ని అయినా పణంగా పెట్టు తప్పులేదు
కానీ నమ్మకాన్ని కోల్పోకు...

వాగ్గేయకార వైభవం

భక్తుడికి ఆహారం భక్తే



యోగరతోవా భోగ రతోవా/ సంగ రతోవా సంగ విహీనః/ యస్య బ్రహ్మణి రమతే చిత్తం/ నందతి నందతి నందత్యేవ... చెరుకు గడను తీసుకొచ్చి కత్తితో నరికినా, మరలోవేసి తిప్పినా, నోటితో కొరికినా... ఎంత హింసించినా తియ్యటి రసాన్ని ఒలికించడం తప్ప అది మరో విధంగా స్పందించదు. కారణం – త్యాగం దాని లక్షణం. ఏ వాగ్గే యకారుడి జీవితం చూసినా ప్రతివారి జీవితంలో ఈ ప్రశాంతత, ఈ కారుణ్యం, ఈ ద్వంద్వాతీత స్థితి, అంద రినీ ప్రేమించగల, అనుగ్రహించగల శక్తి కనపడుతుం టాయి. వాళ్ళు కూడా అంత గొప్పగా ఆ సంగీతంతోనే ఎదిగారు. ఆ సంగీతంతోనే మనల్ని ఉద్ధరించారు.

త్యాగరాజ స్వామి జీవితం వడ్డించిన విస్తరేమీ కాదు. మహారాజుగారు అన్ని కానుకలు పంపితే 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవ సుఖమా నిజ ముగబల్కు మనసా..'' అంటూ వాటిని తీసుకెళ్ళి చెత్తదిబ్బలో పారేస్తాడా ... అని తోడ బుట్టిన అన్నగారికే నచ్చలేదు తమ్ముడి పద్ధతి. 'ఎప్పుడూ ఆ విగ్ర హాలు పట్టుకుని కూర్చుంటాడు. తమ్ముడు కనుక రాజుగారి కొలువులో పాడితే ఎంత హాయిగా జీవించవచ్చు...' అనే భావన అన్నగారిది.

కాదు... సంగీతం మోక్ష సామ్రాజ్యాన్ని ఇవ్వగ లదు. ఇది ఇవ్వగలిగిన ఆనందం వేరొకటి ఇవ్వలేదు. వాగ్గేయకారులకు ఉన్నది సంగీతసాహిత్యాలు మాత్రమే కాదు. నేను పాట రాస్తాను, బాణీ కడ తాను, అంటే ఎవడూ వాగ్గేయకారుడై పోడు. సంగీత సాహిత్యాల్లో అంతర్లీనంగా భక్తి ప్రవహిం చాలి. అది ఎటువంటి భక్తి ...అంటే నువ్వు ఏమయిపోతున్నా... నమ్ముకున్న వాడి చరణాలు వదలలేనిది అది.. అచంచలమైనది... అదే భర్తృహరి మాటల్లో చెప్పాలంటే... నిను సేవిం పగ ఆపదల్ పొడమనీ, నిత్యోత్సవం బబ్బనీ,/జనమాత్రుండననీ, మహాత్ముడననీ, సంసార మోహంబు పై/కొననీ, జ్ఞానము గల్గనీ, గ్రహగతుల్ కుందింపనీ, మేలు వ/చ్చిన రానీ... అంటాడు. ఏది ఏమయిపోయినా ఆ భక్తిలో పరమానందాన్ని పొంది ఎప్పటికప్పుడు లోపల ఈశ్వర గుణానుభవాలు పెరిగి అవి కీర్తనలుగా వెలువడుతుంటే ఆయన వాగ్గేయకారుడు. అంటే భక్తి ప్రధానం.

భక్తుడికి భక్తి అమ్మలాంటిది. పసిబిడ్డకు పాలు ఎలాగో, భక్తు డికి భక్తి అలా ఆహారం. భగవంతుడి పాటలు వింటూ, తాను పాడుకుంటూ, రచన చేస్తూ, స్వరపరుస్తూ, శిష్యులకు చెబుతూ, ఏదీ ఆశించకుండా, ఏది లభిస్తే అది తింటూ, పరమ పవిత్రమైన జీవనాన్ని గడుపుతూ ఆఖరికి తన అవసరం లేదనుకున్నప్పుడు గృహ స్థాశ్రమాన్ని విడిచిపెట్టి సన్యాసాశ్ర మాన్ని స్వీకారం చేసి... భగవంతు డిలో ఐక్యమవుతాడు.

భక్తుడిని వేరొకరు రక్షింపనక్కర లేదు..''వాడిని నా కొరకు రక్షింపవలయు..'' అంటాడు శ్రీమన్నారాయణుడు భాగవతంలో. వాడిని నేను రక్షించేది వాడి కోసం కాదు, నా కోసం..అంటు న్నాడు. నన్ను నమ్ముకున్న వాడినే రక్షించకపోతే ఇక నేను ఉన్నా నని లోకం ఎందుకు నమ్ముతుంది? అందుకని నేనున్నానని జనులు నమ్మడం కోసం.. నాకోసం వాడిని రక్షిస్తున్నా... అంటు న్నాడు. భక్తుని స్థితి అలా ఉంటుంది. వాగ్గేయకారుల అనుభ వాలు కూడా ఇవే.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

తాత్త్వికథ

దూరం... దగ్గర



ఓ విదేశీయుడు భారతదేశంలోని దేవాలయాల ప్రాశస్త్యాన్ని కంప్యూటర్ ద్వారా తెలుసుకున్నాడు. శేషాచలం కొండల్లో నెలవై ఉన్న వేంకటేశ్వరస్వామి అతడిని ఆకర్షించాడు. వెంటనే స్వామిని దర్శించుకోవాలనిపించింది. అనుకున్నదే తడవుగా చెన్నై విమానమెక్కాడు.

పక్కన కూర్చున్న ప్రయాణికుడి సలహా మేరకు విమానా శ్రయం నుంచి కాలి నడకన తిరుమలకి వెళ్ళదలిచాడు. సంప్ర దాయ దుస్తులు ధరించి, భుజానికి సంచీ తగిలించుకుని బయలుదేరాడు.

ఎప్పుడూ చెప్పులు లేకుండా నడవని అతడు, ఎర్రటి ఎండకి కాళ్ళు కాలుతున్నా లెక్కచేయలేదు. స్వామి రూపాన్నే తలుచుకుంటూ ముందుకు నడిచాడు. దారిలో కొండకి నడిచి వెళ్ళే బృందాలు కొన్ని కనిపించాయి. వారితో కలిసి నడవటం కొనసాగించాడు.

అలా మైళ్ళ కొద్దీ ప్రయాణం చేశాక, తిరుచానూరు చేరాడు. తల్లి పద్మావతి అమ్మవారి దర్శనం పూర్తయ్యింది. అమ్మవారి ప్రసాదం తింటూ తలెత్తి చూశాడు. వెండిరంగు లో మిలమిలా మెరుస్తున్న శేషాచలం కొండ చాలా దగ్గరగా అనిపించింది. చిన్న పిల్లవాడిలాగా ఎగిరి గంతులేశాడు.

చకచకా నడుచుకుంటూ తిరుపతి పట్టణంలోని గోవింద రాజస్వామి గుడికి వెళ్ళి దండం పెట్టాడు. అక్కడే నాలుగు ఆధ్యా త్మిక పుస్తకాలు కొని చదువుతూ మళ్ళీ శేషాచలం కొండల వైపు చూశాడు. ఆశ్చర్యం... కొండలు దూరంగా ఉన్నట్లు కనిపించాయి.

ఉండబట్టలేక అతడు, తనతోపాటు నడుస్తూ ఉన్న మరో భక్తుడితో ''అదేమిటండీ...? శేషాచలం కొండలకు దూరంగా ఉంటే, అవి చాలా దగ్గరగా ఉన్నట్లు, దగ్గరికి వెళితే ఎక్కడో... దూరంలో ఉన్నట్లు కనబడుతున్నాయి'' అని ఆసక్తిగా అడి గాడు.

ఆ భక్తుడు చిన్న నవ్వు నవ్వి ''అదే నాయనా శేషా చలం కొండల మహాత్మ్యం. అవి స్వామివారు స్వయంభువుగా వెలసిన పవిత్రమైన కొండలు కదా!

మనం పనుల్లో పడి స్వామిని మరిస్తే 'నీకు దగ్గరే ఉన్నాను, వచ్చిపో రాదా!' అని పిలిచినట్లు అనిపిస్తుంది. దగ్గరికి వెళ్తే 'వచ్చావు కదా, నీ కష్టాలు తీరుతాయిలే...' అని చెప్పి దూరమైనట్లవుతుంది. అయినా... అది చెబితే అర్థమయ్యేది కాదు. అనుభూతి చెందాల్సిందే. అందుకే ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి భక్తులు స్వామి దర్శనానికి పరుగులు తీస్తారు'' అని వివరించాడు.

భక్తిభావంతో ఆ విదేశీయుడి కళ్ళు తడి అయ్యాయి. గట్టిగా గోవిందనామ స్మరణలు చేస్తూ బృందాలతో కలిసి అలిపిరి చేరి మెట్ల మార్గంలో తిరుమలకు చేరాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు



● నంద్ గోపాల్ గుప్తా, అభిషేక్ అగర్వాల్, స్నేహలత, వంశీ, రవితేజ, అను కృతి, గాయత్రీ భరద్వాజ్, నూపుర్ సనన్

ఈ దసరా మీదే

– రచయిత-దర్శకుడు కె. విజయేంద్ర ప్రసాద్



''మణిరత్నంగారి 'నాయగన్' తరహా సినిమాలు తెలుగులో ఎప్పుడు వస్తాయా? అనుకునేవాడిని. 'పుష్ప'తో నెరవేరింది. 'టైగర్ నాగేశ్వర రావు' కూడా అలా అనిపించింది'' అన్నారు రచయిత-దర్శకుడు విజయేంద్ర ప్రసాద్. రవితేజ టైటిల్ రోల్‌లో రూపొందిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె. విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ – ''రవితేజగారు చేసిన 'విక్రమార్కుడు' చిత్రాన్ని తమిళ, కన్నడ, హిందీలో రీమేక్ చేశారు. అయితే ఎవరూ ఆయన్ను మ్యాచ్ చేయలేకపోయారు. రవితేజగారు తెలుగు సినిమాలకే పరిమితమై పోకుండా ఇతర భాషల చిత్రాలు చేయాలని రిక్వెస్ట్ చేస్తున్నాను. 'టైగర్ నాగేశ్వర రావు' ట్రైలర్ చూడగానే ప్రతి ఫ్రేమ్‌ను దర్శకుడు వంశీ అద్భుతంగా తీశారనిపించింది. అభిషేక్ అగర్వాల్‌గారికి మంచి టైమ్ నడుస్తోంది. దసరా పండగ వచ్చింది. దుర్గమ్మ వారికి ఎవడూ ఎదురు నిలబడలేడు. ఆ దుర్గమ్మ తల్లి వాహనం టైగర్ ముందు కూడా ఎవడూ నిలబడలేడు. దసరా మీదే (టైగర్ నాగేశ్వరరావు టీమ్‌ను ఉద్దేశించి)'' అన్నారు. మరో ముఖ్య అతిథి ఉత్తరప్రదేశ్ మంత్రి నంద్ గోపాల్ గుప్తా మాట్లాడుతూ– ''రవితేజగారికి ఉత్తరప్రదేశ్‌లోనూ పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారు. సినీ ఇండస్ట్రీ గర్వపడేలా నా మిత్రుడు అభిషేక్ అగర్వాల్ మరిన్ని సినిమాలు తీయాలి. ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టించాలని కోరు కుంటున్నాను'' అన్నారు. రవితేజ మాట్లాడుతూ– ''టైగర్ నాగేశ్వర రావు' సినిమా కథ విని, ఎగ్జయిట్ అయ్యాను. ఎమోషన్, థ్రిల్.. ఇలా అన్ని రకాల భావోద్వేగాలున్నాయి. సినిమాలో ఉన్నవన్నీ ఒరిజినల్ పాత్రలే. రాజీ పడకుండా ఈ సినిమాను నిర్మించిన అభిషేక్‌గారు 'టైగర్'తో హ్యాట్రిక్ హిట్ సాధించాలి'' అన్నారు. ''తెలుగు సినిమా చరిత్రలో ఇది ఒక బెస్ట్ ఫిలిమ్‌గా ఉంటుంది'' అన్నారు దర్శకుడు వంశీ. ''నాలుగేళ్ల 'టైగర్ నాగేశ్వరరావు' ప్రయాణాన్ని జీవితంలో మర్చిపోలేను'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ వేడుకలో చిత్ర సహ-నిర్మాత మయాంక్, దర్శకులు గోపీచంద్ మలినేని, హరీష్ శంకర్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, టీజీ విశ్వప్రసాద్, సూర్యదేవర నాగ వంశీ, మిర్యాల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



● మహేశ్‌బాబు

పండక్కి పాట?

'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తాజాగా 'గుంటూరు కారం' చిత్రం తెరకెక్కు తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. మహేశ్‌బాబు, ఇతర ప్రధాన తారాగణంపై ఓ ఇంటి సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని తెలిసింది. కాగా ఈ దసరా పండగ సందర్భంగా 'గుంటూరు కారం' నుంచి ఓ పాటను విడుదల చేయాలనుకుంటున్నారని సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

సినిమా

అన్నయ్య కోసం తమ్ముడు మార్చుకున్నాడు! - హీరో నాని



● విజయేందర్ రెడ్డి, శౌర్యువ్, నాని, కియారా, హేషమ్, మోహన్ చెరుకూరి

''ఎలాంటి లెక్కలు వేసుకోకుండా నాకు నచ్చిన సినిమాలు చేస్తున్నాను. నా ప్రతి సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తూ, నాకు నచ్చింది వారికీ నచ్చుతుందనే భరోసా కల్పించారు. 'హాయ్ నాన్న' చిత్రంతో మరోసారి అది నిరూపితమవుతుందని నమ్ముతున్నాను'' అని హీరో నాని అన్నారు. నాని, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా, శ్రుతీహాసన్, బాల నటి కియారా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిసెంబరు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ– ''తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో 'హాయ్ నాన్న' ఉంటుంది. అన్ని ఏజ్ గ్రూప్‌లకు నచ్చే సినిమాను కమర్షియల్ మూవీ అనుకుంటే..'హాయ్ నాన్న' మోస్ట్ కమర్షియల్ మూవీ. మా సినిమాను ముందు డిసెంబరు 21న రిలీజ్ చేయాలనుకున్నాం. అయితే ఓ ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నప్పుడు, తమ్ముడు అనుకున్న తేదీకే అన్నయ్య వేడుక (ప్రభాస్ 'సలార్' సినిమా విడుదలను పరోక్షంగా ఉద్దేశించి..) కూడా ఖరారైతే.. తమ్ముడు తేదీ మార్చు కుంటాడు'' అన్నారు. ''ఒక మంచి కథతో 'హాయ్ నాన్న' తీశాం. నా దర్శకత్వంలోని తొలి సినిమాయే పాన్ ఇండియా స్థాయిలో రూపొందడం హ్యాపీ'' అన్నారు శౌర్యువ్. ''ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుంది'' అన్నారు మోహన్, విజయేందర్ రెడ్డి. ''కథకు తగ్గట్టే మ్యూజిక్ ఇచ్చాను'' అన్నారు హేషమ్ అబ్దుల్ వహాబ్.

ఊర మాస్ శంకర్



● 'గాంజా శంకర్'లో సాయిధరమ్ తేజ్

'సూపర్ మ్యాన్ ఏం చేశాడంటే'... 'అబ్బా ఈ స్పైడర్ మ్యాన్‌లు.. సూపర్ మ్యాన్‌లు కాదు నాన్నా.. మన లోకల్ మ్యాన్ కథ ఏదైనా ఉంటే చెప్పు నాన్నా..' అని చిన్నారి కూతురు అడుగుతుంది... అప్పుడు మొదలవుతుంది లోకల్ మ్యాన్ గురించి... ఆడు చిన్నప్పుడే చదువు మానేశాడనీ, అమ్మా నాన్న మాట వినలేదనీ, అన్ని చెడు అలవాట్లు ఉన్నాయనీ, పది రూపాయలుంటే పార్కులో, పది వేలుంటే పార్క్ హయత్‌లో ఉంటాడని చెప్పడంతో ఆ లోకల్ మ్యాన్ ఊర మాస్‌గా పెరిగినవాడని అర్థం అవుతుంది. అతని పేరు 'గాంజా శంకర్'. సాయి ధరమ్ తేజ్ టైటిల్ రోల్‌లో రూపొందుతున్న చిత్రం 'గాంజా శంకర్'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్నారు. ఆదివారం సాయిధరమ్ పుట్టిన రోజు సందర్భంగా గాంజా శంకర్ పాత్రను పరిచయం చేస్తూ, విడుదల చేసిన టీజర్‌లో పైన పేర్కొన్న డైలాగ్స్ ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: రిషీ పంజాబి, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.

శక్తీ శెట్టి.. లేడీ సింగమ్



● దీపికా పదుకోన్

లేడీ సింగమ్ శక్తీ శెట్టిగా మారారు దీపికా పదుకోన్. 'సింగమ్', 'సింగమ్ రిటర్న్స్' చిత్రాల తర్వాత బాలీవుడ్ 'సింగమ్' ఫ్రాంచైజీలో రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'సింగమ్ ఎగైన్'. అజయ్ దేవగన్ మెయిన్ లీడ్ హీరోగా, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా నుంచి దీపికా పదుకోన్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. 'సింగమ్ ఎగైన్' చిత్రంలో లేడీ సింగమ్ పోలీసాఫీసర్ శక్తీ శెట్టి పాత్రలో దీపికా నటిస్తున్నారని, కథ రీత్యా క్రూరమైన, హింసాత్మక ధోరణిలో శక్తీ శెట్టి పాత్ర ఉంటుందని రోహిత్ శెట్టి పేర్కొన్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఆగస్టులో విడుదల కానుంది.

రాజకీయ నాయకురాలు మణి మేకల



● మాళవికా నాయర్

మణి మేకల పవర్‌ఫుల్ రాజకీయ నాయకురాలు. ఆమె ప్రసంగాలు ప్రజలను చైతన్య వంతుల్ని చేస్తాయి. మరి.. ఆ రాజకీయ నాయకురాలికి, బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌కి ఉన్న లింక్ ఏంటి? అనేది 'డెవిల్' చిత్రంలో చూడాల్సిందే. బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్ అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రంలో ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్‌గా నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. పొలిటీషియన్ మణి మేకల పాత్రను మాళవికా నాయర్ పోషిస్తున్నారు. ఆదివారం మాళవిక లుక్‌ని విడుదల చేశారు. ఈ చిత్రంలో కథానాయికగా సంయుక్తా మీనన్ నటిస్తున్నారు. నవంబర్ 24న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'డెవిల్' రిలీజ్ కానుంది. దేవాన్ష్ నామా సమర్పణలో స్వీయ దర్శకత్వంలో అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: సౌందర్ రాజన్.

ముగ్గురి స్నేహితుల అదృష్టం



● విశ్వదేవ్, భాను ప్రసాద్, శ్రీనాథ్ బాదినేని, అభినవ్ గోమఠం, నరేశ్ అగస్త్య

నరేష్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వదేవ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'కిస్మత్'. అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో నటించిన ఈ చిత్రంలో రియా సుమన్ హీరోయిన్. శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో రాజు నిర్మించిన ఈ చిత్రం నవంబరులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను హీరో శ్రీ విష్ణు విడుదల చేశారు. ముగ్గురు స్నేహితులు తమ జీవితంలో ఏదైనా అద్భుతం జరగాలని ఆశిస్తుంటారు. విశ్వదేవ్ నమ్మకం కోల్పోయి ఉంటాడు. అభినవ్ గోమఠంకి సినీ రచయిత అవ్వాలన్నది కల. రియా సుమన్‌తో నరేశ్ అగస్త్య ప్రేమలో ఉంటాడు. ఓ సంఘటనతో ఈ ముగ్గురి కిస్మత్ (అదృష్టం) ఎలా మారిపోయింది అనేది ఈ చిత్రకథ అని యూనిట్ పేర్కొంది. ఇక టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''కిస్మత్' లాంటి చిత్రాలు మౌత్ టాక్ వల్లే హిట్టవుతాయి. ప్రేక్షకులు మమ్మల్ని సపోర్ట్ చేయాలి'' అన్నారు. ''మంచి క్రైమ్ కామెడీ ఫిల్మ్ ఇది'' అన్నారు అభినవ్ గోమఠం. ''చక్కని ఫన్ ఫిల్మ్ ఇది'' అన్నారు విశ్వదేవ్. ''రాజు రెండేళ్ల పాటు ఈ సినిమా స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. నరేశ్, అభినవ్, విశ్వలతో పాటు అందరూ అద్భుతంగా నటించారు'' అన్నారు శ్రీనాథ్. ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: వేదరామన్ శంకర్, సహనిర్మాత: భాను ప్రసాద్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: భరత్ రెడ్డి.



జ్యోతిక శ్రీకి స్వర్ణ పతకం

జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతిక శ్రీ స్వర్ణ పతకం సాధించింది. బెంగళూరులో ఆదివారం ముగిసిన ఈ మీట్‌లో జ్యోతిక శ్రీ మహిళల 400 మీటర్ల విభాగంలో చాంపియన్‌గా నిలిచింది. జ్యోతిక శ్రీ అందరికంటే వేగంగా 53.26 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. సిమర్జీత్ కౌర్ (పంజాబ్: 53.77 సెకన్లు) రజతం, కవిత (పీఎస్‌పీబీ: 54.15 సెకన్లు) కాంస్యం సాధించారు. 220 పాయింట్లతో రైల్వేస్ జట్టు ఓవరాల్ టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

షాంఘై మాస్టర్స్ టోర్నీ విజేత హుర్కాజ్



పోలాండ్ టెన్నిస్ స్టార్ హుబెర్ట్ హుర్కాజ్ తన కెరీర్‌లో రెండో మాస్టర్స్ సిరీస్ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో హుర్కాజ్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో 17వ ర్యాంకర్ హుర్కాజ్ 6-3, 3-6, 7-6 (10/8)తో ఏడో ర్యాంకర్ ఆండ్రీ రుబ్లెవ్ (రష్యా)పై గెలిచాడు. విజేత హుర్కాజ్‌కు 12,62,220 డాలర్ల (రూ. 10 కోట్ల 52 లక్షలు) ప్రైజ్‌మనీ దక్కింది.



రన్నరప్‌గా బోపన్న జోడీ

షాంఘై: ఈ ఏడాది మూడో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో బోపన్న-ఎబ్డెన్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 7-5, 2-6, 7-10తో గ్రానోలెర్స్ (స్పెయిన్)-జెబలాస్ (అర్జెంటీనా) ద్వయం చేతిలో ఓడిపోయింది. రన్నరప్‌గా నిలిచిన బోపన్న-ఎబ్డెన్‌లకు 2,31,660 డాలర్ల (రూ. కోటీ 93 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 600 ర్యాంకింగ్ పాయింట్లు... టైటిల్ నెగ్గిన గ్రానోలెర్స్-జెబలాస్‌లకు 4,36,730 డాలర్ల (రూ. 3 కోట్ల 64 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. తాజా ఫలితంతో బోపన్న-ఎబ్డెన్ జోడీ టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌కు అర్హత సాధించింది.

నేటి నుంచి ముస్తాక్ అలీ టోర్నీ

జైపూర్: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ నేడు మొదలవుతుంది. 22 రోజులపాటు జరిగే ఈ టోర్నీలో మొత్తం 38 జట్ల మధ్య 135 మ్యాచ్‌లు జరుగుతాయి. 38 జట్లను ఐదు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఎ'లో హైదరాబాద్, డిఫెండింగ్ చాంపియన్ ముంబై, బరోడా, హరియాణా, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్, మిజోరం, మేఘాలయ ఉన్నాయి. గ్రూప్ 'సి'లో ఆంధ్ర, రైల్వేస్, సౌరాష్ట్ర, అరుణాచల్‌ప్రదేశ్, గోవా, గుజరాత్, మణిపూర్, పంజాబ్ జట్లకు చోటు కల్పించారు. అక్టోబర్ 27 వరకు గ్రూప్ లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాక ఐదు గ్రూప్‌ల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన 10 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌ల్లో తిలక్ వర్మ సారథ్యంలోని హైదరాబాద్ జట్టు మేఘాలయతో... కోన శ్రీకర్ భరత్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు గోవాతో తలపడతాయి. ఈ టోర్నీ మ్యాచ్‌లను జియో సినిమా యాప్, స్పోర్ట్స్ 18 ఛానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

అఫ్గాన్ అద్భుతం...



వోక్స్‌ను బౌల్డ్ చేశాక ముజీబ్ సంబరం

బట్లర్ బౌల్డ్

అడపాదడపా మెరిపించడమే కాదు తమదైన రోజున చిరస్మరణీయ ప్రదర్శనతో పెద్ద జట్లను బోల్తా కొట్టించే ప్రావీణ్యం తమలో ఉందని అఫ్గానిస్తాన్ క్రికెట్ ప్రపంచానికి చాటి చెప్పింది. వరుసగా మూడో వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఎట్టకేలకు ఈ మెగా ఈవెంట్‌లో 14 వరుస పరాజయాలకు తెరదించింది. సంచలన ఆటతీరుతో ఏకంగా డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్టునే మట్టికరిపించింది. ఇక నుంచి తమను కూన జట్టుగా పరిగణించకూడదని మిగతా జట్లకు హెచ్చరికలు పంపించింది. 2015 ప్రపంచకప్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి కేవలం స్కాట్లాండ్‌పై గెలిచిన అఫ్గానిస్తాన్... ఆ తర్వాత 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. తాజా ప్రపంచకప్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, భారత్ చేతిలో ఓడిన అఫ్గానిస్తాన్ మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై గెలుపొంది పరాజయాల పరంపరకు ముగింపు పలికింది.

డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై సంచలన విజయం

- మెరిసిన గుర్బాజ్, ఇక్రమ్
- ముజీబ్, రషీద్, నబీ మాయాజాలం

న్యూఢిల్లీ: వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌కు ఊహించని షాక్! అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను కంగుతినిపించింది. ఆదివారం జరిగిన పోరులో హష్మతుల్లా కెప్టెన్సీలోని అఫ్గానిస్తాన్ 69 పరుగుల తేడాతో బట్లర్ నాయకత్వంలోని ఇంగ్లండ్ జట్టుపై జయభేరి మోగించింది. ముందుగా అఫ్గానిస్తాన్ 49.5 ఓవర్లలో 284 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ (57 బంతుల్లో 80; 8 ఫోర్లు, 4 సిక్సర్లు) చెలరేగాడు. ఇక్రమ్ అలీఖిల్ (66 బంతుల్లో 58; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఆదిల్ రషీద్ 3, మార్క్‌వుడ్ 2 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 40.3 ఓవర్లలో 215 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్ (61 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. రషీద్ ఖాన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ముజీబ్ చెరో 3 వికెట్లు తీయగా, నబీకి 2 వికెట్లు దక్కాయి.

నడిపించిన గుర్బాజ్

జద్రాన్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన రహ్మనుల్లా గుర్బాజ్ చెలరేగాడు. మూడో ఓవర్ నుంచి భారీ సిక్సర్‌తో ఇంగ్లండ్ బౌలింగ్‌పై ఎదురుదాడికి దిగాడు. వోక్స్, టోప్లీ, స్యామ్ కరన్‌ల పేస్... గుర్బాజ్ బౌండరీలు, సిక్సర్లతో విలవిలాడింది. 11వ ఓవర్లో ఆదిల్ రషీద్‌ను దించితే బౌండరీ బాది



గుర్బాజ్

33 బంతుల్లో గుర్బాజ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 12.4వ ఓవర్లోనే అఫ్గాన్ స్కోరు వందకు చేరింది. 114 స్కోరువద్ద జద్రాన్ (48 బంతుల్లో 28; 3 ఫోర్లు)ను అవుట్ చేసిన రషీద్ ఇంగ్లండ్ శిబిరాన్ని కాస్త ఊపిరి తీసుకోనిచ్చాడు. స్వల్ప వ్యవధిలో రహ్మత్ షా (3), గుర్బాజ్ అవుటైనప్పటికీ ఇక్రమ్ అలీఖిల్ అర్ధసెంచరీ, లోయర్ ఆర్డర్‌లో రషీద్ ఖాన్ (22 బంతుల్లో 23; 3 ఫోర్లు), ముజీబ్ ఉర్ రెహ్మాన్ (16 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) చేసిన విలువైన పరుగులు అఫ్గాన్ పటిష్టమైన స్కోరుకు బాట వేసింది.

బాధ్యతలేని బ్యాటింగ్‌తో...

స్కోరు పెద్దదే. కానీ అఫ్గాన్ బౌలింగ్‌పై ఈ లక్ష్యం ఇంగ్లండ్‌కు అసాధ్యమైందేమీ కాదు. బ్యాటర్లకు కష్టమైందీ కాదు. కానీ బాధ్యత లేని బ్యాటింగ్, చెత్త షాట్లతో జట్టు ఓటమినే మూల్యంగా చెల్లించుకోవాల్సి వచ్చింది. రెండో ఓవర్లోనే బెయిర్‌స్టో (2) లాంటి ఓపెనర్ అవుటైతే... రూట్ (11), కెప్టెన్ బట్లర్ (9)లాంటి అనుభవజ్ఞులు క్రీజును అంటిపెట్టుకోవాల్సింది పోయి... సులువుగా క్లీన్‌బౌల్డయ్యారు. దీంతో మ్యాచ్‌పై పట్టుబిగించే అవకాశాల్ని అఫ్గాన్ అన్ని వైపులా ముమ్మరం చేసింది. మలాన్ (39 బంతుల్లో 32; 4 ఫోర్లు) చేసిన మోస్తరు పరుగులు, హ్యారీ బ్రూక్ అర్ధసెంచరీ ఇంగ్లండ్‌ను కాపాడలేకపోయాయి.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (రనౌట్) 80; ఇబ్రహీమ్ (సి) రూట్ (బి) రషీద్ 28; రహ్మత్ షా (స్టంప్డ్) బట్లర్ (బి) ఆదిల్ రషీద్ 3; హష్మతుల్లా (బి) రూట్ 14; అజ్మతుల్లా (సి) వోక్స్ (బి) లివింగ్‌స్టోన్ 19; ఇక్రమ్ (సి) స్యామ్ కరన్ (బి) టోప్లీ 58; నబీ (సి) రూట్ (బి) వుడ్ 9; రషీద్ (సి) రూట్ (బి) రషీద్ 23; ముజీబ్ (సి) రూట్ (బి) వుడ్ 28; నవీనుల్ హక్ (రనౌట్) 5; ఫరూఖీ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (49.5 ఓవర్లలో ఆలౌట్)** 284. **వికెట్ల పతనం:** 1-114, 2-122, 3-122, 4-152, 5-174, 6-190, 7-233, 8-277, 9-277, 10-284. **బౌలింగ్:** వోక్స్ 4-0-41-0, టోప్లీ 8.5-1-52-1, కరన్ 4-0-46-0, ఆదిల్ రషీద్ 10-1-42-3, వుడ్ 9-0-50-2, లివింగ్‌స్టోన్ 10- 0-33-1, రూట్ 4-0-19-1.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫరూఖీ 2; మలాన్ (సి) ఇబ్రహీమ్ (బి) నబీ 32, రూట్ (బి) ముజీబ్ 11; బ్రూక్ (సి) ఇక్రమ్ (బి) ముజీబ్ 66; బట్లర్ (బి) నవీనుల్ 9; లివింగ్‌స్టోన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రషీద్ 10; స్యామ్ కరన్ (సి) రహ్మత్ (బి) నబీ 10; వోక్స్ (బి) ముజీబ్ 9; ఆదిల్ రషీద్ (సి) నబీ (బి) రషీద్ 20; వుడ్ (బి) రషీద్ 18; టోప్లీ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (40.3 ఓవర్లలో ఆలౌట్)** 215. **వికెట్ల పతనం:** 1-3, 2-33, 3-68, 4-91, 5-117, 6- 138, 7-160, 8-169, 9-198, 10-215. **బౌలింగ్:** ముజీబ్ 10-1-51-3, ఫరూఖీ 7-0-50-1, నవీనుల్ హక్ 6-1-44-1, నబీ 6-0-16-2, రషీద్ ఖాన్ 9.3-1-37-3, అజ్మతుల్లా 2-0-13-0.

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X శ్రీలంక
వేదిక: లక్నో
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో 131 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

రాజ్‌కోట్(గుజరాత్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 131
» పోస్టులు: అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ స్టోర్స్ ఆఫీసర్, బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ ఆఫీసర్, క్లినికల్ సైకాలజిస్ట్, డైటీషియన్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్, జూనియర్ వార్డెన్, లైబ్రేరియన్, లోయర్ డివిజన్ క్లర్క్, మెడికల్ ఆఫీసర్ ఆయుష్, మెడికల్ ఫిజిసిస్ట్, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్, ఆఫీస్ అసిస్టెంట్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 05.11.2023.
» వెబ్‌సైట్: www.aiimsrajkot.edu.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 95 పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన సేఫ్టీ అసిస్టెంట్, సెమీ స్కిల్డ్ రిగ్గర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 95
» పోస్టుల వివరాలు: సెమీ స్కిల్డ్ రిగ్గర్-56, సేఫ్టీ అసిస్టెంట్-39. » అర్హత: నాలుగో తరగతి, పదో తరగతి, డిప్లొమా(సేఫ్టీ/ఫైర్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 21.10.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ప్రాక్టికల్ పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.10.2023.
» వెబ్‌సైట్: https://cochinshipyard.in

ఐఐటీ హైదరాబాద్‌లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్(ఐఐటీ).. తాత్కాలిక ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 01
» అర్హత: ఎంటెక్(మెకానికల్/ఏరోస్పేస్/సివిల్) ఉత్తీర్ణులవ్వాలి.
» వేతనం: నెలకు రూ.31,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 23.10.2023.
» ఈమెయిల్: sidhardh@mae.iith.ac.in
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.iith.ac.in

వైఎస్సార్ జిల్లా, కడప మహిళా-శిశు సంక్షేమ శాఖలో వివిధ ఖాళీలు

వైఎస్సార్ జిల్లా, కడప మహిళా-శిశు సంక్షేమ శాఖ కార్యాలయం.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» మొత్తం పోస్టుల సంఖ్య: 02

» పోస్టుల వివరాలు: జిల్లా కోఆర్డినేటర్-01, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01.

అర్హత

» జిల్లా కోఆర్డినేటర్: డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఐటీ లేదా కంప్యూటర్ సైన్స్‌లో సర్టిఫికేట్ లేదా డిప్లొమా ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» ప్రాజెక్ట్ అసిస్టెంట్: డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. మేనేజ్‌మెంట్/సోషల్ సైన్సెస్/న్యూట్రిషన్‌లో పీజీ డిప్లొమా ఉండాలి. రెండేళ్ల పని అనుభవం ఉండాలి. స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» వయసు: 25 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ఫారంతో పాటు అర్హతలకు సంబంధించి అన్ని సర్టిఫికేట్ల జిరాక్స్‌కాపీలను జతచేసి జిల్లా కలెక్టర్/జిల్లా మహిళా-శిశు సంక్షేమ శాఖ కార్యాలయం, కలెక్టరేట్, డి.బ్లాక్, కడప,వైఎస్సార్ జిల్లా చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 18.10.2023.
» వెబ్‌సైట్: https://kadapa.ap.gov.in

మహాత్మా గాంధీ యూనివర్శిటీ,కొట్టాయంలో అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు

కొట్టాయం(కేరళ)లో మహాత్మాగాంధీ యూనివర్శిటీ.. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» మొత్తం పోస్టుల సంఖ్య: 06

» విభాగాలు: స్కూల్ ఆఫ్ పెడగాజికల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ ఫిజిక్స్, స్కూల్ ఆఫ్ టూరిజం స్టడీస్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, స్కూల్ ఆఫ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్సెస్.
» అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, ఉత్తీర్ణతతో పాటు పరిశోధన/బోధన అనుభవం ఉండాలి. వయసు: వయోపరిమితి లేదు.
» వేతనం: నెలకు రూ.1,31,400 చెల్లిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2023.
» దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరి తేది: 05.11.2023.
» వెబ్‌సైట్: www.facultyrecruitment.mgu.ac.in

క్యాంపస్ డ్రైవ్స్.. ఆఫర్ దక్కేలా!

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ కోసం ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు వేయి కళ్లతో ఎదురు చూస్తుంటారు! ఎందుకంటే.. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ అత్యంత కీలకం!! ఏటా కార్పొరేట్ కంపెనీలు కాలేజీల్లో ప్రత్యేకంగా నిర్వహించే ఈ నియామక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఉజ్వల కెరీర్‌కు మార్గం సుగమం అవుతుంది. వచ్చే నెల నుంచి ఇంజనీరింగ్, ఎంబీఏ కళాశాలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాంపస్ డ్రైవ్స్ ప్రక్రియ ఎలా ఉంటుంది.. ఇందులో విజయం సాధించడమెలాగో తెలుసుకుందాం..

» వచ్చే నెల నుంచే క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్
» పలు రౌండ్లలో విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన
» ముందస్తు సంసిద్ధతతో కొలువు ఖాయం
» విజయంలో కీలకం కోర్ స్కిల్స్,సాఫ్ట్ స్కిల్స్
» టెక్నికల్, పర్సనల్, హెచ్ఆర్ రౌండ్ల ద్వారా ఎంపిక

ప్రతి ఏటా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌ను సంస్థలు నవంబర్‌లో ప్రారంభించి.. దాదాపు నాలుగు నెలల పాటు కొనసాగిస్తాయి. ముందుగా కంపెనీలు టైర్-1 ఇన్‌స్టిట్యూట్స్‌గా పేరొందిన ఐఐఎంలు, ఐఐటీలకు వెళుతున్నాయి. ఆ తర్వాత దశలో ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నాయి. ఐఐఎంలు, ఐఐటీల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు దశల వారీగా క్యాంపస్ నియామకాలు జరుగుతున్నాయి. తొలి దశలో టాప్ కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఆ తర్వాత దశల్లో ఇతర సంస్థలు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నాయి.

మూడు రౌండ్లలో

సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహిస్తుంటాయి. అవి..టెక్నికల్ రౌండ్, టెక్నికల్ ఇంటర్వ్యూ, హెచ్ఆర్ ఇంటర్వ్యూ.

టెక్నికల్ రౌండ్

మొదటి దశలో నిర్వహించే టెక్నికల్ రౌండ్‌లో అభ్యర్థుల డొమైన్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. డొమైన్ నైపుణ్యాల నుంచి సదరు రంగానికి సంబంధించి తాజా నైపుణ్యాల వరకూ.. అన్నింటిపైనా ప్రశ్నలు సంధించే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు ఇటీవల కాలంలో చర్చనీయాంశంగా మారిన ఏఐ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఐఓటీ వంటి వాటిపై అవగాహన పెంచుకొని టెక్నికల్ రౌండ్‌కు హాజరవడం మేలు చేస్తుంది.

సెకండ్ రౌండ్

పలు కంపెనీలు రెండో రౌండ్ ఇంటర్వ్యూను సైతం టెక్నికల్ రౌండ్‌గా పేర్కొంటున్నాయి. ఈ దశలో ప్రధానంగా అభ్యర్థుల ప్రాక్టికల్ స్కిల్స్‌ను పరిశీలిస్తారు. అందుకోసం ఏదైనా ఒక రియల్ టైం టాస్క్‌ను ఇచ్చి.. దాన్ని పరిష్కరించమని అడుగుతున్నారు. ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల విషయంలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. రెండో రౌండ్‌లో విజయం కోసం విద్యార్థులు బేసిక్ స్కిల్స్ అయిన కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై పట్టు సాధించాలి.

హెచ్ఆర్ రౌండ్

క్యాంపస్ డ్రైవ్స్‌లో చివర దశ.. హెచ్ఆర్ ఇంటర్వ్యూ. టెక్నికల్, సబ్జెక్ట్ నైపుణ్యాల ఆధారంగా తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు ఈ రౌండ్ ఉంటుంది. ఇందులో వ్యక్తిగత లక్షణాలు, అప్టిట్యూడ్, ఆటిట్యూడ్‌లను పరిశీలిస్తారు. కాబట్టి అభ్యర్థులు తమ బాడీ లాంగ్వేజ్, వస్త్రధారణ, కమ్యూనికేషన్ స్కిల్స్‌తోపాటు హావభావాల వ్యక్తీకరణ హుందాగా ఉండేలా చూసుకోవాలి.

లక్ష్యంపై స్పష్టత

హెచ్ఆర్ రౌండ్‌లో విజయ సాధించాలంటే.. అభ్యర్థులకు తమ లక్ష్యంపై స్పష్టత అవసరం. 'మీ భవిష్యత్ లక్ష్యాలు చెప్పండి?'.. హెచ్ఆర్ ఇంటర్వ్యూలో సంస్థ ప్రతినిధులు అడిగే ప్రశ్న ఇది. ఆ లక్ష్యాల సాధనకు సంస్థలో పని చేయడం ఎలా ఉపయోగపడుతుంది? అనేది మరో ప్రశ్న. ఈ రెండు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలతో సంసిద్ధులై ఉండాలి. భవిష్యత్తు లక్ష్యాల విషయంలో సందిగ్ధత కనబరిస్తే.. అవకాశం చేజారే ఆస్కారముంది.

ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్

ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ సైతం ప్లేస్‌మెంట్ ప్రక్రియలో కీలకంగా నిలుస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్‌ల పరిధిలో నిర్వహించే అకడమిక్ సంబంధిత సెమినార్లు, లెక్చర్స్‌తోపాటు ఆటపాటల్లో చురుగ్గా ఉండాలి. వీలైతే వాటిని లీడ్ చేసే విధంగా వ్యవహరించాలి. కారణం.. ఇటీవల కాలంలో కంపెనీలు అభ్యర్థుల ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌ని కూడా బేరీజు వేస్తున్నాయి.దీనిద్వారా లీడర్‌షిప్ స్కిల్స్,సాఫ్ట్ స్కిల్స్, పీపుల్ స్కిల్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను అంచనా వేస్తున్నారు.



జాబ్ స్కిల్స్

వ్యక్తిగత లక్షణాలు

అద్భుతమైన జీపీఏలు, ప్రాజెక్ట్ వర్క్ రిపోర్ట్స్ ఆధారంగా ఆఫర్లు ఖరారు చేసే కాలం మారింది. ప్రస్తుత పోటీ పరిస్థితుల్లో కంపెనీలు అభ్యర్థుల నుంచి మరెన్నో లక్షణాలు కోరుకుంటున్నాయి. సబ్జెక్టుకు సంబంధించి కోర్ నైపుణ్యాలతోపాటు కాంటెంపరరీ స్కిల్స్ ఉండాలని భావిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్స్‌లో విజయం దిశగా తమ వ్యూహాన్ని మార్చుకోవాల్సిన ఆవశ్యకత నెలకొంది.

రెజ్యూమే.. స్కిల్స్ తెలిపేలా

క్యాంపస్ డ్రైవ్స్‌లో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసేందుకు కంపెనీలు ఉపయోగించే మొదటి సాధనం.. రెజ్యూమే. దీన్ని ఒకట్రెండు పేజీలకు పరిమితం చేయాలి. ముఖ్యంగా అకడమిక్ రికార్డ్, దానికి అనుబంధ నైపుణ్యాలకు సంబంధించి సమాచారం ఇచ్చేందుకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్‌డేటెడ్ స్కిల్స్‌తో తమ వ్యక్తిగత సోషల్ నెట్‌వర్క్ లింక్స్‌ను పొందుపరిస్తే.. రిక్రూటర్స్ వాటి ఆధారంగా అభ్యర్థి గురించి పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు వీలవుతుంది. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, సోషల్ నెట్‌వర్క్ ఫాలోయర్స్ ఆధారంగా అభ్యర్థి నిజమైన ఆసక్తిని తెలుసుకునే వీలుంది.

ఆఫర్స్ ఖరారు

క్యాంపస్ ఆఫర్స్ ఖరారు చేయడంలో సంస్థలు కొన్నిసార్లు వినూత్న మార్గాలను అనుసరిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ హ్యాకథాన్‌లు నిర్వహించడం, అభ్యర్థులను బృందాలుగా ఏర్పాటు చేసి.. టాస్క్‌ను ఇచ్చి నిర్దిష్ట సమయంలో పూర్తి చేయమని పేర్కొంటున్నాయి. దీనికి అనుగుణంగా బృందంలోని అభ్యర్థులందరూ ఆన్‌లైన్‌లో అనుసంధానం అవుతూ సదరు టాస్క్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ హ్యాకథాన్‌ల ద్వారా టీమ్ వర్క్ కల్చర్‌ను అంచనా వేయడంతోపాటు ప్రాబ్లమ్ సాల్వింగ్‌లో ఏ విధంగా వ్యవహరించారో తెలుసుకుంటారు.

కోరుకుంటున్న క్వాలిటీస్

క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కంపెనీలు ఎక్కువగా అనలిటికల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, బృంద నైపుణ్యాలు, సమయ స్ఫూర్తి తదితర అంశాలకు పెద్దపీట వేస్తున్నాయి. వీటికి అనుగుణంగా ప్రాథమిక దశలో నిర్వహించే రిటెన్ టెస్ట్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ వంటి అంశాల నుంచే ఎక్కువగా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్‌లో పాల్గొనే విద్యార్థులు సంబంధిత పరిజ్ఞానం పెంచుకోవడం తోపాటు ఆయా సంస్థల గత ప్లేస్‌మెంట్ పేపర్స్‌ను పరిశీలించడం ఉపయుక్తంగా ఉంటుంది.

ఆఫర్ పొందిన వారికి శిక్షణ

ఇటీవల కాలంలో అభ్యర్థుల కోర్ బ్రాంచ్‌లతో సంబంధం లేకుండా సంస్థలు జాబ్ ప్రొఫైల్స్ ఆఫర్ చేస్తున్నాయి. ఈ ట్రెండ్ ఐటీ, ఐటీఈఎస్ సంస్థల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఐటీ కంపెనీలు కంప్యూటర్ సైన్స్, ఐటీ బ్రాంచ్‌లతోపాటు మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ బ్రాంచ్‌ల విద్యార్థులను కూడా నియమించుకుంటున్నాయి. చివరి సెమిస్టర్‌లో ఆఫర్స్ ఖరారు చేసి.. కోర్సు పూర్తయ్యేలోపు తమ అవసరాలకు అనుగుణంగా శిక్షణనందిస్తున్నాయి. టీసీఎస్, విప్రో, ఇన్ఫోసిస్ వంటి సంస్థలు ఆఫర్ లెటర్స్ పొందిన విద్యార్థులకు శిక్షణనందించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ వెబ్ పోర్టల్స్‌ను రూపొందించి అందుబాటులో ఉంచుతున్నాయి. ఫలితంగా ఆఫర్ లెటర్ పొందిన రోజు నుంచి అపాయింట్‌మెంట్ తేదీ నాటికి సంస్థ కార్యకలాపాలపై పూర్తి అవగాహన పొందడంతోపాటు, విధుల్లో చేరిన తొలి రోజు నుంచే చక్కటి పని తీరు ప్రదర్శించేందుకు మార్గం వేస్తున్నాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	126	66,283
నిఫ్టీ ▽	43	19,751

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	13,407	▽	167
డోజోన్స్	33,670	△	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽	45
డాక్స్	15,187	▽	238
షాంఘై	3,088	▽	20
నికాయ్	32,290	▽	199

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.49	84.16
£	బ్రిటన్ పౌండ్	100.01	103.37
€	యూరో	86.36	89.40
¥	జపాన్ ఎన్ (100)	54.79	56.50
AU$	ఆస్ట్రేలియా డాలర్	51.63	53.92
S$	సింగపూర్ డాలర్	59.92	61.85
SAR	సౌదీ రియాల్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	21.77	23.57
¥	చైనా యువాన్	10.27	12.36

మీ ఫండ్‌కు మీరే మేనేజర్..?

మెరుగైన రాబడుల కోసం ఈక్విటీల వైపు అడుగులు వేసే రిటైల్ ఇన్వెస్టర్లు పెరుగుతున్నారు. అన్ని సాధనాల్లోకెల్లా ఈక్విటీలు దీర్ఘకాలంలో స్థిరమైన, మెరుగైన రాబడులు ఇవ్వడమే ఈ ఆకర్షణకు కారణం. ఈక్విటీల్లో పెట్టుబడులు ఎంత సులభమో, ఆచరణలో అంత కష్టం. నిపుణులైన ఫండ్ మేనేజర్లను కాదని, నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు ఆసక్తి చూపించే వారు, ప్రాథమిక విషయాల గురించి, రిస్క్ గురించి తప్పకుండా తెలుసుకుని తీరాలి. లేదంటే అసలు ఉద్దేశమే నెరవేరకుండా పోతుంది. తమ పెట్టుబడులకు తామే ఫండ్ మేనేజర్ పాత్ర పోషిస్తామనుకునే వారు, ఈక్విటీలో తలపండిన వారెన్ బఫెట్, ఫిలిప్ ఫిషర్, చార్లీ ముంగర్ చెప్పిన సూత్రాలు పాటించడం అనుసరణీయం. కంపెనీ గురించి, చేస్తున్న వ్యాపారం గురించి, పని చేస్తున్న రంగం, యాజమాన్య దక్షత, పోటీ సామర్థ్యాలు, నిధుల బలాలు ఇలా ఎన్నో అంశాలను చూసి వడపోయాలి. ఆపై మిగిలిన కంపెనీలకే పెట్టుబడులను పరిమితం చేసుకోవడం వల్ల రక్షణ ఎక్కువగా ఉంటుంది. నేరుగా పెట్టుబడులు పెట్టే ప్రతి ఇన్వెస్టర్ తెలుసుకోవాల్సిన అంశాల సమాహారమే ఈ కథనం...



- వ్యాపారం తెలియని కంపెనీలకు దూరం
- యాజమాన్య నైపుణ్యాలు బలంగా ఉండాలి
- పోటీ తత్వం, పరిశోధన ఆవిష్కరణ సామర్థ్యాలు
- బలమైన బ్యాలన్స్ షీట్ కీలకం
- కార్పొరేట్ గవర్నెన్స్ ముఖ్యం



"స్కటిల్‌బట్ మెథడ్ ప్రకారం.. ఓ కంపెనీలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉంటే, ముందు ఆయా కంపెనీల ఉత్పత్తులు, సేవలను వినియోగించుకునే వారిని కలసి మాట్లాడాలి. అలాగే, ఆ కంపెనీ పోటీ దారులు, ఉద్యోగులతో మాట్లాడిన తర్వాత ఓ నిర్ణయానికి రావాలి.
– ఫిలిప్ ఎ. ఫిషర్

వ్యాపార నమూనా అర్థమైందా?

ఒక కంపెనీ షేర్లు కొంటున్నామంటే.. సదరు వ్యాపారంలో పెట్టుబడి పెడుతున్నట్టు. ఒక షేరును రూ.20లో కొని, అది రూ.100కు చేరితే నాలుగింతలు లాభం వస్తుందన్న అవాస్తవ అంచనాలు వేసుకుని ఓ కంపెనీలో పెట్టుబడులు పెడుతున్నారంటే? అనుసరించే బాట సరిగ్గా లేదని తెలుసుకోవాలి. ఎంపిక చేసుకునే కంపెనీకి ఆదాయం ఎలా వస్తోంది? కంపెనీ సేవలు లేదా ఉత్పత్తులు ఏంటన్నవి అర్థం చేసుకున్నారా? ఈ ప్రశ్నలకు మీ వద్ద సమాధానం ఉండాల్సిందే. కంపెనీ ఉత్పత్తులు లేదా సేవల గురించి తెలియనప్పుడు, భవిష్యత్తులో ఆ కంపెనీ వ్యాపారం ఎలా సాగుతుందో ఎలా తెలుస్తుంది? అటువంటప్పుడు పెట్టే పెట్టుబడి ఎలా వృద్ధి చెందుతుంది? ఒక కంపెనీ గురించి అర్థం కాకకపోయినా లేదా ఉత్పత్తులు, సేవలు ఆకర్షణీయంగా అనిపించకపోయినా, ఆ కంపెనీకి దూరంగా ఉండడమే మంచిది. వ్యాపారం అర్థం చేసుకునేందుకు ఎంత సులభంగా ఉంటే, అంత ఆకర్షణీయమైనదిగా భావించొచ్చు.

యాజమాన్య దక్షత

గుడ్ బిజినెస్ ఇన్ రాంగ్ హ్యాండ్స్.. రాంగ్ బిజినెస్ ఇన్ గుడ్ హ్యాండ్స్.. ఈ రెండింటిలో రెండోదే ఉత్తమం. సమర్థత లేని వ్యక్తుల చేతుల్లో మంచి వ్యాపారం ఉన్నా దాన్ని గొప్ప స్థాయికి తీసుకెళ్లలేరు. అదే మంచి వ్యాపార దక్షత కలిగిన వ్యక్తులు యాజమాన్య స్థానంలో ఉంటే, చెత్త వ్యాపారాన్ని సైతం మంచిగా వృద్ధి చేయగలరు. పెట్టుబడులు పెట్టే కంపెనీకి సమర్థులైన, ప్రతిభావంతులైన, భవిష్యత్తు ప్రణాళికలు, పోటీతత్వంపై స్పష్టమైన అవగాహన, టెక్నాలజీ పట్ల ఆసక్తి కలిగిన ప్రమోటర్లు ఉండాలి. ఆ కంపెనీ యాజమాన్యం పనితీరు గురించి సాధ్యమైనంత లోతుగా తెలుసుకోవాలి. వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో నడిచేవి, కుటుంబ కంపెనీలు సగటున ఏటా 3 శాతం అధిక పనితీరు చూపిస్తున్నట్టు పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అదే సమయంలో ప్రమోటర్లతో సంబంధం లేకుండా నిపుణుల ఆధ్వర్యంలో గొప్పగా పనిచేసే హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్, ఎల్అండ్‌టీ గ్రూప్, ఐటీసీ గ్రూప్ కూడా ఉన్నాయి.

మరొక ముఖ్యమైన అంశం.. ప్రతి కంపెనీ కూడా ఒక్కో రంగంలో విశేషమైన అనుభవం కలిగి ఉంటుంది. ఆయా రంగంలో వచ్చే మార్పులు, సవాళ్లకు అనుగుణంగా తన వ్యూహాలు మార్చుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అలా ఓ రంగానికే కట్టుబడి గొప్పగా రాణిస్తున్న కంపెనీలను పెట్టుబడులకు పరిశీలించొచ్చు. కంపెనీల మేనేజ్‌మెంట్ వ్యాపారంపైనే దృష్టి పెట్టాలి కానీ, వాటాదారుల విలువపై కాదు. కంపెనీ వ్యాపారంలో మెరుగ్గా రాణిస్తుంటే సహజంగానే వాటాల విలువ ఇతోధికం అవుతుంది. వ్యాపారం కాకుండా వాటాల విలువను పెంచడంపై దృష్టి సారించే యాజమాన్యాల వైఖరి, దీర్ఘకాలంలో వాటాదారులకు మేలు చేయకపోవచ్చు. కొన్ని కంపెనీలు చేస్తున్న వ్యాపారంపై దృష్టి తగ్గించి, మార్కెట్లో వచ్చే కొత్త వ్యాపార అవకాశాల్లోకి ప్రవేశిస్తుంటాయి. వాటాల విలువ పెరుగుతుందని అలా వ్యవహరిస్తుంటాయి. దీని వల్ల నిజానికి వ్యాపార విధానం గాడి తప్పుతుంది. కొత్త వ్యాపారాల కోసం పెద్ద ఎత్తున రుణాలు సమీకరిస్తుంటాయి. ఇది కూడా వాటాదారుల విలువకు ప్రతికూలం అవుతుంది.

భవిష్యత్ నాయకత్వం?

ఒక గొప్ప ప్రమోటర్‌ను చూసి కళ్లు మూసుకుని ఆ కంపెనీలో ఇన్వెస్ట్ చేయొచ్చని అనుభవజ్ఞులైన ఇన్వెస్టర్లు చెబుతుంటారు. నిజమే అలా ఇన్వెస్ట్ చేసిన తర్వాత, ఆ గొప్ప ప్రమోటర్ ఏదో ఒకరోజు వయసు మళ్లో లేకుంటే ఆకస్మికంగా కాలం చేస్తే పరిస్థితి ఏమిటి? కంపెనీ సంక్షోభంలో పడిపోకుండా, ఆ తర్వాత నుంచి సమర్థవంతంగా నడిపించే నాయకుడు ఉన్నారో లేదో చూడాలి. ప్రమోటర్ కాకపోయినా కంపెనీలను గొప్ప స్థాయికి తీసుకెళ్లిన ఎల్అండ్‌టీ ఏఎం నాయక్ వంటి నిపుణులు ఎందరో ఉంటారు. అలాంటి నిపుణుల చేతికి నాయకత్వం వెళితే నిశ్చింతగా ఉండొచ్చు.

పనిచేస్తున్న రంగం

కంపెనీ ఏ రంగంలో పనిచేస్తుందన్నది మరో ముఖ్యమైన అంశం. ఉదాహరణకు మెటల్స్ తీసుకుంటే వాటి ధరలు అంతర్జాతీయంగా వివిధ దేశాల వినియోగం, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తీవ్ర హెచ్చుతగ్గులను చూస్తుంటాయి. స్థిరమైన రాబడి కోరుకునే వారు మెటల్స్‌కు దూరంగా ఉండాల్సిందే. అదే ఐటీ రంగం తీసుకుంటే అస్థిరతలు తక్కువ. ఎక్కువ కాలాల్లో స్థిరమైన వృద్ధిని ఏటా నమోదు చేస్తుంటాయి. అలాగే బాగా వృద్ధికి అవకాశం ఉన్న రంగాలను ఎంపిక చేసుకుంటే, ఎక్కువ కాంపౌండింగ్‌కు అవకాశం ఉంటుంది.

పోటీతత్వం

ఎంపిక చేసుకునే కంపెనీకి గట్టి పోటీనిచ్చే సామర్థ్యాలున్నాయా? సదరు కంపెనీకి వ్యాపార పరంగా బలాలు ఉండే పెట్టుబడులకు రక్షణ ఉన్నట్టుగా భావించొచ్చు. దీన్నే మోట్ అని పిలుస్తారు. దీన్ని ఎలా తెలుసుకోవచ్చు? అంటే.. కంపెనీకి వ్యాపారంలో స్థూల మార్జిన్లు గరిష్ట స్థాయిలోనే దీర్ఘ కాలం పాటు కొనసాగుతుంటే, ఆ కంపెనీ ఉత్పత్తులు లేదా సేవలకు మంచి డిమాండ్ ఉన్నట్టుగా భావించొచ్చు. ఉదాహరణకు యాపిల్ స్థూల మార్జిన్లు 44 శాతానికి పైనే. ఆయా వ్యాపారంలో కొన్ని కంపెనీలే పనిచేస్తుండడం, కొత్త కంపెనీల ప్రవేశం అంత సులభం కాకపోవడం వంటివి అనుకూలతలు. దీనివల్ల ఉన్న కంపెనీలకు ప్రైసింగ్ పవర్ (ధరలను నిర్ణయించే శక్తి) ఉంటుంది. కనీసం లాభాల మార్జిన్ 10 శాతానికి పైన ఉండేలా చూసుకోవాలి. స్వల్ప మార్జిన్‌తో నడిచే కంపెనీలు ఎప్పుడైనా నష్టాల్లోకి జారిపోవచ్చు. పోటీ సంస్థల కంటే మీరు పెట్టుబడి పెట్టే కంపెనీ లాభాల మార్జిన్ ఎక్కువగా ఉండాలి. ఈ మార్జిన్‌ను ఏటేటా పెంచుకోవడం లేదంటే అదే స్థాయిలో కొనసాగించడం అవసరం. ఏటేటా క్షీణిస్తూ ఉంటే, బలం క్షీణిస్తున్నట్టుగా చూడొచ్చు.

కంపెనీ నిలబడుతుందా?

కంపెనీ రిస్క్‌లను కూడా చూడాలి. కంపెనీకి బలాలు ఉన్నాయని ఇన్వెస్ట్ చేసిన తర్వాత.. అవి అలాగే కొనసాగుతున్నాయా? అని కనిపెట్టుకుని ఉండాలి. టెలికం రంగంలో ఏం జరిగిందో చూశారు కదా..?



జియో రావడంతో ఎయిర్‌టెల్, వొడాఐడియా మినహా అన్నీ మూట సర్దేసుకోవాల్సి వచ్చింది. వొడాఐడియా కూడా ఆర్థిక సంక్షోభంతో కొనసాగుతోంది. ఇలాంటి విపత్తు ఏ రంగంలో అయినా ఉండొచ్చు. ఇన్వెస్ట్ చేసే ముందే కంపెనీకి వచ్చే రిస్కుల గురించి కూడా అవగాహన ఉండాలి. ఎయిర్‌టెల్ కంపెనీకి నెట్‌వర్క్ విస్తరణ పరంగా కాస్త మెరుగైన సామర్థ్యాలు ఉన్నాయి. దీనికితోడు మారుతున్న మార్కెట్ పరిణామాలకు తగ్గట్టు ఎయిర్‌టెల్ ప్రణాళికలు రచించి, అమలు చేసుకుంటూ వెళ్లింది. అందుకే జియోకు గట్టి పోటీదారుగా నిలిచింది. ముఖ్యంగా కంపెనీకి దీర్ఘకాలిక విజన్ (భవిష్యత్ ప్రణాళిక) ఉండాలి. అలాంటి కంపెనీలు దీర్ఘకాలంలో సవాళ్లను దీటుగా ఎదుర్కొని, వాటాదారులకు విలువను సమకూర్చగలవు.

బలమైన బ్యాలన్స్ షీట్

ఎంపిక చేసుకునే కంపెనీకి ఆర్థిక బలాలు తప్పకుండా ఉండాలి. కంపెనీకి దాదాపు రుణ భారం లేకుండా ఉంటే మంచిది. ఒకవేళ రుణాలు ఉన్నా కానీ, ఆ మొత్తం ఈక్విటీతో పోలిస్తే నూరు శాతం మించకుండా చూసుకోవాలి. రుణభారం ఎక్కువైతే కంపెనీ సంపాదించినదంతా వడ్డీ చెల్లింపులకే సరిపోతుంది. అప్పుడు కంపెనీ వృద్ధి ప్రణాళికల కోసం అప్పు మీద అప్పు చేసుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. ఇలాంటి బ్యాలన్స్ షీటు కంపెనీలకు దూరంగా ఉండాలి. రుణరహిత కంపెనీలు, ఆదాయం ఏటా కనీసం 10–15 శాతం, నికర లాభం ఏటా 15–20 శాతం వృద్ధి చెందే కంపెనీల్లో పెట్టుబడికి రక్షణ, వృద్ధికి అవకాశం ఉంటుంది. ఓ కంపెనీ షేరు ధర దీర్ఘకాలంలో లాభాలనే అనుసరిస్తుంటుంది. డివిడెండ్ చెల్లించేవి అయితే అదనపు ప్లస్‌గా చూడొచ్చు.

పరిశోధన, ఆవిష్కరణల సామర్థ్యం

మారుతున్న కస్టమర్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు, సేవల్లోనూ నవ్యత అవసరం. అందుకే కంపెనీలు పరిశోధనపై పెద్ద మొత్తంలో వెచ్చిస్తుంటాయి. ఓ కంపెనీ పరిశోధన, ఆవిష్కరణల సామర్థ్యాలకు నిదర్శనం, ఆ కంపెనీ ఉత్పత్తులకు పేటెంట్ హక్కులు ఉండడం. ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులు, సేవలను మార్కెట్ చేస్తుండడం. ఇలాంటి బలాలు ఉంటే, దీర్ఘకాలంలో ఆ కంపెనీ ఎంత పోటీ ఉన్నా నిలదొక్కుకుని, రాణిస్తుంది. ఇందుకు ఒక నిదర్శనం గూగుల్, యాపిల్. ఇవి పరిశోధనపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తుంటాయి. ఉత్పత్తులు, సేవలపై పేటెంట్ ఉంటే, వ్యాపారంలో అధిక లాభాల మార్జిన్లకూ అవకాశం ఉంటుంది. ఒకవేళ అప్పటికే ఉన్న పేటెంట్ల గడువు ముగుస్తుంటే, అది లాభాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ఉద్యోగులతో సంబంధాలు

కంపెనీలో పని విలువలు కూడా వాటాదారులకు విలువను తెచ్చి పెట్టే అంశాల్లో ఒకటి. మెరుగైన పని విధానం ఉన్న కంపెనీలు దీర్ఘకాలంలో వాటాదారులకు మంచి విలువను సమకూర్చాయని ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. కంపెనీ ఉద్యోగుల విషయంలో సముచితంగా వ్యవహరిస్తుంటే, మెరుగైన పని వాతావరణం ఉన్నప్పుడు వారు మరింత ఉత్పాదకత దిశగా పనిచేయగలరు.

వాటాల విలువ పలుచన అవుతోందా?

కంపెనీల మూలధనం పెరుగుతూ వెళుతోందా? ఏ రూపంలో అయినా కానీయండి, దీనివల్ల అప్పటికే కంపెనీలో ఉన్న వాటాల విలువ పలుచన వుతుంది. పెట్టుబడులకు ఎంపిక చేసుకునే కంపెనీల మూలధనం స్థిరంగా ఉండాలి. షేర్ల బైబ్యాక్ రూపంలో ఈక్విటీ తగ్గుతుంటే ఇంకా మంచిది. దీనివల్ల వాటాదారుల విలువ ఎప్పటికప్పుడు వృద్ధి చెందుతుంది. బ్యాంక్ స్టాక్స్‌కు ఈ విషయంలో మినహాయింపు ఇవ్వొచ్చు. ఎందుకంటే బ్యాంకులకు నిధులే వ్యాపార వస్తువు. కనుక అవి తాజా ఈక్విటీ జారీ ద్వారా ఎప్పటికప్పుడు నిధులు సమీకరిస్తూ, వ్యాపార విస్తరణపై వెచ్చిస్తుంటాయి.

ఇవి కూడా గమనించాలి..


- టెక్నాలజీ పరంగా కంపెనీ ముందుండాలి. కాలంతో పాటు వచ్చే మార్పులను ఆహ్వానించాలి. లేదంటే అస్తిత్వ ముప్పు ఏర్పడొచ్చు.
- కొన్ని రంగాల్లో చిన్న కంపెనీల కంటే పెద్ద కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వడమే మంచిది. ఉదాహరణకు టైర్ల రంగంలో చిన్న కంపెనీని ఎంపిక చేసుకోవడం కంటే ఎంఆర్ఎఫ్ వంటి పెద్ద కంపెనీలే దీర్ఘకాలంలో రాణించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి.
- ఓ కంపెనీ షేరు గణనీయంగా పడిపోయిందని ఇన్వెస్ట్ చేయడం సరికాదు. ఆ షేరు ఏ కారణాల వల్ల పడిపోయిందన్నది ముందుగా తెలుసుకోవాలి. జెట్ ఎయిర్‌వేస్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, యస్ బ్యాంక్ ఇలాంటి కేసులను అధ్యయనం చేయాలి. పడిపోతున్న షేరును కొనుగోలు చేయడం, పడిపోతున్న కత్తిని పట్టుకోవడంగా నిపుణులు చెబుతుంటారు.
- కంపెనీ రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌వోఈ) దీర్ఘకాలంలో పెద్దగా వృద్ధి లేకుండా అక్కడక్కడే చలిస్తుంటే.. దీనికి బదులు ఏటేటా ఆర్‌వోఈ వృద్ధి చెందే కంపెనీలే మెరుగైన రాబడులను ఇవ్వగలవు.
- సిమెంట్, మెటల్స్, షుగర్, ఆటోమొబైల్ ఇవన్నీ సైక్లికల్ కంపెనీలు. కొన్నేళ్ల కాలంలోనే ఎన్నో రెట్ల రాబడులు ఇచ్చిన తర్వాత, మళ్లీ ర్యాలీ చేయడానికి కొన్నేళ్ల సమయం తీసుకుంటాయి. ఇలాంటి కంపెనీల్లో అధిక వేల్యుయేషన్ల వద్ద ఇన్వెస్ట్ చేసే ముందు ఈ అంశాలను గమనించాలి.
- వాటాల పరంగా లిక్విడిటీ మెరుగ్గా ఉండాలి. అంటే ఫ్రీఫ్లోట్ మార్కెట్ క్యాప్ చెప్పుకోదగినంతగా ఉండాలి. లిక్విడిటీ తక్కువగా ఉంటే, మార్కెట్ కరెక్షన్లలో అమ్ముకోవడానికి అవకాశాలు తక్కువగా ఉంటాయి. కొద్దిపాటి అమ్మకాల ఒత్తిడికే షేరు ధర భారీగా పతనం చెందుతుంది. దీంతో భారీ నష్టాలు ఎదురవుతాయి. కంపెనీ షేరు ధరను కాకుండా, అంతర్గత విలువను (ఇంట్రిన్సిక్ వ్యాల్యూ) చూసిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగ్గా ఉండాలి. కంపెనీ వ్యవహారాలు పారదర్శకంగా ఉన్నప్పుడే, మార్కెట్ ఆ కంపెనీకి మెరుగైన విలువను కడుతుంది. ఇనిస్టిట్యూషన్స్ పెట్టుబడులతో ముందుకు వస్తాయి. కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగ్గా లేని కంపెనీలకు దూరంగా ఉంటాయి. సత్యం కంప్యూటర్స్, బ్రైట్‌కామ్ గ్రూప్, ఈకేఐ ఎనర్జీ వంటి కంపెనీల కేసులను ఇందుకు అధ్యయనం చేయొచ్చు.
- ప్రమోటర్ల వాటా కంపెనీలో ఎంత ఉందన్నది కూడా చూడాలి. కనీసం 20 శాతంపైన ఉంటే మంచిది. పైగా ప్రమోటర్లు తమకున్న వాటాలను తనఖా పెట్టారా? తనఖా పెట్టిన మొత్తం వారి వాటాల్లో 50 శాతం మించితే అటువంటి వాటికి దూరంగా ఉండాలి.



కారు రుణం ముందుగా చెల్లించడం ఎలా?

ఒకేసారి ఫ్లెక్సీక్యాప్, లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?
– వెంకట్రామన్ శ్రీనివాసన్


మీకు ఈక్విటీల గురించి మెరుగైన అవగాహన ఉంటే అప్పుడు లార్జ్‌క్యాప్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు పెట్టుబడులను కేటాయించుకోవచ్చు. తద్వారా పోర్ట్‌ఫోలియోని ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి బదులు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మరింత మెరుగైన ప్రత్యామ్నాయం అవుతుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు అన్ని రకాల మార్కెట్ విలువ కలిగి కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా మార్కెట్ విభాగాలకు ఫ్లెక్సీక్యాప్‌లో కేటాయింపులు వేర్వేరుగా ఉండొచ్చు. ఉదాహరణకు ఫ్లెక్సీక్యాప్ పథకాలు లార్జ్ క్యాప్ కంపెనీలకు ఎక్కువ కేటాయిపులు చేస్తుంటాయి. మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీలకు తక్కువ కేటాయింపులు చేస్తుంటాయి. అందుకని పెట్టుబడి మొత్తాన్ని ఒకే ఫ్లెక్సీక్యాప్ పథకంలో కాకుండా, కనీసం మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాలకు కేటాయించుకోవాల్సి ఉంటుంది. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువ ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కనుక విడిగా లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం సరైన నిర్ణయం కాబోదు. ఎక్కువ రిస్క్ తీసుకునే ఇన్వెస్టర్లు అయితే ఒకవైపు ఫ్లెక్సీక్యాప్‌లో ఇన్వెస్ట్ చేస్తూనే, మరోవైపు 15 శాతం వరకు పెట్టుబడులను మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవడం ద్వారా మెరుగైన రాబడులు సమకూర్చుకోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను రూ.7 లక్షలు రుణంపై కారు కొనుగోలు చేశాను. దీన్ని ముందుగా తీర్చివేయాలన్నది నా ప్రణాళిక. ఇందుకోసం ఇన్వెస్ట్ చేసుకునేందుకు అనుకూలమైన పథకాలు ఏవి? పీజీఐఎం ఇండియా మిడ్ క్యాప్ అపార్చునిటీస్ ఫండ్‌లో రాబడులను ప్రతి మూడేళ్లకోసారి వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయమేనా?
– ఆదిత్య బీ

కారు రుణాన్ని ముందుగా తీర్చివేయాలనుకోవడం మంచి నిర్ణయం. విలువ తరిగిపోయే కారు వంటి ఆస్తి కోసం రుణం తీసుకోవడం సూచనీయం కాదు. మీరు మీ కారు రుణాన్ని ఏడేళ్లలోపు తీర్చివేయాలని అనుకుంటున్నారు. కనుక స్వల్పం నుంచి మధ్యస్థ కాలానికి వీలుగా మ్యూచువల్ ఫండ్స్ పథకాలను ఎంపిక చేసుకోవాలి. పెట్టుబడులను కాపాడుకోవడంతోపాటు, రాబడులు కూడా ఇక్కడ కీలకం అవుతాయి. మీ కారు రుణాన్ని ముందుగా చెల్లించి వేయడం కోసం మీరు హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి ఇవి అనుకూలంగా ఉంటాయి. ఈక్విటీతోపాటు డెట్‌లోనూ ఈ పథకాలు పెట్టుబడులు పెడతాయి. దీంతో మీ పెట్టుబడి వృద్ధి చెందుతుంది. మార్కెట్ల పతనం, అస్థిరతలను ఎదుర్కొనే రక్షణ ఉంటుంది. మూడేళ్ల తర్వాత మీ కారు రుణాన్ని ముందుగా చెల్లించి వేయడం కోసం ప్రతి నెలా ఆదాయంలో మిగులును అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఒకవేళ మూడు నుంచి నాలుగేళ్లలోపే కారు రుణం తీర్చివేయాలని అనుకుంటే అందుకోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కారు రుణాన్ని ముందుగా వదిలించుకునేందుకు మీవద్ద నెలవారీ మిగిలే మొత్తం కీలక పాత్ర పోషిస్తుంది. ఇక పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ అపార్చునిటీస్ అనేది మిడ్‌క్యాప్ పథకం. మిడ్‌క్యాప్ ఫండ్స్ సహజంగా స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి అస్థిరతలతో ఉంటాయి. దీర్ఘ కాలంలో ఇవి మెరుగైన రాబడులు ఇవ్వగలవు. కనుక మూడేళ్లకోసారి లాభాలను వెనక్కి తీసుకోవడం సరైన నిర్ణయం అవ్వదు.



ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,707 టార్గెట్: రూ. 1,930


ఎందుకంటే: దేశీయంగా స్ట్రక్చరల్ స్టీల్ ట్యూబ్స్ తయారీకి ప్రసిద్ధి చెందిన ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ రాయ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన ప్లాంటును ఇటీవల సందర్శించాం. తద్వారా కంపెనీ తయారీ విధానాలపట్ల లోతైన అవగాహన కలిగించుకోవడంతోపాటు.. నిర్వహణాపరమైన సన్నద్ధతను అర్థం చేసుకోవడం, మార్కెట్లో ప్రత్యర్థి కంపెనీలతో తలెత్తే పోటీలో కంపెనీకున్న సానుకూల అంశాలను తెలుసుకోవడం తదితరాలకు ప్లాంటు సందర్శన దోహదపడింది. విలువ జత చేయగల ప్రొడక్టుల తయారీకి వార్షికంగా 1.2 ఎంటీతో ఏర్పాటైన రాయ్‌పూర్ ప్లాంటు సామర్థ్య వినియోగం క్రమంగా పుంజుకోనున్నట్లు అంచనా. నారో ఫ్లాట్ ప్రొడక్టుల లైన్ కోల్డ్ కమిషనంగ్(పరిశీలన) స్థాయిలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికాని(అక్టోబర్–డిసెంబర్)కల్లా నిలకడను సాధించనుంది. జనవరి– మార్చి(క్యూ4)లో నెలకు 60–70 కిలో టన్నుల రేటును అందుకోగలదని భావిస్తున్నారు. వివిధ పరిమాణాల, విభిన్న ప్రొడక్టుల తయారీలో ప్లాంటు సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఉదాహరణకు 1500 ఎంఎం రూఫింగ్ షీట్లు(ప్రత్యర్థి కంపెనీల నుంచి 1250 ఎంఎం మాత్రమే) రూపొందిస్తుంది. డిమాండుకు అనుగుణంగా సామర్థ్యాన్ని మరింత విస్తరించేందుకు వీలుంది. వార్షికంగా 300 కిలో టన్నుల వరకూ యూనిట్ ఏర్పాటుకు అనువైన భూమిని కలిగి ఉంది. వెరసి రాయ్‌పూర్ ప్లాంటు సామర్థ్య వినియోగం పుంజుకుంటే నిర్వహణ లాభం(ఇబిటా) సైతం మెరుగుపడే వీలుంది.



టీవీఎస్ సప్లై చైన్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 227 టార్గెట్: రూ. 265

ఎందుకంటే: థర్డ్ పార్టీ లాజిస్టిక్స్‌కు 2000 ప్రాంతంలోనే పేరొందిన టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్(టీఎస్‌సీఎస్) ప్రస్తుతం దేశీయంగా అతిపెద్ద సమీకృత సప్లై చైన్ సొల్యూషన్స్ దిగ్గజంగా ఆవిర్భవించింది. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. కెపాసిటీ(సామర్థ్యాలు), కస్టమర్, కంట్రీ(3సీ) వ్యూహాలతో గత 16 ఏళ్లకాలంలో ఏకంగా 20 కంపెనీలను కొనుగోలు చేసింది. ప్రపంచవ్యాప్తంగా కంపెనీ అత్యంత విస్తారిత రంగాలలో కార్యకలాపాలు కలిగి ఉంది. ఇండస్ట్రియల్, ఆటో, కన్జూమర్, హెల్త్‌కేర్, ఐటీ, టెక్ ఇన్‌ఫ్రా తదితర రంగాలలో సేవలు విస్తరించింది. మార్చితో ముగిసిన గతేడాది(2022–23) 8,700 మంది కస్టమర్లకు సర్వీసులు అందించింది. వీటిలో టాప్–5 నుంచి 18%, టాప్–10 నుంచి 28%, టాప్– 20 కస్టమర్ల నుంచి 39% చొప్పున ఆదాయం సాధించింది. వీటిలో 2022 జాబితా ఫార్చ్యూన్ 500 కంపెనీలలో 72 సంస్థలున్నాయి. కస్టమర్ కార్యకలాపాలతో మమేకంకావడం ద్వారా సహజంగానే కస్టమర్ సంస్థలతో దీర్ఘకాలిక సంబంధాలు కొనసాగించేందుకు వీలు చిక్కుతోంది. సమీకృత సరఫరా చైన్ సొల్యూషన్స్, నెట్‌వర్క్ సొల్యూషన్స్‌లో టాప్–10 కస్టమర్లతో సగటున 10–12 ఏళ్లగా సంబంధాలు కొనసాగిస్తోంది. వెరసి భారీ టర్నోవర్‌తోపాటు.. పటిష్ట మార్జిన్లను అంచనా వేయగలుగుతోంది. కాగా.. 2018–19లో చేపట్టిన భారీ కొనుగోళ్లు.. యూఎస్– చైనా వివాదాలు, రష్యా– ఉక్రెయిన్ యుద్ధం, కోవిడ్–19 తదితర సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం జోరందుకునేందుకు సిద్ధంగా ఉన్నాయి. కస్టమర్ల ఔట్ సోర్సింగ్ అవసరాలు పెరిగిపోతున్న నేపథ్యంలో కంపెనీకున్న సామర్థ్యాలు, ప్రపంచవ్యాప్త కార్యకలాపాలు భారీ లబ్ధిని చేకూర్చవచ్చు.



క్లుప్తంగా...

సైబర్ నేరాల పనిపట్టేలా..
కానిస్టేబుల్ శిక్షణలో కీలక మార్పులు

సాక్షి, హైదరాబాద్: మారుతున్న నేర సరళికి తగ్గట్టుగా పోలీస్ శిక్షణలోనూ ఉన్నతాధికారులు కీలక మార్పులు చేస్తున్నారు. ఇటీవలి కాలంలో బాగా పెరిగిన సైబర్ నేర దర్యాప్తుపై నూతన కానిస్టేబుళ్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేలా సిలబస్‌లో కీలక మార్పులు చేసినట్లు ట్రైనింగ్ ఐజీ తరుణ్ జోషి వెల్లడించారు. ప్రతి కానిస్టేబుల్‌కు సైబర్ నేర దర్యాప్తుపై అవగాహన ఉండేలా పలు అంశాలు జోడించినట్లు తెలిపారు. వచ్చే నెలలో ప్రారంభంకానున్న కానిస్టేబుళ్ల శిక్షణలో కొన్ని మార్పులు చేసినట్లు చెప్పారు. సైబర్ నేరాలతోపాటు పోలీసుల రోజువారీ విధి నిర్వహణ కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్ విధానాన్ని ట్రైనింగ్ నుంచే నేర్పిస్తామని వివరించారు. పౌరులతో నడుచుకోవాల్సిన విధానాలపైన, క్షేత్రస్థాయి విధుల్లో పోలీసుల ప్రవర్తనపైన ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తరుణ్ వెల్లడించారు. తెలంగాణ పోలీసులు వాడుతున్న టీఎస్‌కాప్, సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం) వంటి సాంకేతికత యాప్‌ల వాడకంపైనా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

చిక్కడపల్లి సీఐ నరేశ్‌పై సస్పెన్షన్ వేటు



చిక్కడపల్లి: అశోక్‌నగర్ హాస్టల్‌లో విద్యార్థిని ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేపథ్యంలో సరైన రీతిలో వ్యవహరించలేదనే ఆరోపణలపై చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ నరేశ్‌ను సస్పెండ్ చేశారు. ఆ ఘటన దరిమిలా శాంతి భద్రతలను కాపాడటంలో నిర్లక్ష్యం వహించిన సీఐ నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య ఉత్తర్వులను జారీ చేశారని చిక్కడపల్లి జోన్ ఏసీపీ ఎ.యాదగిరి వెల్లడించారు.

ప్రవల్లికది ప్రభుత్వ హత్యే: ఏబీవీపీ

సాక్షి, హైదరాబాద్: ప్రవల్లికది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఆరోపించారు. ఉద్యోగ నియామకాలు చేపట్టకుండా కేసీఆర్ ప్రభుత్వం ఐదేళ్లుగా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆమె ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. తొమ్మిదేళ్లుగా కాలయాపన చేసిన ప్రభుత్వం ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇవ్వడం మభ్యపెట్టే నాటకమని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో తప్పిదాలు కూడా ప్రభుత్వ కుట్రలో భాగమేనని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను రోడ్డున పడేసిందని విచారం వ్యక్తం చేశారు. నిరుద్యోగులు కొలువుల కోసం కష్టపడుతుంటే, వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఇష్టానుసారంగా పరీక్షల తేదీలు పొడిగించడం, వాయిదాలు వేయడం వల్లే మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రవల్లిక తల్లిదండ్రులకు రేవంత్ ఫోన్‌లో పరామర్శ

సాక్షి, హైదరాబాద్: ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగ యువతి ప్రవల్లిక తల్లిదండ్రులను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదివారం ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఈనెల 18న స్వయంగా వచ్చి కలుస్తానని ప్రవల్లిక తండ్రితో పేర్కొన్నారు. అంతకుముందు రేవంత్ విలేకరులతో మాట్లాడుతూ ఫోరెన్సిక్ నివేదిక రాకుండా నిరుద్యోగ యువతి ఫోన్ చాట్ ఉందని ఎలా చెబుతారని సంబంధిత పోలీసు అధికారిపై మండిపడ్డారు. వ్యక్తిగత వివరాలు బయటపెట్టి నిర్భయచట్టాన్ని ఉల్లంఘించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

జమాతే ఇస్లామీ నేతను కలిసిన రేవంత్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జమాతే ఇస్లామీ తెలంగాణ అధ్యక్షులు ముబీన్, మతపెద్ద ఖుస్రో పాషా అబ్జల్ బియాబానీలను ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

సోలాపూర్ బతుకమ్మ సంబురాలకు ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: భారత్ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఈనెల 22న మహారాష్ట్రలోని సోలాపూర్‌లో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్నారు. ఈనెల 17 నుంచి 22 వరకు కవిత పాల్గొనే బతుకమ్మ వేడుకల షెడ్యూల్‌ను ఆదివారం విడుదల చేశారు. 17న జగిత్యాల, 18న బోధన్, 19న ఆర్మూరు, 20న నిజామాబాద్ అర్బన్, 21న కోరుట్ల నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే బతుకమ్మ వేడుకల్లో కవిత పాల్గొంటారు.

నేడు గవర్నర్‌తో మహిళామోర్చా భేటీ

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర మహిళామోర్చా ప్రతినిధి బృందం సోమవారం ఉదయం 9 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళి సై సౌందరరాజన్‌ను కలవనుంది. పోటీ పరీక్షలకు సిద్ధమౌతున్న ప్రవల్లిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై గవర్నర్‌కు తమ ప్రతినిధి వినతిపత్రం అందజేయనున్నట్టు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు కె.గీతామూర్తి తెలిపారు.

అరెరెరె.. మర్చిపోయా!

ముదురుతున్న మతిమరుపు సమస్య

యువతపై సూడో డిమెన్షియా ప్రభావం.. ● మల్టీ టాస్కింగ్ నుంచి ఒత్తిడి దాకా కారణాలెన్నో...

బాగా తెలిసిన వ్యక్తుల పేర్లను మర్చిపోవడం, మన బండి తాళాలను తరచుగా వెతుక్కోవడం, ఒకటి రెండ్రోజుల క్రితం చూసిన సినిమా పేరు కూడా గుర్తు లేకపోవడం.. ఈ లక్షణాలను వైద్యులు 'సూడో-డిమెన్షియా'గా పేర్కొంటున్నారు. డిమెన్షియా అనేది ఓ వయసు దాటాక వృద్ధాప్యంలో చుట్టుముట్టే వ్యాధి కాగా.. ప్రస్తుతం యువతపై కూడా ఇది ప్రభావం చూపుతోంది. దీని బారిన పడిన రోగులకు తరచుగా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి లోపించడం నిరాశ లేదా అతిగా ఆలోచించడం వంటి లక్షణాలు ఉంటాయి.

"అతనూ.. మన ఆఫీస్‌లో పనిచేస్తాడే.. పేరేంటో మర్చిపోయానబ్బా"
"నిన్ననే నెట్‌ఫ్లిక్స్‌లో చూశా సినిమా చాలా బాగుంది.. పేరేంటంటే, నోట్లో నానుతూనే ఉంది.. గుర్తు రావడం లేదు"
"మమ్మీ.. బైక్ కీస్ కనపడటం లేదు, కాస్త చూడు ఎక్కడ పెట్టానో గుర్తురావడం లేదు"
ఇలాంటి మాటలు మీరు తరచుగా అంటుంటే.. లేదా ఎవరి నుంచైనా వింటుంటే.. సిల్లీగా తీసుకోకండి. ఎందుకంటే ఇది కూడా ఒక వ్యాధి. దాని పేరు సూడో డిమెన్షియా!



కేసులు పెరుగుతున్నాయి...

ప్రధానంగా అధిక ఒత్తిడి, మల్టీ టాస్కింగ్, తద్వారా చోటు చేసుకుంటున్న నిస్పృహ, నిరాశ.. వంటివి ఈ పరిస్థితికి కారణం. ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన న్యూరాలజీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ గుప్తా మాట్లాడుతూ, "యువతలో గణనీయంగా మతిమరుపు కేసులు పెరుగుతున్నాయి. ఇటువంటి సమస్యల నుంచి పరిష్కారం కోరుతూ నెలలో కనీసం 5–10 మంది వరకూ 50 ఏళ్ల లోపు వారు మమ్మల్ని సంప్రదిస్తున్నారు"అని చెప్పారు. "ప్రస్తుతం యువతలో కెరీర్-సంబంధిత ఒత్తిడి బాగా ఉంటోంది. తద్వారా అధిక పనిభారం సర్వసాధారణమైంది. సోషల్ స్టేటస్ గురించి ఆందోళన కూడా దీనికి తోడవుతోంది. ఇలాంటివన్నీ మెదడుపై తీవ్ర ఒత్తిడిని కలిగిస్తాయి, అది సమాచారాన్ని పూర్తిగా ప్రాసెస్ చేయడమనే దాని విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తుంది, ఎక్కువ సమయం పాటు ప్రాసెసింగ్ చేసే 'మల్టీ టాస్కింగ్'కూడా జ్ఞాపకశక్తిని కోల్పోయేలా చేస్తుంది"అని డాక్టర్ గుప్తా చెప్పారు.

మెమొరీ.. మెదడే దారి..

"ఓ విషయంపై శ్రద్ధ పెట్టడం, దాన్ని స్వీకరించడం అనంతరం దాన్ని నిలుపుకోవడం.. ఇలా జ్ఞాపకశక్తి మూడు భాగాలుగా రూపుదిద్దుకుంటుంది. దీనిలో ప్రతి దశకు మెదడు నుంచి సహకారం అవసరం, కానీ అధిక స్థాయి పని ఒత్తిడి దాని పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సూడో డిమెన్షియా వెనుక కారణాల గురించి తెలుసుకున్న తర్వాత కొద్దిపాటి ప్రయత్నం ద్వారా దాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. ఏకాగ్రత సాధించేందుకు ప్రయత్నించడం, డిప్రెషన్‌కు చికిత్స తీసుకోవడం వల్ల పరిస్థితి మెరుగుపడుతుంది, ఆందోళన తగ్గుతుంది"అని గుప్తా వివరించారు.

– సాక్షి, హైదరాబాద్

"ఈ తరహా లక్షణాలతో నెలకు 10–12 మంది రోగులు వస్తున్నారు. పని ఒత్తిడి, అతిగా ప్రతికూల ఆలోచనలు, ఒకే సమయంలో అనేక పనులు చేయాలనే మల్టీ టాస్కింగ్.. ఇతరులతో సమస్యల కారణంగా మానసిక ఆందోళన పెరుగుతుంది. మనసులో తెలియని ఆరాటం, ఆత్రుత ఉన్నప్పుడు, అనేక రకాల పనులు చేయలేం. కౌన్సెలింగ్ సెషన్‌లు, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ రిలాక్సేషన్‌లు ఈ పరిస్థితితో బాధపడుతున్న వ్యక్తులు కోలుకోవడానికి సహాయపడతాయి".

– డాక్టర్ ఆర్తీ ఆనంద్, ప్రముఖ సైకాలజిస్ట్

బీఆర్ఎస్ కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలి

కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి
- కేసీఆర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారు
- పేదల ఇళ్ల కోసం కేంద్రం ఇస్తున్న నిధులను తొక్కిపెట్టారు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర గ్రామీణ అభివృద్ధి సహాయక శాఖ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి

ముషీరాబాద్/అంబర్‌పేట్: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలనతో సాగుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయక మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి విమర్శించారు. తెలంగాణలో ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి కేసీఆర్ కుటుంబం కోసమే పని చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో డబుల్ ఇంజన్ బీజేపీ సర్కార్ వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు అంతమొందించి బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లో, అంబర్‌పేటలో గంగపుత్ర ఆత్మీయ సమ్మేళన సభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన సాధ్వి నిరంజన్ జ్యోతి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో పేదల ఇళ్ల కోసం కేంద్రం ఇస్తున్న నిధులను బీఆర్ఎస్ ప్రభుత్వం తొక్కిపెట్టి ప్రజలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గంగపుత్రుల సంక్షేమానికి కేంద్రం పెద్ద పీట వేస్తోందన్నారు. బీజేపీలో సామన్యుడు సైతం అత్యుత్తమ పదవి చేపట్టవచ్చని, అందుకు ప్రధాని పదవి చేపట్టిన మోదీ నిదర్శనం అని చెప్పారు.

పార్టీల నేతలకు పంచిపెడుతున్నారు: కిషన్‌రెడ్డి

కొడుకును ముఖ్యమంత్రి చేయాలన్నదే కేసీఆర్ ఎన్నికల ఎజెండా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. అక్రమంగా దోచుకున్న ప్రజా సొమ్మును పార్టీల నేతలకు, వివిధ సంఘాలకు పంచిపెడుతూ మూడోసారి గెలవడానికి కేసీఆర్ అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు చమరగీతం పాడతారన్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్నప్పటికీ మోదీ మత్స్య రంగం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి గంగపుత్రుల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. బీజేపీ ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక న్యాయం సీఎం కేసీఆర్ కుటుంబానికే దక్కుతోందన్నారు. ఈ సందర్భంగా సాధ్వి, కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్‌లను ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజుతోపాటు వివిధ గంగపుత్ర సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.

ప్రకృతి ప్రకోపానికి మూల్యం...
రూ. 10.26 లక్షల కోట్లు!

- విపత్తులతో పంటలు, పశువులకు ఏటా వాటిల్లుతున్న నష్టమిది...
- 30 ఏళ్లలో.. రూ. 316 లక్షల కోట్లు ఆవిరి!


(సాక్షి, సాగుబడి డెస్క్)



అధిక ఉష్ణోగ్రతలు, కరువు, వరదలు, తుపాన్లు, భూకంపం, కార్చిచ్చులు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులు పెను సవాళ్లు విసురుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి గతమెన్నడూ లేనంత ఎక్కువ సార్లు, తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. పంటలు, పశువులకు విపత్తుల వల్ల ప్రతి ఏటా రూ. 10.26 లక్షల కోట్ల (12,300 కోట్ల డాలర్లు) నష్టం వాటిల్లుతుంది. గత 30 ఏళ్లలో రూ. 316 లక్షల కోట్లు (3.8 లక్షల కోట్ల డాలర్లు) నష్టం వాటిల్లిందని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) తాజా అధ్యయనంలో తేలింది. ప్రపంచ ఆహార దినోత్సవం(అక్టోబర్ 16) సందర్భంగా 'వ్యవసాయం, ఆహార భద్రతలపై విపత్తుల ప్రభావం'పేరుతో వెల్లడించిన మొట్టమొదటి సమగ్ర నివేదికలో ఎఫ్ఏఓ ఈ వివరాలను తెలిపింది.

ఎఫ్ఏఓ నివేదికలోని ముఖ్యాంశాలివీ...

- పంటలు, పశువులకు గత (1991–2021) 30 ఏళ్లలో ప్రకృతి విపత్తుల వల్ల 3.8 లక్షల కోట్ల డాలర్ల మేర నష్టం జరిగింది. ప్రధానంగా అధిక ఉష్ణోగ్రతలు (26%), కరువు (19%), వరదలు (16%) వల్ల వీటికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.
- ప్రపంచవ్యాప్తంగా విపత్తుల వల్ల పంటలు, పశువులకు జరిగే ఆర్థిక నష్టంలో సగానికి సగం ఆసియా దేశాల్లోనే జరుగుతోంది. ఆసియా దేశాలు 45% (1,72,000 కోట్ల డాలర్లు), ఉత్తర, దక్షిణ అమెరికా దేశాలు 22% (82,800 కోట్ల డాలర్లు), యూరప్ దేశాలు 17% (65,900 కోట్ల డాలర్లు), ఆఫ్రికా దేశాలు 15% (57,800 కోట్ల డాలర్లు), ఓసియానియా 1% (5,500 కోట్ల డాలర్లు) నష్టపోయాయి.
- ప్రతి ఏటా సగటున నష్టం 12,300 కోట్ల డాలర్లు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి కనీసం 5% ప్రకృతి విపత్తుల వల్ల చిల్లుపడుతోంది. అంటే గత 30 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా పంటలు, పశువులకు జరిగిన నష్టం.. 2022లో బ్రెజిల్ జీడీపీకి సమానం!
- అల్పాదాయ దేశాలు, అల్ప-మధ్య ఆదాయ దేశాల్లో ఈ నష్టం అత్యధికంగా వాటి జీడీపీల్లో 10–15% వరకు ఉంటోంది.
- గత 30 ఏళ్లలో గణాంకాలను పరిశీలిస్తే.. విపత్తుల వల్ల సగటున ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 6.9 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి చేజారిపోతోంది. 2021లో ఫ్రాన్స్‌లో ఉత్పత్తయిన మొత్తం ఆహార ధాన్యాలతో ఇది సమానం.
- ఏడాదికి 4 కోట్ల టన్నుల పండ్లు, కూరగాయలు, చెరకు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోతున్నాం. 2021లో వియత్నాం, జపాన్ ఉత్పత్తి చేసిన పండ్లు, కూరగాయలతో ఇది సమానం.
- మాంసం, పాల ఉత్పత్తులు, గుడ్ల ఉత్పత్తిలో ఏటా 1.6 కోట్ల టన్నులు కోత పడుతోంది. 2021లో భారత్, మెక్సికో దేశాల్లో ఉత్పత్తయిన వాటికి ఇది సమానం.
- అయితే, వ్యవసాయ జీడీపీలో ఆసియా దేశాలు 4% విపత్తుల వల్ల కోల్పోతుంటే.. ఆఫ్రికా దేశాలు 8% వరకు కోల్పోతున్నాయి.
- పోషకాల పరంగా చూస్తే.. విపత్తుల వల్ల గత 30 ఏళ్లుగా ప్రతి రోజూ ఒక్కొక్కరు 147 కిలో కేలరీలను నష్టపోతున్నారు. విపత్తులతో కోల్పోతున్న ఆహారం ప్రతి రోజూ 40 కోట్ల మంది పురుషులు లేదా 50 కోట్ల మంది మహిళల ఆకలి తీర్చడానికి సరిపోతుంది.
- కార్చిచ్చుల వల్ల ఏటా 34–37 కోట్ల హెక్టార్ల భూమిలో పచ్చదనం దగ్ధమవుతోంది. ఒక్క 2021లోనే 2.5 కోట్ల అడవులు తగులబడ్డాయి.
- పంటలను రక్షించుకోవడానికి ఉపకరించే, వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకునే, ప్రకృతికి అనుగుణమైన వ్యవసాయ పద్ధతులను అమల్లోకి తేవాలి.
- వాతావరణ మార్పుల వల్ల ఇతర దేశాల నుంచి వచ్చిపడే సరికొత్త చీడపీడలు పంటలకు కలిగిస్తున్న నష్టం గురించి అంచనా వేయగలిగే యంత్రాంగం, కొలమానం కొరవడ్డాయి. ఈ నష్టం సంపన్న దేశాల్లో ఎక్కువగా ఉంటోంది.
- సాంకేతిక సహకారం, క్షేత్రస్థాయిలో ఉత్తమ సాగు పద్ధతులను అనుసరిస్తే వ్యవసాయంలో విపత్తుల నష్టాన్ని నివారించుకోవచ్చు, తగ్గించుకోవచ్చు. తద్వారా వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకోవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలపై రూపాయి వెచ్చిస్తే 7 రూపాయిల మేరకు ప్రయోజనం కలుగుతోందని అంచనా.



ఆదిలక్ష్మిగా శ్రీ లక్ష్మీతాయారు



భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు తొలిరోజు ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామపారాయణ హవనం, స్నపన తిరుమంజనం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారు సోమవారం సంతానలక్ష్మిగా దర్శనమిస్తారు.



శైలపుత్రిగా జ్ఞాన సరస్వతి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో ఆదివారం దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 గంటల నుంచే ఆలయంలో అర్చకులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలోనే భక్తులు సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు మొదటి రోజు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కట్టిపొంగలి నైవేద్యంగా సమర్పించారు.



బాలా త్రిపురసుందరిగా శ్రీభద్రకాళి

హన్మకొండ కల్చరల్: హనుమకొండ జిల్లాలోని చరిత్రాత్మక శ్రీభద్రకాళి దేవాలయంలో ఆదివారం శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని బాలాత్రిపురసుందరి దేవిగా అలంకరించారు. అనంతరం వాహన సేవలు నిర్వహించారు. అమ్మవారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శైలపుత్రిగా జోగుళాంబ దేవి

(అలంపూర్): రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తొలిరోజు శైలపుత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు సుహాసిని, కుమారి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ధ్వజమండపం వద్ద రోజూ దర్బార్‌సేవతోపాటు ప్రత్యేక పూజలు చేస్తారు.



వచ్చే మూడు రోజులు మంటలే...

నెలాఖరులో వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న మూడు రోజులు సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ సూచించింది. రాష్ట్రంలో మూడు రోజులపాటు పొడి వాతావరణమే ఉంటుందని, ఈ సమయంలో సగటున 3 డిగ్రీల నుంచి 5 డిగ్రీల మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని హెచ్చరించింది. రాష్ట్రానికి తూర్పు, ఈశాన్య దిశల నుంచి గాలులు వీస్తున్నాయని, దీంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉన్నప్పటికీ పగటి ఉష్ణోగ్రతల్లో సాధారణం కంటే వ్యత్యాసం ఉంటుందని సూచించింది. ఈ నెలాఖరులో బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో రెండు తుపానులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ తుపానులు బలపడితే రాష్ట్రంలో రెండు మూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు సైతం నమోదు కావొచ్చని ప్రకటించింది. ఆదివారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 36.0 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 19.8 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ట ఉష్ణోగ్రత	కనిష్ట ఉష్ణోగ్రత
ఖమ్మం	36.0	26.6
నిజామాబాద్	35.4	23.1
భద్రాచలం	35.2	25.5
ఆదిలాబాద్	35.0	21.7
రామగుండం	34.4	23.5
మెదక్	34.2	19.8
హన్మకొండ	34.0	22.5
హైదరాబాద్	33.7	22.2
హకీంపేట్	33.5	21.1
దుండిగల్	33.3	22.2
నల్లగొండ	33.0	23.2
మహబూబ్‌నగర్	31.9	24.0

ఇక జేఈఈ శిక్షణ లేనట్టేనా?

- ఇంటర్ కాలేజీల్లో శిక్షణపై విద్యార్థుల్లో గందరగోళం
- జనవరిలోనే జేఈఈ మెయిన్స్
- ప్రభుత్వ కాలేజీల్లో ఇంకా అడ్మిషన్లే
- ఆరంభ దశలోనే సిలబస్
- పోటీ పరీక్షల సన్నద్ధతపై అయోమయం
- ఎన్నికల విధుల్లోకి కాలేజీ సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల కోచింగ్ ప్రక్రియపై సందేహాలు నెలకొంటున్నాయి. ఈ ఏడాది ప్రత్యేక శిక్షణకు ఆస్కారం ఉండేట్టు కన్పించడం లేదు. దేశవ్యాప్తంగా వచ్చే జనవరిలో తొలి విడత మెయిన్స్ నిర్వహిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఇప్పటికే ప్రకటించింది. సిలబస్‌లోనూ కొన్ని మార్పులుండే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ నుంచే జేఈఈకి విద్యార్థులు తర్ఫీదు అవ్వాల్సి ఉంటుంది. ప్రతీ సంవత్సరం ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులకు జేఈఈపైప్రత్యేక శిక్షణ నిర్వహిస్తారు. ఇందుకోసం అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమిస్తారు. వీరికి ప్రత్యేక పారితోషికం కూడా ఇస్తారు. కానీ ఈ సంవత్సరం జేఈఈ మెయిన్స్‌పై ఇంటర్ బోర్డు ఇంత వరకూ ఎలాంటి కసరత్తు చేయలేదు. కనీసం సమీక్ష కూడా చేసిన దాఖలాల్లేవు. మరోవైపు ప్రైవేటు కాలేజీలు ఇంటర్ సిలబస్ పూర్తి చేసుకుని, జేఈఈ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలపై శిక్షణ కూడా ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు అయోమయంలో ఉన్నారు. ఇంటర్ బోర్డ్ నుంచి ఆదేశాలు రాకపోవడంతో పోటీ పరీక్షల శిక్షణ ఉంటుందా? లేదా? అన్న గందరగోళం సర్వత్రా కన్పిస్తోంది.

ఎన్నికల విధుల్లో సిబ్బంది.. పూర్తికాని సిలబస్

వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పట్నుంచే కాలేజీ సిబ్బందిని తీసుకుంటున్నారు. ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల్లో తనిఖీల కోసం లెక్చరర్లను ఆయా జిల్లా కలెక్టర్లు తీసుకున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ ప్రత్యేక విధులు అప్పగించేందుకు కసరత్తు నడుస్తోంది. దసరా సెలవుల తర్వాత నుంచి ఎన్నికల వరకూ చాలా కాలేజీల్లో అధ్యాపకులు బోధన విధుల నుంచి దూరంగా ఉండే వీలుంది. ప్రభుత్వ కాలేజీల్లో ఫస్టియర్ అడ్మిషన్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సిలబస్ బోధన కూడా అంతంత మాత్రంగానే జరిగింది. 70 శాతం కాలేజీల్లో రెండో ఏడాది సిలబస్ 35 శాతం పూర్తయినట్టు ఇటీవల జిల్లా ఇంటర్ విద్య అధికారులు బోర్డుకు నివేదించారు. ఈ దశలో తమను కలెక్టర్లు ఎన్నికల విధుల్లోకి దించుతున్నారని, దీని వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని ఇంటర్ బోర్డ్ దృష్టికి తెచ్చారు. ఈ పరిస్థితిపై బోర్డు అధికారులు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత డిసెంబర్, జనవరిలో ప్రత్యేకంగా అదనపు క్లాసులకు ఏర్పాట్లు చేయడం తప్ప మరో మార్గం లేదని బోర్డ్ అధికారులు అంటున్నారు. అలా చూసినా జనవరిలో జరిగే జేఈఈకి ఎలా శిక్షణ ఇస్తామనే సందేహం అధ్యాపకుల నుంచీ వస్తోంది. జిల్లా కలెక్టర్లు ఈ విషయాన్ని పరిశీలించాలని అధ్యాపక సంఘాలు అంటున్నాయి.

పోటీ పరీక్షలపై ఆలోచిస్తున్నాం

ద్వితీయ సంవత్సరం విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. కానీ ఎన్నికల విధుల్లోకి సిబ్బంది వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కూడా ముఖ్యమైన బాధ్యతే. అయినప్పటికీ ఎన్నికల తర్వాత సిలబస్‌పైనా, పోటీ పరీక్షలపై సీరియస్‌గా దృష్టి పెడతాం. విద్యార్థులను అవసరమైన రీతిలో సన్నద్ధం చేస్తాం.

– జయప్రదాభాయ్ (ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి)

విద్యార్థులను దృష్టిలో ఉంచుకోవాలి

ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో పేద విద్యార్థులు చదువుతారు. పోటీ పరీక్షలకు అవసరమైన రీతిలో శిక్షణ ఇస్తే మంచి ర్యాంకులు సాధిస్తారు. ఏటా ఈ దిశగా విజయం సాధిస్తున్నారు. అధ్యాపకులను ఎన్నికల విధుల్లోకి తీసుకునే ముందు, కాలేజీల్లో బోధన, పోటీ పరీక్షల శిక్షణపైనా దృష్టి పెట్టాలి. వారికి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ఇంటర్ బోర్డ్‌పై ఉంది.

– మాచర్ల రామకృష్ణ గౌడ్ (ప్రభుత్వ జూనియర్ కాలేజీల అధ్యాపకుల సంఘం రాష్ట్ర కన్వీనర్)

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.